# పాడుకాలం

## విశాఖపట్నం వచ్చే వారిని ఆహ్వానిస్తోంది-వెళ్ళే వారికి వీడ్కోలిస్తోంది- చావులమదుం జంక్షను

ఆ డిసెంబరు నెల ఉదయం చలిచలిగా ఉంది. బస్సుల కోసం ఆ జంక్షనుకు ఆ ఉదయం వేళ చేరుకున్న వాళ్ళలో ఎక్కువమంది పనివాళ్ళు.

అప్పటికింకా విశాఖపట్టణం, ప్రైవేటు బస్సుల మీదే నడుస్తోంది. కెపాసిటీ రూలు వల్ల బస్సులు ఆగకుండా పోతున్నాయి. ముందుగా వచ్చినవాళ్ళు వెనక వస్తున్న జనాన్ని చూసి- 'ఏం లాభం ముందువచ్చి?'- అనుకుంటున్నారు.

వెనకాల చేరిన వాళ్ళు- ముందుగా రాలేదని బాధ ఎందుకులే- అనుకుంటున్నారు.

మధురవాడ, పెదవాల్తేరు లాంటి ప్రాంతాల నుంచి సైకిళ్ళు తొక్కుకుని వస్తున్న వాళ్ళు చెమటలు కక్కుతున్నారు. అందులో కొందరు బాక్ సీట్ యిస్తున్నారు.

నడిచిపోయినా పోయే వాళ్ళం- కొందరి విచారం.

యిప్పుడు చుట్టుదోవ- యీ పైపుల మీంచి నడవలేం- కొందరి నిరాశ.

ఈ కెపాసిటీ రూలు తీసేస్తే బాగుండును- కొందరి పరిష్కారం. 'ఎవడు పాటిస్తున్నాడు-

మనని ఏడిపించటానికి కాని-' కొందరి అభియోగం.

ఆ జనంలోకి చేరిన వాళ్ళలో రామ్మూర్తి ఒకడు.

అతని 'కీలుగుర్రం' వైద్యశాలకి వెళ్ళింది. నెలాఖరు రోజుల్లో దానికి మదుపు పెట్టలేక బస్సుకి వచ్చాడు.

ఫోర్‌మన్‌కి తనకీ పడటం లేదన్న విషయం పదేపదే అతని బుర్రలో మెదులుతోంది.

ఇంతలో అటునుంచి ఓ ఖాళీ బస్సు వచ్చింది.

పదండి పదండంటూ ఉషారిచ్చి బస్సుకి అడ్డంగా పరిగెత్తాడు.

రామ్మూర్తినీ జనాన్నీ చూసి బస్సు ఆగిపోయింది.

లైను మీద లేదని కండక్టరూ డ్రైవరూ మొత్తుకున్నారు.

రామ్మూర్తి వాళ్ళని బుజ్జగించాడు. బెదిరించాడు. చివరకి 'ఓ ట్రిప్పు యేసేద్దారి-' డ్రైవర్ని సర్దాడు కండక్టరు.

'బస్సు సరినేదురా నంజికొడకా-' తిడుతూనే బస్సుని తిప్పాడు డ్రైవరు.

అయస్కాంతానికి ఇనపరేణువులు అతుక్కుని పోయినట్లు ఎక్కేసారు బస్సులోకి-జనం.

రామ్మూర్తి బస్సులోకి చూసాడు. తమ వాళ్ళు చాలామంది ఉన్నారు బస్సు కదిలింది.

కంపు వదిలింది. చలిగాలి వీస్తున్నా జనం రద్దీవల్ల వెచ్చగా ఉంది.

'పట్టుకుంటే నా పనయిపోద్ది-' అన్నాడు కండక్టరు రామ్మూర్తితో టికెట్ కొడుతూ.

'ఫర్లేదు బెదరూ-' రామ్మూర్తి అతని భుజాన్ని చరిచాడు. మోహనరావు వెనకాల గేట్లోంచి పెద్దగొంతుతో రామ్మూర్తిని పలకరించాడు.

జనాన్ని చీల్చుకుని వెనక్కి కదిలాడు రామ్మూర్తి.

మోహనరావు కాస్త లావుగా ఎత్తుగా ఉంటాడు. నిర్లక్ష్యంగా కనిపిస్తాడు.

''ఏంటి గురూ!'' అడిగాడు రామ్మూర్తి.

''ఇయ్యేల కొత్త యముడు దిగుతున్నాడు-''

''ఎవడాడు?''

''అంబలగన్ పోయాడు గదా- ఈసారి బెంగాలీ దొరని దింపుతున్నారు-''

''ఎవడయితే మనకేం లే- మనకి యిచ్చిన కాడికి మనం పని చేసుకు పోతాం-'' అన్నాడు రామ్మూర్తి.

''మనకి బొక్కపెడితే- గాజులు తొడిగించుకుని కూర్చునిలేం-'' అన్నాడు మోహనరావు.

''ఏంటి బెదరూ-'' వెనక నుంచి ఎవరో పలకరించారు.

కబుర్లు సాగుతూండగానే బస్సు గమ్యం చేరుకుంది. బిలబిలలాడుతూ పనివాళ్ళు కిందకి ఉరికారు. ఏడు గంటల మీద యిర్వై రెండు నిమిషాలయింది. జంక్షన్‌కీ మీనాంబికా యిండస్ట్రీస్ గేటుకి మూడు ఫర్లాంగులుంటుంది.

7 - 33 లోగా పంచింగ్ అవాలి. లేకపోతే లేట్ మార్క్ తప్పదు.

పరుగులాంటి నడకతో మీనాంబికా యిండస్ట్రీస్ పనివాళ్ళు సుడిగుండంలోకి దూసుకుపోతున్నట్లు పోతున్నారు.

బొయ్యమని ఫ్యాక్టరీ సైరన్ మొదలయింది. అది రమ్మని ఆహ్వానిస్తున్నట్లూ లేదు. ఎతిమాలుతున్నట్లూ లేదు. వస్తావా పీక తీసెయ్యనా- అని బెదిరిస్తూన్నట్లుంది. పరుగు తియ్యమన్నట్లుంది.

'నంజికొడుకులు- టయిం కాకుండానే కూమనిపిత్తారు-' అన్నాడు కొర్లయ్య చేతిలో కారేజి మార్చుకుంటూ- వాచీ చూస్తూ.

'నీ వోచి పట్టుకెల్లి పట్టాలమీద యెట్టు-' అన్నాడు మరో నవ్వులరాయుడు.

'గేటుకాడయినా నేదు పంచింగు మెసీను-' మరొకడు అంటున్నాడు.

'యింటికాడ యెడతాంరా- పంచింగు మెసీను. పంచింగ్ చేసేసి మంచం ఎక్కియే-'' యింకొకడు నవ్వుల రాయుడిని తిట్టాడు.

''మీనాంబికా యిండస్ట్రీస్-'' పెద్ద బోర్డు కింద పెద్ద గేటు. లోపలికి తనిఖీ చేసి వదుల్తున్నారు సెక్యూరిటీ వాళ్ళు.

'రోజూ సూసే ముఖాలికి- ఎందుకురా యిన్ని తనిఖీలు-' అన్నాడొకడు సెక్యూరిటీ గార్డుతో,

'ప్రతి ఫ్యాక్టరీలోనూ యెళ్ళేటప్పుడు తడముతారు. యీళ్ళు లోపలికొస్తే కూడా తడముతారు-' అంటున్నాడొకడు.

ఫ్యాక్టరీ ఆవరణలో ప్రవేశించగానే మానేజర్లూ గుమస్తాలూ కూర్చునే ఆఫీసు. ఆ తర్వాత లేబర్ ఆఫీసర్ రూం. అక్కడే పంచింగ్ మెషిన్లు. రెండే రెండున్నాయి. పొద్దుటిపూట అంత రద్దీగా ఉండకపోయినా మధ్యాహ్నం సాయంత్రమూ విపరీతమయిన రద్దీ. ఆ సమయంలో మానేజ్‌మెంట్‌ని తిట్టుకోని వాడు ఉండడు.

ఆరోజు బస్సులు లేటవటం వల్ల రద్దీ తక్కువగా ఉంది. ఒక గుమాస్తా వచ్చి టైంకి వచ్చినవాళ్ళ నంబర్లు తీసుకుంటున్నాడు. రామ్మూర్తిని చూడగానే 'హలో' చెప్పి నంబరు రాసుకున్నాడు. డ్రస్సింగ్ లాకర్స్ దగ్గర పనివాళ్ళు బట్టలు విడిచిపెట్టి డాంగ్రీలు వేసుకుంటున్నారు. కొందరు టూల్ బాక్సులు తీసుకుంటున్నారు.

పని మొదలయింది.

టీ టయిమ్‌కి కొత్త మానేజర్ వచ్చిన వార్త వ్యాపించింది. టీలు తాగుతూ అక్కడా యిక్కడా చతికిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు.

''మంచి గట్టోడట గురూ-'' అన్నాడు సుదర్శనం.

''మనం కాదేంటి-?'' నవ్వాడు రామ్మూర్తి.

''నువ్వు ఉక్కు మనిషివి-'' అన్నాడు లక్ష్మణరావు.

'ఏట్రా అల్లుళ్లూ-' అంటూ రాజులు చేరాడు అక్కడ.

రామ్మూర్తి అతన్ని పట్టించుకోలేదు- 'మానేజర్లు వస్తారు. పోతారు. ఆళ్ళూ జీతాలుచ్చుకుంటారు. మనమూ పుచ్చుకుంటాం- ఆడిపని ఆడిది- మన పని మనది-'' అన్నాడు.

'ఓరి పిచ్చాడా- మనకీ, మనని ఆజమాయిషీ చేసేవాళ్ళకీ చాలా తేడా ఉంది. వాళ్ళకి స్కూటర్ లోన్లిస్తారు. అలవెన్స్ యిస్తారు. పది మందిని బాగా చూస్తే పన్నెండొందల మందిని వాళ్ళు పిండి పని చేయిస్తారు-'' అన్నాడు సుదర్సనం.

'మా ఆడది పాలుపిండినట్టు-' అన్నాడు రాజులు.

అందరూ నవ్వారు.

★★★

ఆ కారు పొడవుగా ఉంది, అది తళతళ లాడుతోంది. అందులోంచి దిగుతున్న ఆనంద కుమార్ గంగూలీకి స్వాగతం చెప్పాడు తిరుమలరావు.

కరచాలనాలు మొదలయాయి.

గంగూలీకి గుమస్తాలందరినీ పరిచయం చేసాడు తిరుమలరావు. అతని గదిలోకి తీసుకు వెళ్ళాడు.

''మీరు విశ్రాంతి తీసుకోండి-'' అంటూ బయటకి నడిచాడు.

ఆ గది- అందులో ఉండగలిగిన వాళ్ళని- మామూలు పనివాళ్ళ నుంచి వేరు చేయటానికి తగిన అన్ని హంగుల్తోనూ ఉంది. అందులో కూచునే వాళ్ళకి జీతం పుచ్చుకుని పని చేస్తున్నామన్న స్పృహ కలగకుండా పడిన జాగ్రత్తలా ఉంది. ఆ గది గోడల మీద దేశ భవితవ్యం గూర్చి కలలు కంటున్న కళ్ళతో ఉన్న నాయకులున్నారు. వాళ్ళ ఆశలు ఆ గదిలో మాత్రమే సఫలమయాయని తెలిసిపోతుందన్న భయంతో ఫ్రేములో బంధించబడినట్లు కనిపిస్తున్నారు.

కస్టమర్ గురించి గాంధీగారి సూక్తి ఒకటి ఫొటోలో కనిపిస్తోంది.

ఆరోజంతా ఫ్యాక్టరీ వివరాలన్నీ తెలుసుకోగలిగినంత తక్కువ సమయంలోనే

తెలుసుకున్నాడు. ప్రొడక్షన్‌కీ- మార్కెటింగ్‌కీ- పర్చేజ్‌కీ ఉన్న ముగ్గురు ఎగ్జిక్యూటివ్‌లనీ రప్పించి మాట్లాడాడు. ఇందరున్నా అందరూ ఒకరి ఆజ్ఞల కోసం ఎదురుచూసే మనుషులుగానే- అంతకుముందున్న అంబళగన్- వారిని ఉంచినందుకు ఆనందకుమార్ లోపల్లోపల సంతోషించాడు.

సాయంత్రం నాలుగ్గంటలకు తిరుమలరావుని లోపలికి పిలిచాడు, కూర్చోమన్నాడు.

''అంబళగన్‌నీ ఛార్జిమన్ ఆలీనీ మన ఫ్యాక్టరీ వాళ్ళు కొట్టారని తెలిసింది- నిజమేనా?''

తిరుమలరావు తన ఆశ్చర్యాన్ని కనపడనివ్వలేదు- ఆ విషయం పై వాళ్ళకి అంబళగన్ చెప్పుకోలేదా? చెప్పుకుంటే నామర్ధా అనుకున్నాడా! అలీలాగే అతనూ యీ కంపెనీని వదిలేసాడా?

''ఆస్పత్రిలో ఉండగా పలకరించటానికి వెళ్ళాను సార్-'' అన్నాడు ఎటూ తేల్చకుండా.

''ఎవరు కొట్టారు?''

''తెలియదు సార్-''

''వాళ్ళు చెప్పలేదా?''

''కొట్టినట్టే చెప్పలేదు సార్-''

''ఏం చెప్పారు-''

''నాతో ఏమీ చెప్పలేదు సార్-'' నసిగాడు.

కొట్టిన విషయం అందరికీ తెలుసు. వాళ్ళిద్దరూ రోడ్డుమీద దెబ్బలు తినిపడి ఉంటే ఆస్పత్రిలో వేసారు. వాళ్ళు పోలీసు రిపోర్టు కూడా యివ్వలేదు.

తిరుమలరావు నుంచి అంతకు మించి సమాచారం లేదు.

''ఇదంతా రూమరు అని కొందరంటారు-'' అన్నాడు.

ఆనంద్‌కుమార్ అతన్ని నిశితంగా పరిశీలించాడు.

''అంతకు ముందు ఏమయినా గొడవలు జరిగాయా?''

''నాకు తెలిసినంత వరకూ అలాంటిదేమీ లేదు-''

''వాళ్ళిద్దరికీ బాగా స్నేహమా?''

''తెలియదు సార్... ఆఫీసులో మాత్రం కొంత యిష్టంగానే ఉండేవారట-''

తిరుమలరావుని చూసి తల పంకించి- నువ్వు గనక సాక్ష్యం చెపితే జడ్జీలు జుట్టుపీక్కోవాలి- అనుకున్నాడు ఆనంద్‌కుమార్.

తిరుమరావుని పంపేసాడు.

అతని మనసంతా అంబళగన్‌ని కలుసుకున్న సంఘటన మీదకు మరలింది.

⋆⋆⋆

ఆరోజు ఒక పార్టీలో కలిసాడు అంబళగన్. ఒక ఎక్స్‌పోర్ట్ ఆర్డరు దొరికిన సందర్భంగా మీనాంబికా యిండస్ట్రీస్ యాజమాన్యం బొంబాయిలో తమ ఎగ్జిక్యూటివ్స్ అందరికీ పార్టీ యిచ్చారు.

కొత్తగా పనిలోకి తీసుకున్న ఆనంద్‌కుమార్ గంగూలీనీ, రాజీనామా యిచ్చిన అంబళగన్‌నీ కూడా పిలిచారు.

ఆనంద్‌కుమార్‌ని అంబళగన్ పరిశీలిస్తున్నాడు. కొన్ని రౌండ్లు గడిచాయి.

అతని కంటికి- ఆనందకుమార్ గంగూలీ సినిమా హీరోలా కనిపిస్తున్నాడు. సినిమా హీరోల మీద అంబళగన్‌కి చెప్పుకోదగ్గ గౌరవం లేదు. డైలాగులు ఎవరో రాస్తే చదివేసి- మేకప్ ఎవరో చేస్తే చేయించుకుని- ఫైటింగులు ఎవరో చేస్తే తాము చేతులు ఊపి- పాటలు ఎవరో రాసి, ఎవరో పాడి, ఎవరో వరసలు కడితే కుప్పిగంతులు వేసి- సినిమా అంతటినీ దున్నేవాడన్న పేరు మాత్రం కొట్టేస్తారని అంబళగన్‌కి కోపం.

దగ్గరగా వెళ్ళి ''హలో'' అన్నాడు.

''హలో''- అన్నాడు తెల్లని గంగూలీ నల్లని అంబళగన్‌ని.

''నేను అంబళగన్‌ని-''

''ఏం గన్?''

''అంబళగన్.,. తమిళియన్‌ని''

''అవునవును- మీ తెలివితేటల మీదనే బ్రిటిష్ దొర భారతదేశంలో వాళ్ళ రాజ్యం స్థాపించాడు-''

''ఆ మాత్రం సహాయం మీరూ చేసారు గంగూలీ-''

''అఫెండవకు మిత్రమా- బ్రిటిష్ సామ్రాజ్యాన్ని స్థాపించటంలో మీ తెలివితేటల మీద నాకు చాలా అడ్మిరేషన్ ఉంది. నన్నెవరయినా అందుకు మెచ్చితే- నేను చాలా తృప్తి చెందుతాను-''

''విశాఖపట్నంలో మిమ్మల్ని పోస్ట్ చేస్తారు. మీ తెలివితేటలకి అక్కడ బ్రహ్మాండమైన ఛాలెంజ్ ఉంది-''

''మీరు-?''

''నేను అక్కడ నుంచి తప్పించుకుని వచ్చాను-''

''నా విస్కీ రుచి మీరు పాడు చేస్తున్నారు-''

''నా చేతిలోనూ విస్కీ ఉంది-''

''వ్యక్తిగతంగా దెబ్బతిన్నారా మిస్టర్ అంబళగన్!''

''ఓ స్థాయికి ఎదిగిన మనలాంటి వాళ్ళకి వ్యక్తిగత సుఖదుఃఖాలు ప్రత్యేకంగా ఉండవు. మనకు వచ్చే హృదయరోగాల సంఖ్యను బట్టే మన ఇండస్ట్రీ ఆరోగ్య పరిస్థితి తెలుస్తుందిట-''

''...ఏం జరిగింది అంబళగన్''

''నాకేం జరగలేదు. నా అవయవాలన్నీ నా దగ్గరే ఉన్నాయి. నేను మీ ఎదురుగానే ఉన్నాను.''

''----''

''మనం మళ్ళీ కలిసినప్పుడు మీరు సుఖంగా ఉండాలని...''

అంటూ గ్లాసుని తాకించి, ఉన్నదంతా గొంతులో ఒంపుకొని వెళ్ళిపోయాడు అంబళగన్.

✵✵✵

రెండవ రోజు పొద్దుటే ఎవరితోనూ ముందు సూచన పంపకుండా తిన్నగా మెషిన్ షాప్‌లోకి నడిచాడు గంగూలీ.

పనివాళ్ళు లేత్ మెషిన్స్ దగ్గర పనిలో ఉన్నారు. ఫోకస్ లైట్స్ వెలుగుతున్నాయి. వర్క్ మీద పడుతోంది సోప్ వాటర్. గేర్‌వీల్ మీద పనివాళ్ళ చేతులు ఉన్నాయి.

పనీ, ప్రారంభదినం, పనివాని పేరు, పనికి పట్టే అంచనా సమయం, ... ఉన్న పట్టికను ఒక మెషిన్ దగ్గరకు వెళ్ళి పరిశీలించాడు గంగూలీ.

''నీ పేరేంటి?'' ఇంగ్లీష్‌లో ప్రశ్నించాడు.

జవాబు యిచ్చాడు. అందులో యింగ్లీష్ అన్నమాట అర్థమయింది.

''వాడికి యింగ్లీష్ రాదు-'' వెనక నుంచి జవాబు.

గంగూలీ విసురుగా వెనక్కి తిరిగి ఆ మెషిన్ దగ్గరకు వెళ్ళాడు. ఎత్తుగా లావుగా ఎర్రబారిన కళ్ళతో ఉన్నాడు మోహన్రావు. అందరికీ వదులుగా ఉన్న డాంగ్రీ అతనికి బిగుతుగా ఉంది.

బ్రాస్ మీద పని చేస్తున్నాడు. బుష్‌లు తయారు చేస్తున్నాడు. లేయర్ చిన్నగా తెగుతోంది. డ్రాయింగ్ తీసుకుని పరిశీలించాడు గంగూలీ. ఇంకా చాలా భాగం తొలగించాలి. మరికొంచెం 'కట్' పెడితే మరింత లేయర్ తియ్యవచ్చు. పని తొందరగా పూర్తవుతుంది-

పళ్ళతో అడుగు పెదవిని నొక్కుకుంటూ తల అటూయిటూ ఊపాడు గంగూలీ-

''యింకొంచెం కట్ పెంచు- పని వేగంగా అవుతుంది-''

మోహన్రావ్ నవ్వాడు. నువ్వు 'ఫూల్‌వి' అన్నట్లు ఉంది ఆ నవ్వు.

నేను వేసుకున్న బూట్ లేస్ పాటి చెయ్యని యిడియట్... నన్ను చూసి నవ్వుతావా- అనుకున్నాడు గంగూలీ.

''ఎందుకు నవ్వుతావ్?'' గంగూలీ ప్రశ్నించాడు.

తనకి పూర్తిగా తెలిసిన విషయం మీద... ఏమీ తెలియని చవట ప్రశ్నించితే... పుట్టేనవ్వు. నవ్వుకి అంత శక్తి ఉన్నట్లు అప్పుడే గ్రహించినట్లయింది.

''నాక్కావలసింది నీ నవ్వు కాదు... జవాబు...'' అన్నాడు గంగూలీ గొంతుపెంచి.

షాపంతా అటు తిరిగింది. యంత్రాలు శబ్దం సృష్టిస్తున్నాయి. మనుషులు నిశ్శబ్దం సృష్టిస్తున్నారు.

గంగూలీ కోపంగా ఒక్కసారి చుట్టూ తిరిగాడు. సెకన్‌లో అంతా ఎవరి పనిలో వాళ్ళు సర్దుకున్నారు. గంగూలీ కోపం తగ్గింది. సంతోషమూ గర్వమూ కలిగాయి.

''మీరు చెపుతున్నది అర్థం కాలేదు-''

''అడగొచ్చు గదా- నవ్వటం దేనికి?''

''అలవాటయి పోయింది- క్షమించండి''

''దట్సాల్ రైట్-నేను చెపుతున్నదేంటంటే-''

''కట్ పెంచమంటారు-''

''ఎగ్జాట్లీ-''

''ఎంత?''

గంగూలీకి ఎంతని చెప్పాలో అర్థం కాలేదు-

''డబుల్ చెయ్యి'' అన్నాడు ఆలోచిస్తూ.

''కట్‌ని డబుల్ చెయ్యమంటారు- యిప్పుడు చేస్తున్నదానికి రెట్టింపు చెయ్యమంటారు-''

''కరెక్ట్ - అదే చెయ్యి-''

''సరిపోతుందా సార్ - యింకొంచెం పెంచమంటారా-?''

మళ్ళీ గంగూలీ ఆలోచనలో పడ్డాడు.

''డబుల్ చాలు-'' అన్నాడు గంభీరంగా.

''అలాగే సార్- కానీ-''

''చెప్పు-''

''మీరు యిక్కడే ఉండాలి - ఈ పనికీ, టూల్‌కీ, మెషిన్‌కి మీరే బాధ్యత తీసుకోవాలి-''

గంగూలీ తలతిరిగినట్లయింది.

టూల్‌బిట్ విరుగుతుందా? ఓవర్ లోడయి మోటర్ కాలుతుందా? మెటల్ పాడవుతుందా? ఏమీ అవకపోయినా వీడు ఏదో ఒకటి చేస్తాడా?

ఆలోచనలు బుర్రను మెలిపెట్టాయి.

చటుక్కున అక్కడ నించి కదిలాడు గంగూలీ.

అతనికి వాడు నవ్వుకుంటున్నాడనే అనిపిస్తోంది. అందరూ నవ్వుతున్నారనే అనిపిస్తోంది.

వాళ్ళకి భయం ఎందుకు లేదు- ఆలోచించాడు గంగూలీ.

పై వాడికి అంతా తెలుసునన్న నమ్మకం కలిగితే కిందవాళ్ళకి భయం పుడుతుంది. అప్పుడే అధికారం చెయ్యటం సులువవుతుంది.

అసలు పనివాడికి భయం ఎందుకు కలుగుతుంది?- ఆలోచించాడు గంగూలీ.

వాళ్ళ ఉద్యోగ భద్రత అధికారుల చేతుల్లో ఉండటం వల్ల-

గంగూలీకి తృప్తినివ్వలేదు ఆ జవాబు.

పై వాడికే అంతా తెలుసును. తనకేమి తెలియదు - అన్న భావం - పనివాడిలో పెంచే కీలకం ఎక్కడుంది? సామూహిక ఉత్పత్తి విధానంలో ఉంది. తనేం చేస్తున్నదీ పనివాడికి అరకొరగానే తెలుస్తుంది. తను నేర్చిన పనివల్ల సృష్టిస్తున్నదేమిటో ఖచ్చితంగా తెలియదు. డిజైన్ చేసిన దగ్గర నుంచి - ఫైనల్ ప్రొడక్ట్ తయారయే వరకూ ఎవడి కంట్రోల్ ఉంటుందో వాడికే అంతా తెలుసు. తనకి ఏమీ తెలియదు - అనుకునే వీలు యీ ఉత్పత్తి పద్ధతిలోనే ఉంది అనుకున్నాడు గంగూలీ.

అయినా- పనివాడితనం గలవాడికి- వాడికి పని మీద ఉన్న కంట్రోల్‌ని పూర్తిగా తొలగించటం సాధ్యపడదు- చెయ్యాల్సిందల్లా వాడికి ఆ కంట్రోల్ ఉందని ప్రదర్శించే వీలు యివ్వకపోవటమే-

గంగూలీ అలా భావించి తిన్నగా తన చాంబర్‌లోకి పోయి ఫోర్‌మాన్ కృష్ణమూర్తిని పిలిచాడు.

''సారీ సర్- నేను మీరు వచ్చేసరికి వర్క్‌షాప్‌లో ఆవేపు ఉన్నాను-''

''టీ బ్రేక్ ఎన్ని గంటలకి?''

''పది గంటలకి సర్-''

''ఆ సమయంలో నేను మీ వర్క్ షాప్‌లో ఉంటాను - మీ వాళ్ళందరినీ తొందరగా టీ పూర్తి చేసుకుని ఉండమనండి- నేను మాట్లాడాలి-''

కృష్ణమూర్తి మాట్లాడలేదు.

''వెళ్ళండి-''

కొంతసేపు కదలలేదు కృష్ణమూర్తి.

''ఏమిటి?''

''వచ్చిన దగ్గర నుంచి నించుని పనిచేస్తారు గదా... టీ తాగుతూ చతికిల బడతారు సార్-''

''ఒక్కరోజు నించుంటే - నష్టంలేదు-''

''నిజమే సార్- వాళ్ళు రారు- కూడగట్టలేం-''

''నాన్సెన్స్- వాళ్ళని కంట్రోల్ చెయ్యలేకపోవటం మీ బాధ్యతారాహిత్యం- మీకు డ్యూటీ మీద గౌరవం లేదు-''

అతను వాదించలేదు. జవాబు యివ్వలేదు.

''మీరు చెప్పండి- యిది నా ఆర్డర్-''

కృష్ణమూర్తి వెళ్ళిపోయాడు.

పది గంటలకి టీ వచ్చింది. పనివాళ్ళతో మాట్లాడవలసిన పాయింట్స్ నోట్ చేసుకున్నాడు గంగూలీ.

పదీ అయిదుకు మళ్ళీ వర్క్‌షాప్‌లోకి వెళ్ళాడు. కృష్ణమూర్తి ఎదురువచ్చాడు. అతను తప్ప మిగిలిన వాళ్ళంతా కూర్చునే ఉన్నారు. ఎవరూ లేవలేదు.

''చెప్పలేదా వాళ్ళకి-?''

''చెప్పాను సార్-''

''రాలేదేం-?''

''రామని కూడా అనలేదు సార్-''

గంగూలీ అతనితో మాట్లాడుతూండగా పదీ పదిహేనుకి అందరూ వచ్చారు. గంగూలీ తనని తను కంట్రోల్ చేసుకుని అందరినీ చూసి మాటలాడటం మొదలుపెట్టాడు-

''నా పేరు...'' అంటూ తన గురించి తను చెప్పుకున్నాడు. ఇంగ్లీష్‌లో-

''నేను ఎంతో మంచివాడిని. మీరు మంచిగా ఉంటే నేనూ మంచిగా ఉంటాను. పని వాళ్ళంటే నాకు ప్రేమ. పనిని భగవంతుడిగా భావిస్తాను-'' అంటూ కొంతసేపు మాటలాడాడు.

''యజమానీ, పనివాడూ ఒకరికొకరు అవసరం. వాళ్ళ సంబంధం పరిశ్రమకు ఎదుగుదల. పరిశ్రమ ఎదుగుదలే పనివాడికి కూడు. యజమానికేముంది? దేశం నిండా పనివాళ్ళే- పోయేది పనివాడికి తిండి! మనది పవిత్ర భారతదేశం. పుణ్యభూమి. అనాదిగా ధర్మ సంస్థాపన కోసం పాపులను దేవుడు చంపిన దేశం. కనక ఒకరికి అన్యాయం చేస్తే భూమి భరించదు. భగవంతుడు క్షమించడు'' అంటున్నాడు గంగూలీ.

ఫకాలున నవ్వు. ఒక్కమారుగా ఉప్పెనలా నవ్వుల వరస.

''ఎందుకు నవ్వుతున్నారు.'' అరిచాడు గంగూలి.

నవ్వులు ఆగిపోయాయి. జవాబు లేదు. ముందు వరసలో వాడిని ఎందుకు నవ్వావన్నాడు. వాడికి యింగ్లీషు రాదుట. కృష్ణమూర్తి చెప్పాడు. ఎందుకు నవ్వాడో కనుక్కోమన్నాడు. అందరూ నవ్వారుట- అందుకే నవ్వాను- అన్నాడట.

గంగూలీ ఉపన్యాసాన్ని చాలించి తన చాంబర్స్‌కి వెళ్ళిపోయాడు.

సూపర్‌వైజర్లందరినీ పిలిపించాడు.

''మీరు వర్కర్స్‌తో కలిసారా- మిమ్మల్ని వాళ్ళు నమ్మరు-'' అన్నాడు.

విడిగా ప్రశ్నించాడు. ఇంచుమించు ఒకటే జవాబు- ''మమ్మల్ని నమ్మండి- యీ వర్క్ షాప్స్‌లో వాళ్ళందరూ ఒకటే- పరిస్థితిని మీరే అర్థం చేసుకోవాలి. మీరు ఏం చెపితే అది చేస్తాం- అయితే మాకు భార్యాబిడ్డలున్నారు-''

గంగూలీ పళ్ళు బిగిసాయి.

టెర్రరైజ్ చేసి వీళ్ళలో ఎవడు అందరినీ నడుపుతున్నాడు? వీళ్ళ ఐక్యతను చిటికెలో పోగొడతాను- అనుకున్నాడు.

ఎలా? ఎలా?- గంగూలీ మనసు నిండా ప్రశ్నలు!

✵✵✵

అంబళగన్‌ని ఫోన్ మీద పలకరించాడు గంగూలీ.

''నాకు కొన్ని వివరాలు కావాలి!''

''తెలిస్తే చెపుతాను--''

''మిమ్మల్ని కొట్టిందెవరు?''

అవతల నుంచి జవాబు లేదు.

''మరోలా భావించకండి- ఆ వర్క్ షాప్‌లోనే ఎవరో ఉన్నారు. మీరు కొంచెం సహాయం చేస్తే-''

''ఎవరు కొట్టారో తెలియదు-''

''కొట్టారని ఒప్పుకుంటున్నారు-''

''ఒప్పించటమే ఉద్దేశ్యమయితే ఒప్పుకుంటాను-''

''అయామ్ సారీ- అయ్ డోంట్ మీన్-''

ఫోన్ పెట్టేసిన చప్పుడు.

✵✵✵

''మీకు తెలిసిన ప్రతి విషయాన్నీ చెప్పండి. అనుమానం ఉన్న ప్రతి వ్యక్తినీ గూర్చి మాట్లాడండి. నేను ఏ విధంగానూ బయటకు రానివ్వను. వాళ్ళను ఎందులోనో ఒకదాన్లో యిరికిస్తాను. సాధారణంగా ఎవడో ఒకడే రౌడీ ఉంటాడు. మిగిలిన వాళ్ళంతా ఉత్తి గొర్రెలు. ఆ ఒకడినీ నెట్టేస్తే మనం అందరం క్షేమంగా ఉంటాం-''

అంటూ సూపర్వయిజర్లందరినీ రకరకాలుగా ప్రశ్నలు వేసాడు.

''ఎదిరించి సమాధానాలు చెప్పేవాళ్ళు ఉండొచ్చు వాళ్ళే అంబళగన్‌ని కొట్టారని చెప్పలేం-'' అన్నారు.

***

పదిహేను రోజుల తర్వాత-

ద్వారకానగర్‌లో గంగూలీ యింట్లో అతని భార్య ప్రీతికి జీవితం మీద విరక్తి కలిగింది. ఈ పల్లెటూరికి తీసుకువచ్చి నా గొంతు కోసారు- అంది. కలకత్తాలో పుట్టి బొంబేలో పెరిగి, పెళ్ళాడిన ప్రీతి.

గంగూలీ కాస్త తెలివి తక్కువగా- ''నువ్వే గదా- విశాఖపట్నం సముద్రం బావుందన్నావు. కొండలు బావున్నాయన్నావు-'' అన్నాడు.

''సముద్రమూ కొండలూ తిండి పెట్టవు'' అంది ప్రీతి.

''కరెక్ట్ - తిండి వండేదీ - నాకు పెట్టేదీ నువ్వే గదా-'' అన్నాడు ఆశ్చర్యంగా.

సాధారణంగా భారతనారి భర్తయిచ్చిన క్రెడిట్‌ని వదులుకోదు. కాని- ఆరోజు పరిస్థితి అలాంటిది- అందువల్ల ప్రీతి దానిని క్రెడిట్‌గా తీసుకోలేదు.

''కాదు-'' అంది కోపంగా.

''మరెవరు?'' కుతూహలంగా ప్రశ్నించాడు.

''అప్పల నరిసి'' అంది-

''అదేమిటది?''

''ఇన్నాళ్ళబట్టి - చేపల్ని- లొట్టలు వేసుకుని తింటున్నారు. అవి వండి మీకు పెడుతున్న మనిషి పనిమనిషి-'' అంది.

''అలా చెప్పు - నాకు మనుషులు, వాళ్ళ పేర్లతో గుర్తుండరు- పనులతో గుర్తుంటారు - సరే - పని మనిషి వండినా, అందులో కలిసేది నీ ప్రేమే గదా- వడ్డించేది నీ చేతులే గదా-'' అన్నాడు ఆ చేతులను ముద్దాడుతూ.

''నిజమేనండి- ప్రేమ కలపటానికి నా దగ్గర బోల్డంత సిద్ధంగా ఉంది. కాని- చేపలకూరే లేదు- తిండే లేదు-'' అంది ప్రీతి గంగూలీ జుత్తుని చెరుపుతూ.

''ఎందుకు లేదు'' అన్నాడు గంగూలీ జుత్తు సరిచేసుకుంటూ.

''పని మనిషి లేదు-'' అంది ప్రీతి మళ్ళీ జుత్తు చెరుపుతూ.

''ఎందుకు లేదు-'' మళ్ళీ సరిచేసుకున్నాడు గంగూలీ.

ప్రీతి యీసారి జుత్తు చెరపలేదు. చటుక్కున లేచి నిలబడింది-

''ఎందుకుంటుంది- మీరు బక్షీస్ యిచ్చారు గదా- అదీ దాని మొగుడూ మజా చేసుకుంటారు- ఉన్నది కాస్తా ఆరాక వచ్చి కాళ్ళు పట్టుకుంటుంది-'' అంది.

''జీతం యిచ్చినపుడు అలా చెయ్యలేదు గదా- వచ్చింది గదా- వండింది గదా- నువ్వందులో నీ ప్రేమ కలిపావు గదా- ఒంట్లో బాగోలేదేమో-'' అన్నాడు గంగూలీ ఆమె జుత్తును చెరపబోతూ.

భర్త తెలివి తక్కువతనానికి విస్తుపోయింది ప్రీతి.

''వీళ్ళకి ఒంట్లో బాగోకపోవడమేంటి-'' అంది ముందుగా.

''అవున్నిజమే-'' అని భర్త ఒప్పేసుకున్నాక-

''జీతమనేసరికి లెక్కా డొక్కా ఉంటాయి. పైరాబడి అంటే మనలాంటి వాళ్ళే ఎలా ఎంజాయ్ చేద్దామా అని చూస్తాం- పైసా ఎరగని వాళ్ళకి యింక ఎలా ఉంటుంది?- యిదిగో- యిలా ఉంటుంది-'' అంది ప్రీతి.

బుద్ధ భగవానుడు ఒక మనిషి చావునీ, రోగాన్నీ ముదిమినీ చూసి జ్ఞానాన్వేషణలో పడ్డాడు. వాటిని ఎందరో చూసినా- ఎందరు జ్ఞానాన్వేషణలో పడ్డారు? పని మనుషులు ఎగ్గొట్టినట్లనిపించితే బాధపడనిదెవరు! ఆ బాధలోంచి జ్ఞానాన్వేషణ ఎందరు చేస్తారు! చేపల కూర నుంచి- గంగూలీ 'పైరాబడి' వల్ల మనుషులలో ఎలాంటి మార్పులు వస్తాయని ఆలోచించాడు! అందులోంచి ఓ ప్రణాళిక పుట్టింది.

★★★

''విశాఖపట్నం ఎదుగుతున్న పట్నం. ఇక్కడ మనుషులు ఎంతో మంచివాళ్ళు. మీరంతా ఎంతో కష్టపడి పనిచేస్తున్నారు. ఇలాంటి వాళ్ళతో కలిసి పనిచెయ్యడం నా అదృష్టం. మీకు ఏం చెయ్యగలనా అని కొన్నాళ్ళుగా ఆలోచిస్తున్నాను.

రోజు రోజుకి ధరలు పెరిగిపోతున్నాయి. మన రాజకీయ నాయకులు ఏం చేస్తున్నారో అర్థం కావటం లేదు. సోవియట్ యూనియన్‌లోనూ, చైనాలోనూ పెరగని ధరలు మన దేశంలో ఎలా పెరుగుతున్నాయి? ఆలోచించే వాళ్ళేలేరు.

మన అవసరాలతో సమంగా సంపాదన పెరగటం లేదు. మన యాజమాన్యం కొత్త ఆర్డర్లు సంపాదించింది. కొత్త వాళ్ళను తీసుకోవాలన్న ఆలోచనలో ఉంది-''

ఆనందకుమార్ గంగూలీ కోటు జేబులోంచి జేబురుమాలు తీసుకుని పట్టని చెమటను తుడుచుకున్నాడు. పనివాళ్ళు అందరినీ కలయజూసాడు. నవ్వాడు.

''మీ అందరూ కలిగించిన నమ్మకంతో నేను మన యాజమాన్యంతో ఒక ప్రతిపాదన చేసాను. కొత్త వాళ్ళను తీసుకునే బదులు- అనుభవం గల పాత వాళ్ళకే ఓవర్‌టైమ్ యిచ్చి పని చేయించుకుందామన్నాను. ఇంతకు ముందు కూడా ఓవర్‌టైమ్ సిస్టమ్ ఉంది గదా- అప్పుడప్పుడు చేస్తున్నాం గదా- అని మీరు ప్రశ్న వేయవచ్చు. ఇప్పుడు దానిని ఎక్కువ చేస్తాం.

యాజమాన్యం అంత తొందరగా నా ప్రతిపాదన ఒప్పుకోలేదు. రోజంతా పనిచేసి అలసిపోయిన వాళ్ళతో అదనంగా పని చేయించి- రెట్టింపు పేమెంట్ యివ్వటం ఎందుకని

ప్రశ్నించారు. కొత్త వాళ్ళను తీసుకుని తక్కువ జీతంతో- షిఫ్ట్ సిస్టమ్ పెట్టి- ఎక్కువ పని జరుగుతుందని వారి వాదన.

నేను మీ తరఫున పోట్లాడి వారిని ఒప్పించాను. ప్రయోగాత్మకంగా కొన్నాళ్ళు చూద్దామన్నాను-''

అంటూ గంగూలీ చేసిన ప్రకటన అన్ని వర్క్ షాప్స్‌లోనూ బాగానే కలకలం రేపింది. కొందరు ఇదంతా ఉత్తి కబుర్లన్నారు. కొందరు- ఇందులో ఏదో ఉందన్నారు. కొందరు గంగూలీ మంచివాడన్నారు. కొందరు గంగూలీ అర్థం అవడన్నారు.

మానేజర్లు కూడా యూనియన్ నాయకుల్లా ఉపన్యాసాలు యివ్వటం- యిప్పుడే చూస్తున్నామన్నారు- కొందరు.

యూనియన్ నాయకులు ఆనంద్ కుమార్‌ని అభినందించారు. పనివాళ్ళ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కంపెనీ యాజమాన్యం పని చేస్తోందన్నారు.

గంగూలీ యీ ప్రకటన చేసేముందు యాజమాన్యంతో కొంత తర్జన భర్జనలు జరిగాయి.

''ఓవర్‌టైమ్‌ల వల్ల బాగుపడిన పనివాళ్ళు లేరు. నష్టపడిన యజమానులు లేరు-'' అన్నాడు గంగూలి.

''ఆమాటకి వస్తే- పై రాబడి- మనిషిని- అసలు రాబడి కన్న- ఎక్కువ బానిస చేస్తుంది-'' అన్నాడు గంగూలి.

''ఎలాగా?'' అన్నారు కుతూహలంగా.

''చూస్తారు గదా-'' అన్నాడు.

అతనంత నమ్మకంగా చెపుతున్నపుడు వాళ్ళకి కూడా కొన్నాళ్ళు చూద్దామనిపించింది.

***

సాయంకాలం అయింది.

విశాఖపట్నం మెయిన్‌రోడ్ పదవ తారీఖును ధరించి కళకళలాడుతోంది. పారిశ్రామికంగా ఎదుగుతున్న నగరంలో షిప్‌యార్డ్, డాక్‌యార్డ్, బి.హెచ్.పీ.వీ. మొదలయిన పెద్ద సంస్థలతో బాటు చిన్నా పెద్దా కంపెనీలు కూడా జీతాలివ్వటం దాదాపు పూర్తయే రోజు. బనీన్లు- లంగాలు - దుప్పట్లు - తువ్వాళ్ళు - కాఫీ కప్పులు - రకరకాల బేహారులు ఎక్కడి నుంచో ఒక్కసారిగా పుట్టినట్లుగా పేవ్‌మెంట్లను ఆక్రమించే రోజులు. పావలా చెంచా కోసం ఆ కొస నుంచి ఈ కొసదాకా తిప్పి బేరాలాడుతున్న భార్యను ఒకరు విసుక్కుంటుంటే- పేవ్‌మెంట్ జోళ్ళకూ బాటా జోళ్ళకూ తేడాలేదని చెపుతూ పదమూడు రూపాయల జోడు గురించి పదేపదే బేరం ఆడుతున్న భర్తను ఒకరు విసుక్కుంటున్నారు.

అలాంటి సాయంకాలం వేళ- ఆ మెయిన్‌రోడ్‌లో- మేడ మీద ఏర్పాటు చేసిన

రూఫ్‌గార్డన్‌లో- ఉన్నారు. మీనాంబికా యిండస్ట్రీస్ పనివాళ్ళు - రాజులూ, రామ్మూర్తీ, మోహన్రావు, లక్ష్మణరావూ, భీమరాజూ వాళ్ళకి అప్పుడపుడు కలిసి మందు తీసుకునే అలవాటు ఉంది.

ఇప్పుడు వాళ్ళ స్థాయి పెరిగింది.

జీతాల రోజుకి తయారయిపోతున్నారు. చివరకి రామ్మూర్తి కూడా వాళ్ళలో రెగ్యులర్ సభ్యుడయిపోయాడు. ఇంతకు ముందు వాళ్ళు పూర్ణా మార్కెట్ పక్క సందులో తాగేవారు. నాటు సరుకో- గవర్నమెంటు డొక్కులో తీసుకునేవారు. అప్పుడు కబాబు పుల్లలు తినేవారు. ఇప్పుడు వాళ్ళు చికెన్ అరవై తొమ్మిదీ, చిల్లీ చికెనూ తింటున్నారు. వాటిని చక్కగా ప్లేట్లలో అమర్చి... వంగి వంగి సలాములు కొడుతూ--- తెల్ల బట్టల మీద పచ్చ నిలువుగీతల వాళ్ళు... వాళ్ళు యజమానుల ఆజ్ఞల మేరకు సమకూరుస్తుంటే తింటున్నారు. గ్లాసుల్ని చూస్తేనే మరో గ్లాసు పుచ్చుకోవాలనిపించేలా ఉన్నాయి. ఆ గ్లాసుల్లో పదార్థం చూడగానే మనసంతా వాళ్ళకి ఉల్లాసమయిపోతోంది.

రాజులు చకచకా లాగిస్తూ- ''గుంటనాయాల్లు- మీరేం తాగుతార్రా-'' అంటున్నాడు.

''ఓరి తొస్సినాయాలా- నేనేం తీసిపోనురా మావా'' అన్నాడు భీమరాజు.

రాజులుకి చదవులేదు. సర్టిఫికేట్ లేదు. వయసులో పెద్దవాడు. పని ఉంది. అనుభవం ఉంది. మిగిలిన వాళ్ళంతా ఐ.టి.ఐ. సర్టిఫికెట్ ఉన్నవాళ్ళు. రాజుల్ని అంతా మామ అంటారు.

పంతాలు పెరిగాయి. గ్లాసుల మీద గ్లాసులు ఖాళీ అయిపోతున్నాయి. మాటల మీద మాటలు పెరుగుతున్నాయి.

''నువ్వు సెడతాగేసావు- అవుటయిపోనావు- యింటికెల్లి పడుకోరా-'' అన్నాడు లక్ష్మణరావు అప్పటికే బాగా అవుటయిపోయి.

మోహన్రావా మాటకి కలబడిపోయాడు- ''కుర్రసన్నాసీ- నువ్వు నాకు సెపుతావా- నువ్వు యింటికెల్లు పడుకో-'' అన్నాడు.

'వల్లకోండ్రా-' అంటూనే ఉన్నాడు రాజులు. వాళ్ళు వినటం లేదు. చివరకి రాజులూ, భీమరాజూ వాళ్ళని విడదీసి బయటకి లాక్కొచ్చి రిక్షాలు ఎక్కించారు.

రామ్మూర్తిని కూడా రిక్షా ఎక్కించి 'అల్లిపురం సింహాలదేవిడీ' అని చెప్పారు.

అంతా వెళ్ళాక మళ్ళీ పైకొచ్చి మరో పెగ్గు తీసుకుని బయటకు వచ్చి రిక్షా ఎక్కి కొత్త రోడ్డులో గంగమ్మ కంపెనీ వేపు వెళ్ళిపోయారు.

★★★

అల్లిపురం సందుల్లో నడుచుకుంటూ వెళ్తేనే దొరకుతుంది రామ్మూర్తి యిల్లు. పగటిపూటైనా రిక్షా కొన్ని సందుల్లోకి వెళ్ళలేదు. రాత్రిపూట ఆ సందుల్లో నులకమంచాలు

వేసుకుని పడుకుంటారు జనం. మనిషి కదలటానికి మాత్రం జాగా ఉంటుంది. అలాంటి ఓ సందులో చివరి యిల్లు అది.

అదృష్టవశాత్తూ యింటి తలుపు వీధిలోకి ఉంది. ఇంటివాళ్ళను లేపనవసరం లేదు. అతను ఓవర్‌టైముల వల్ల, స్నేహితులవల్లా సాధారణంగా ఆలశ్యంగానే వస్తుంటాడు. భార్య సీతది మొద్దు నిద్ర కావటం వల్ల ఆవిడకన్నా ముందు యింటివాళ్ళు లేచి- ఆ రెండు వాటాలకు మధ్యనున్న తలుపు మీద బాది సీతని లేపుతుంటారు.

ఆరోజు అలా జరగలేదు.

తలుపు తట్టేసరికి తెరుచుకుంది.

ఎదురుగానున్న మనిషిని చూడగానే- రామ్మూర్తి మత్తు దిగిపోయింది. ముందునున్నదొక గది అనీ, వెనకనున్నది ఒక గదనీ, యింటి వాళ్ళు అద్దెకు యిచ్చేటప్పుడు చెప్పారు. వెనకనున్నది మాత్రమే కాస్త పెద్ద గది. అందులోనే వంటా పడకా- పిల్లలూ- అన్నీనూ! ముందున్న భాగంలో ఒక మడత మంచం పడుతుంది. అది వాలిస్తే మనిషి తప్పుకోటాన్కి స్థలం ఉండదు.

అలాంటి సమయంలో తండ్రిని చూసి ఎలాగో తలదించుకుని లోపలికి వెళ్ళిపోయాడు రామ్మూర్తి. కొడుకు ఏ పరిస్థితిలో వచ్చాడో జోగినాథానికి తెలియకుండా ఉండే అవకాశమే లేకపోయింది.

విశాఖపట్నం నౌఖరీ యివ్వగలిగిన సంపాదననీ, జీవితాన్నీ అంతోయింతో అంచనా కట్టగలిగిన పల్లెటూరి జోగినాథం- కొడుకుని యీ స్థితిలో ఊహించలేకపోయాడు. ఏమనడానికీ అతని నోరు పెగలలేదు.

మౌనంగా మంచం మీద నడుం వాల్చాడు.

రామ్మూర్తిది వ్యావసాయిక కుటుంబం. సంసారాలు పెరుగుతున్న కొద్దీ పూర్వార్జితాలు కరిగిపోతూంటే పిల్లలకి బ్రతుకుతెరువు పట్నాలలోనే ఉందని అతని తండ్రి భావించాడు. ఉన్న ఊళ్ళో సింగిల్ టీచర్ స్కూల్ మాత్రం ఉంది. ఆ తర్వాత చదువు కోసం కొడుకుని కిర్లంపూడి హైస్కూలుకి పంపించాడు. రామ్మూర్తికి చదువు సరిగ్గా అబ్బలేదు. రోజుకి అయిదు మైళ్ళూ నడిచి వెళ్ళి వచ్చే కొడుకుకి సైకిలు కూడా కొనివ్వలేకపోయాడు. రామ్మూర్తి కాకినాడలో ఐ.టి.ఐ. చదువుకున్నాడు. విశాఖపట్నంలో నౌకరీ వచ్చింది.

ఇంటి మర్యాద కోసం బ్రతికిన వాడు జోగినాథం. ఆ మర్యాద కోసమే, అందరూ బ్రతకాలని పిల్లలకు పదేపదే నూరిపోసినవాడు. తాగటం గూర్చి విన్నాడు గాని అలాంటి పని కొడుకు చేస్తాడని జోగినాథం ఊహించలేకపోయాడు.

అతనికి నిద్రపట్టలేదు.

రామ్మూర్తికీ నిద్రపట్టలేదు. అతనికి కొంత మత్తుగా- కొంత తెలివిగానూ ఉంది.

లోపలికి వచ్చి పడుకున్న భార్యను లేపుదామనుకుని- లేపలేదు. నోరువిప్పితే తండ్రి ముందు మరింత అసహ్యంగా ఉంటుందనిపించింది. శేషూ, చిన్నారీ ఆమె పక్కనే పడుకున్నారు. పడుకోటానికి ఏం కనిపించలేదు. అలాగే గచ్చు మీద పడుకున్నాడు. క్రమంగా నిద్ర ఆవరించింది.

గదిలో ఓ మూల కన్నం దగ్గర అంట్ల కంచాలున్నాయి. రోజూ ఆ కన్నంలో గుడ్డలు కుక్కి, ఒక లావుపాటి కర్రను పెడుతుంది సీత. ఆ రోజు పెట్టలేదు. పందికొక్కు లోపలికి వచ్చి గిన్నెలు పడేసింది.

సీత ఆ చప్పుడికి లేచింది.

జోగినాథం కూడా లేచి గుమ్మంలో నించున్నాడు. వీధిలైటు వెలుతురు ఆ గదిలో పడుతోంది. మామగారు కనిపించేసరికి సీత కంగారుగా లేచింది.

''మావాడు వచ్చాడు. తలుపు వేసుకోమ్మా-'' అన్నాడు పెద్దాయన.

సీత లేచి తలుపువేసి వచ్చింది. లైటు వేసింది. గచ్చుమీద గాఢనిద్రలో ఉన్నాడు రామ్మూర్తి.

లేపి మంచం మీద పడుకోబెడదామనుకున్న ఆలోచన విరమించింది సీత.

తెల్లవారు జామున నాలుగున్నరవుతూండగా వీధి కుళాయి వస్తోందని గుమిగూడిన ఆడవాళ్ళ హడావుడికి సీతకి మెలకువ వచ్చింది.

రామ్మూర్తి అప్పటికే లేచి కూర్చుని ఉన్నాడు.

సీత కాస్త ఆశ్చర్యపోయింది.

''మీరు పడుకోండి'' అని లేవబోయింది. మంచాన్ని జారబడి కూర్చున్న రామ్మూర్తి ఆమె చేతిని పట్టుకున్నాడు.

ఆ స్పర్శలో అతను బాధపడుతున్న విషయం ఉంది. సీతకి అందింది. అతని పక్కనే నేల మీద కూర్చుంది.

అతను ఆమె చేతిని నుదుటికి తాకించుకున్నాడు. తర్వాత కొంతసేపు మౌనం తర్వాత సన్నటి గొంతుతో అన్నాడు.

''నాన్న ఎందుకు వచ్చారు?''

''కమలకి పెళ్ళి విషయంట-''

''కుదిరిందిటా-?''

''ఏమో! మీతో ఆ విషయం మాట్లాడతారు''

''ముందుగా నీకే చెపుతారు- ప్లీజ్! ఏంటి సంగతి?''

సీత మాట్లాడలేదు.

''నాన్నకు నా మీద కోపం వస్తుందా సీతా-''

''మీకేం నష్టం-?''

ఆమె కోపంగా ఉందని రామ్మూర్తికి అర్థం అయింది.

''ఎందుకు సీతా- అంత కోపం-''

''ఒక్కమాట నాతో చెప్పవచ్చుగా- మీరు మామూలుగా ఓవర్‌టైమ్ చేసి వస్తారని ఆయనతో చెప్పాను- నిద్రపోయాను- తీరా చూస్తే యిలా వచ్చారు- నేను మేలుకొని ఆయన్ని లోపల పడుకోబెట్టి ఏదో చేసేదాన్ని గదా-''

''అనుకోలేదు సీతా- మావాళ్ళు బలవంతం చేసారు- ఏం చెయ్యను చెప్పు?''

''ఏమో- నాకెందుకులెండి- రేప్పొద్దుట ఏం చెపుతారో చెప్పుకోండి-''

''అలా అనకు సీతా- నువ్వే ఆయనకు చెప్పాలి-''

''ఏమనుకుంటారాయన? ఓరోజు చేసిన దానిని రోజూ తలుచుకుని ఎంత బాధపడతారు?''

''సారీ సీతా-''

కొంతసేపు ఊరుకుని అంది- ''కుర్రాడు ఏదో ఆఫీసులో రాజమండ్రిలో పని చేస్తున్నాట్ట- ఈడూ జోడూ బావుంటారుట- ఆయనా పెద్దవాడయిపోతున్నారుట''

''చేసేద్దాం సీతా-'' భార్యకి నచ్చజెప్పగలుగుతున్న ఉత్సాహంతో అన్నాడు.

''ఎలా చేస్తారు?''

''ఎంతవుతుందేం?''

''కట్నమే నాలుగు వేలుట-''

''ఓస్ అంతేగదా-''

భర్త మొహంలోకి చురుకుగా చూసింది.

''ఏం- ఏమయినా కూడబెట్టారా?''

''నీకు తెలియనిదేముంది నా దగ్గర- సీతా? ఎప్పటికయినా అప్పోసొప్పో చేసి చెయ్యాల్సిందే- లాటరీలేం రావు మనకి- నెమ్మదిగా తీర్చుకుందాం-''

''ఏం తీరుస్తాం? కట్టుకుందుకు లుంగీలు లేవని ఆరు నెలల్నించి అనుకుంటున్నాం- రాత్రి ఆయనకి పక్క వెయ్యటానికి - చచ్చే సిగ్గేసింది - దుప్పటీ లేదు. కొనగలుగుతున్నామా- ప్రతిసారీ బోనసు వస్తుందని ఎదురు చూడటమే కదా!''

రామ్మూర్తి నవ్వాడు.

ఆ నవ్వులో - ఏదో పెనుమార్పు వచ్చిందనీ, అది ఎంతో వరగబెడుతుందనే- నమ్మకం

ఉంది.

''మాకిప్పుడు ఎంత కావాలంటే అంత ఓవర్‌టైమ్ దొరుకుతుంది- మన ఓపికే-''

''ఏమోనండీ - ఉన్న అప్పులు తీర్చటానికే ఒళ్ళు విరుచుకుంటున్నా - అవటం లేదు. అంత కష్టం పోసి చెయ్యలేమండీ అంటే ఆయన చిన్నబుచ్చుకుంటారు - ఎలా తెస్తారో ఏం చేస్తారోనని మీ గురించి కూడా బెంగే-''

''బెంగపడకే- నాకు రెండు చేతులూ ఉన్నాయి. అవి శ్రమించటానికి యిప్పుడు మరింత ఛాన్స్ వచ్చింది-''

''నా మాట వినండి! మన తాహతుకు తగ్గ చిన్న సంబంధమేదయినా చేసుకుందాం-''

''సీతా- ఒక్కమారు కష్టపడితే తిరిగి చూసుకోనక్కరలేదు-''

భార్యాభర్తా మాటలు సాగుతుండగానే తెల్లవారిపోయింది. తలుపు తీసేసరికి జోగినాధం లేడు. చెంబు పట్టుకుని వెళ్ళాడు. నీళ్ళు పట్టుకుని వచ్చింది సీత.

రామ్మూర్తి డ్యూటీకి తయారవుతున్నాడు. జోగినాధం తిరిగివచ్చేడు. రామ్మూర్తికి సిగ్గుగా ఉంది. పొడిపొడిగా పలకరించి డ్యూటీకి వెళ్ళిపోయాడు.

''రాత్రి ఆలస్యం అవుతుంది. నాకోసం చూడకండి. భోంచేసెయ్యండి. వచ్చాక మాట్లాడుకుందాం. మాంసం తెప్పించు'' అన్నాడు రామ్మూర్తి.

భర్త వెళ్ళిపోయాక మామగారితో అంది సీత- ''పొద్దుటే అంతదూరం ఎందుకండి వెళ్ళడం- నన్ను లేపాల్సింది- నీళ్ళు యిచ్చే దాన్నిగదా-''

''పల్లెటూరి వాడిని- నాలుగడుగులు వేస్తేగాని కడుపు బిగబట్టినట్లుంటుంది-''

తనూ భర్తా మాట్లాడుకున్నదంతా చెప్పింది సీత.

ముసిలాయన మొహం యింతయింది.

''ఇద్దరూ మళ్ళీ ఆలోచించుకోండమ్మా- కూతురు సుఖపడుతుందన్న ఉబలాటం తండ్రిని కనక- నాకు ఉంటుంది. ఈ పట్నవాసంలో ఈ చాలీచాలని అద్దె యిళ్ళల్లో మిమ్మల్ని చూస్తుంటే- ఎందుకు చదువు చెప్పించానా- కలో గంజో తాగుతూ మన ఊళ్ళోనే ఉంటేనే బాగుండేది కదా- అనిపిస్తుంటుంది. తలకు మించిన బరువు ఎత్తుకో కూడదంటారు- మా నాన్న నాకు అయిదు ఎకరాలన్నా యిచ్చాడు. నేను వాడికి కాళ్ళూ చేతులూ తప్ప ఏమీ యివ్వలేదు-'' అన్నాడు జోగినాధం.

రాత్రి తొమ్మిది దాటాక సైకిలు మీద వచ్చాడు రామ్మూర్తి.

అతనూ జోగినాధమూ మాట్లాడుకున్నారు. ఇల్లు తాకట్టు పెట్టి కొంతా- యిక్కడే ఎక్కడో మరికొంతా- పుట్టించాలని నిర్ణయించుకున్నారు.

రాజేశ్వరీ టాకీసులో సినిమా చూసి- స్టేషనుకు వెళ్ళి- పూరీ పాసెంజరులో

వెళ్ళిపోతానన్నాడు జోగినాథం.

తండ్రిని దిగబెట్టడాన్కి వీధి మొగం దాకా వచ్చాడు రామ్మూర్తి.

''బాబూ- ఏదయినా అలవాటు కానంత కాలమూ ఫరవాలేదు. అలవాటయితే కష్టం. పెద్దోడిని. పది మందిని చూసిన వాడిని. అనుభవం మీద చెబుతున్నాను-'' అన్నాడు జోగినాథం.

✮✮✮

రామ్మూర్తి చెల్లెలికి పెళ్ళి అయింది.

శక్తికి మించి అప్పు చేసాడు, ఖర్చు చేసాడు.

పనిలో పనిగా యింట్లో భార్యకి, పిల్లలకి, తనకూ బట్టలు తీసుకున్నాడు. 'వద్దండీ' అంటూ సీతమ్మ మొత్తుకుంటూనే ఉంది. 'కెరటాలు తగ్గేదెప్పుడు? స్నానం చేసేదెప్పుడు?' అంటూ ఆమె మాటను కొట్టిపారేసాడు.

పెళ్ళిలో రామ్మూర్తి చాలా 'పెద్ద మనిషి' 'మర్యాదస్తుడు' అనిపించుకున్నాడు. ఎక్కడా లోటు రానియ్యలేదు. పేకలు తెప్పించాడు. సిగరెట్లు తెప్పించాడు. వాళ్ళకి టీ, కాఫీలు మధ్యమధ్యలో చిరుతిళ్ళూ ఏర్పాటు చేశాడు. పెళ్ళికొడుకు బట్టల దగ్గర మాత్రం ఎక్కడలేని లోభమూ చూపించాడన్నారు. వీళ్ళు బాణాసంచాలో తగలబెట్టారు గాని- పెళ్ళికొడుకుని సరిగ్గా చూడలేదన్నారు.

పెళ్ళి పూర్తయీ సరికి రామ్మూర్తికి అమాంబాపతు ఆరు వేల ఎనిమిది వందల రూపాయలు అప్పు అయింది.

✮✮✮

మూడు వందల రూపాయలకి ముప్ఫై రూపాయలు వడ్డీ కడుతున్న రామ్మూర్తికి ఆ అప్పు తీరటానికే మూడు నెలలు పట్టింది.

ఓవర్‌టైమ్ మీద వచ్చేది తప్ప జీతంలోంచి పైసా మిగలటం లేదు. ఆ డబ్బు గూడా అంతా అప్పు తీర్చడానికి వినియోగించలేకపోతున్నాడు.

సాయంకాలం వేళ ఓవర్ టైమ్ సమయంలో టిఫిన్‌కి రోజుకి రూపాయ తక్కువ కాకుండా అయిపోతోంది. ఖాతా ఉంచటం వల్ల ఎంత బిగబట్టినా ఏభై రూపాయలయినా చిల్లర వాడకం అవుతోంది.

ఏది తగ్గించుకోవటం?

టిఫిన్ మానేద్దామనుకున్నాడు. ఇంత కష్టపడి బ్రతికేది ఆ తిండి గురించే గదా- పైగా అందరూ తింటూంటే, చూస్తూ ఎలా ఊరుకోవడం?

టిఫిన్‌కి రానంటే లక్ష్మణరావూ, మోహన్రావూ పట్టుబట్టారు.

'మా దగ్గరున్నాయి- పదరా' అన్నారు.

చివరికి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

★★★

''బాబూ!

లింగరాజు గారు రోజూ గుర్తు చేస్తున్నారు. నెలనెలా వడ్డీ కడతానన్నావు- కట్టడం లేదేమని అడుగుతున్నారు.

ఒక్క నెలలో మీ నాగయ్య దగ్గర మూడు వందలూ తీర్చేసి- మరుసటి నెల నుంచి కొంత వడ్డీ కొంత అసలూ పంపుతానని చెప్పావు. ఏమీ పంపలేదు. ఇలా రాసానని ఏమీ అనుకోకు. నీమీద యింత బరువు పెట్టాను.

ఈ మునసబు ఉద్యోగంలో నా సంపాదన ఏపాటి మాత్రం ఉంటుందో నీకు తెలియనిదేముంది? వసూళ్ళ నుంచి కొంత ఖర్చు పెట్టమన్నావు. ఖర్చు పెట్టాను. ఎప్పుడు తాసిల్దారు పట్టుకుంటాడోనని గుండె పీచుపీచు లాడుతోంది. కరణం గారు ప్రస్తుతానికి ఏం అనడం లేదు. కాని ఆయనకి తెలుసు. నా అశక్తతకు నాకే సిగ్గుగా ఉంది. పిల్లలూ కోడలూ క్షేమమని తలుస్తాను. మీ అమ్మ అందరికీ దీవనలు చెప్పమంది.

జోగినాథం''

తండ్రి దగ్గర నుంచి ఆ ఉత్తరం వచ్చిన దగ్గర నుంచి రామ్మూర్తికి మనసు బాగులేదు.

సైకిలు తొక్కుతున్నాడు.

ఉక్కులాంటి శరీరం తనది. మెషిన్ దగ్గర రోజుకి పన్నెండు గంటలు- నిలబడితే చాలు- తిరిగి యింటికి వస్తుంటే కాళ్ళు తేలిపోయినట్లుంటోంది.

ఇచ్చిన పని పూర్తి చేస్తేనే నాలుగ్గంటల ఓవర్‌టైమ్ యిస్తామంటున్నారు సూపర్‌వైజర్స్. గట్టిగా మాట్లాడితే ఓవర్‌టైమ్ యివ్వరేమోనని భయం. మరొక గంటో, అరగంటో ఉండయినా పని ముగించవలసి వస్తోంది. పైగా తనకు సైకిలు ఉంది. బస్సులు దొరకవని బ్రతిమలాడటానికయినా కుదరదు. అడగటానికి అభిమానం అడ్డొస్తోంది.

జంక్షన్ దగ్గర ఆగిన సిటీ బస్‌లోంచి లక్ష్మణరావు దిగాడు. రామ్మూర్తి సైకిలుని చూడగానే బాక్‌సీట్ ఆక్రమించాడు.

''ఏంట్రా- మాట్లాడవూ?'' అన్నాడు.

''ఆనందకుమార్- ఈ మధ్య బొంబాయి వెళ్ళాడా?'' అన్నాడు రామ్మూర్తి.

''అదేంటి- ఆడిమీద గాలి మళ్ళింది-'' అన్నాడు లక్ష్మణరావు.

''ఎవరినయినా సరే- రెస్పెక్ట్ చెయ్యాలిరా-''

''ఏటి గురూ- డైలాగులు కొడుతున్నావు-''

రామ్మూర్తి జవాబివ్వలేదు.

లక్ష్మణరావే అన్నాడు- ''ఏమయిందిరా?''

''ఓవర్‌టైం తగ్గిస్తారుట-''

''ఎవరన్నారు-''

''ఎవరంటే నేం-? పాలసీ ఏమయినా మారుతోందా అని?''

''నేనూ విన్నాను గానీ-''

అంటూ భుజం మీద చరిచాడు- ''మనవాళ్ళు యిదిగో పులి అంటే అదిగో తోక అంటారు- రోజూ గాలి పోగెయ్యటమే గదా మనవాళ్ళ పని'' అన్నాడు.

''అవుననుకో - నిజమయితే ఎలా?''

''పోవో- యీ సాడే ముప్పాతిక ఓటీ పోతే- మన కొంపలేం మునిగిపోవు-''

టీ టైం దాకా యీ కబుర్లు సాగుతూనే ఉన్నాయి వాళ్ళ మధ్య.

''ఏంట్రా అల్లుళ్ళూ- సెవులు కొరుక్కుంటున్నారు-'' అంటూ వచ్చాడు రాజులు.

''పళ్ళున్నాయి కొరుక్కొంటున్నాంరా మావా!'' అన్నాడు లక్ష్మణరావు.

''కొరికి సూపీమంటావేట్రా- అల్లుడూ-'' అన్నాడు రాజులు.

''మనాడికి ఎవరో ఓటీ తగ్గించేస్తారని చెప్పారు. గురువు బాధపడి పోతున్నాడు'' అన్నాడు.

రాజులు రామ్మూర్తి భుజం పట్టుకు కుదిపేస్తూ అన్నాడు- ''ఏటి అల్లుడూ- ఈ ఓటీ నేకపోతే సచ్చిపోతామేటి?''

''నంజికొడకా - ఎనకాతల పాల యేపారం - నీకేట్రా?'' అన్నాడు లక్ష్మణరావు.

రాజులు - ఎప్పుడు సూసినా నా మీదపడి ఏడుస్తావురా - అన్నాడు.

***

'గుడాఫ్టర్నూన్!' అన్నాడు కృష్ణమూర్తి.

గంగూలీ అతన్ని కూర్చోమని అనలేదు. తలఎత్తి చూడలేదు.

''పిలచారుట - సార్ -'' అన్నాడు.

పెద్దగా నిట్టూర్చాడు గంగూలీ.

''నీకో కథ చెప్పాలని - పిలిపించాను-''

అతని యింగ్లీషూ, ధోరణీ రెండూ కృష్ణమూర్తికి అర్థం కాలేదు.

''చెప్పండి సార్-''

''ఇది నువ్వు వినడం కాదు- అందరితోనూ చెప్పాలి- ముఖ్యంగా మీ మెషిన్ షాప్ బాస్‌లకు చెప్పాలి-''

కృష్ణమూర్తి అయోమయంగా తల ఊపాడు.

''ఒక సింహం ఉండేదిట. ప్రతిరోజూ ఒక జంతువు వంతు వేసుకుని వచ్చి ఆహారం అయేదిట. సింహానికి సరదా వేసిందో - ఆకలి ఎక్కువయిందో - మొత్తం అన్ని జంతువులనూ చుట్టబెట్టేసి తినడం మొదలు పెట్టిందిట-''

గంగూలీ ఆపి- తలెత్తి కృష్ణమూర్తి మొహంలోకి చూసాడు.

''అప్పుడేం జరుగుతుంది కృష్ణమూర్తీ-''

కృష్ణమూర్తి మాట్లాడలేదు.

''అడవిలో జంతువు అనేది లేకుండా పోయిందిట - ఆకలితో సింహం చచ్చిందట. జంతువులు బ్రతికుంటే అవి పెరిగి పెద్దవుతాయి. పిల్లలని పెడతాయి. సింహానికి తిండి కొరత ఉండేది కాదు- అర్థమయిందా?'' ఆనంద్‌కుమార్ గంగూలీ ప్రశ్నించాడు.

ఆ కథలో మర్మం కృష్ణమూర్తికి అర్థం కాలేదు. ఆ మాట చెప్పలేకపోయాడు.

''ఈ కార్టూన్ చూడు-'' అంటూ తన టేబుల్ మీద గాజు పలక క్రిందనున్న బొమ్మను చూపించాడు.

అందులో - ఒక పనివాడు కూర్చుని తాపీగా చుట్ట కాల్చుకుంటున్నాడు. అతన్ని చూస్తూన్న మరో పనివాడు అడుగుతున్నాడు.

''అంత పని పెట్టుకుని అలా కూర్చున్నావేంట్రా?''

తాపీగా కూర్చున్నవాడి జవాబు ''ఈ పని పూర్తి చేస్తే ఓవర్‌టైమ్ ఎవడిస్తాడురా?''

కృష్ణమూర్తి ఆ కార్టూన్‌ని చూసి తలెత్తాడు.

గంగూలీ తల అటూయిటూ ఊపుతూ అన్నాడు-

''చూసావు కదా- అర్థమయింది కదా- వెంటనే వెళ్ళి మీ వర్క్‌షాప్ వాళ్ళకి చెప్పు. ఈ కార్టూన్‌లోలా ఉండవద్దని చెప్పు. ఆ సింహంలా చావవద్దని చెప్పు-''

✯✯✯

ఆ రోజు రామ్మూర్తి కాస్త పరధ్యానంగా ఉన్నాడు. శ్రద్ధగా పని చేస్తున్నట్లు లేదు. వెనకనే వచ్చి నిలబడిన కృష్ణమూర్తి అతనిని గమనిస్తున్నాడు.

రామ్మూర్తి తనను పట్టించుకోకపోవటం అతనికి నచ్చలేదు. ఫోర్‌మేన్‌గా ఉన్న తనను అనేక సందర్భాలలో ఖాతరు చెయ్యలేదు రామ్మూర్తి.

కృష్ణమూర్తి నెమ్మదిగా దగ్గాడు.

రామ్మూర్తి ఆలోచనల నుంచి బయటపడి చటుక్కున ఫోర్‌మేన్‌ను చూసాడు.

''నీకు యీ రోజు ఓటీ లేదు-''

అతను ఏమంటున్నదీ వెంటనే అర్థం కాలేదు.

''ఎందువల్ల?'' అన్నాడు రామ్మూర్తి.

''దొరగారు చెప్పారు. ముఖ్యమైన పనులు ఉంటేనే ఉంచమన్నారు-''

''అయితే- నాకు ముఖ్యమైన పని మరేదయినా యివ్వండి-''

''ఎవరి పని ఎవరు వదులుకుంటారు?''

రామ్మూర్తికి జవాబు తట్టలేదు.

''ఈవేళటికి వెళ్ళిపో రామ్మూర్తీ- రేపు మరో పని మీద వేస్తాను-''

రామ్మూర్తి అలాగే నిస్సత్తువగా ఉండిపోయాడు. కృష్ణమూర్తి వెళ్ళిపోయాడు.

ఆరోజు వర్క్ షాప్‌లో తొమ్మిది మందికి ఓవర్ టైమ్ లేదు. మధ్యాహ్నం భోజనాల దగ్గర లక్ష్మణరావు విషయం తెలిసి అన్నాడు-

''నేను వెళ్ళి చెపుతాను కిష్టిగాడితో- నువ్వు ఓటీ చేసుకోరా-''

''వద్దురా- గొడవ పడొద్దురా-'' అన్నాడు రామ్మూర్తి.

''గొడవ కాదులే- నాకు పనుందని చెపుతాను-'' అన్నాడు.

''వద్దురా- నీకు ఓవర్ టైమ్ మీద యింట్రస్టు లేదనుకుంటాడు- రేపట్నుంచి యివ్వడం మానేస్తాడేమో-'' రామ్మూర్తి వారించాడు.

ఆరోజు నాలుగు అయినా రామ్మూర్తి పని చేస్తూనే ఉండిపోయాడు.

లక్ష్మణరావు వచ్చి గుర్తు చేయటంతో బట్టలు మార్చుకుని కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయాడు రామ్మూర్తి.

ఆరోజు లక్ష్మణరావూ, మోహన్రావూ ఓటీ మధ్యలో టీ కోసం వెళ్ళలేదు.

✷✷✷

మీనాంబికా యిండస్ట్రీస్‌లో బీ.డీ. నాగయ్యని తెలియని వాళ్ళు లేరు. అతను ఒక బ్యాంక్‌ని ఏర్పరిచాడు. మనిషికి పది రూపాయలు వసూలు చేస్తాడు. దానిని వడ్డీలకు యిస్తాడు. నెలకి నూటికి పది రూపాయలు వడ్డీ. నూటికి పదహారు రూపాయలు వసూలు చేసే మరొకతను ఉన్నాడు. ఆ వడ్డీ మీద నాగయ్య వడ్డీ చాలా న్యాయసమ్మతంగా అనిపిస్తుంది. అయితే నాగయ్య ఏ నెలకి ఆ నెల వడ్డీతో బాటు అసలు కూడా వసూలు చేస్తాడు. మళ్ళీ అవసరమైతే తీసుకోమంటాడు. అతని బాంక్‌లో ఉన్న సభ్యులందరూ బాకీ వసూలు చేయటానికి సాయపడుతుంటారు. ఇంతమంది చేత కర్కోటకుడు అనిపించుకుని, యిలా వడ్డీలు వసూలు చేసి పెట్టి పదిమందికీ 'సాయపడటం'లో మర్మం వేరే ఉంది. అతని స్వంత డబ్బు కూడా- అదే వడ్డీకి తిప్పుతాడు. ఏద సొంత డబ్బో ఏది జనం డబ్బో తెలియదు. ఒక్కోమారు బాంకు డబ్బు లేదని చెప్పి మరో రెండ్రూపాయలు వసూలు చేస్తాడు నాగయ్య.

''సాయంకాలం కలవరా-'' అన్నాడు.

రామ్మూర్తికి పీకలమొయ్యా కోపం వచ్చింది.

''మూడు రోజుల బట్టి యిలాగే తిప్పుతున్నావురా-'' అన్నాడు.

''బెదరూ- నా దగ్గరుంటే మూణ్ణెల్ల బట్టి సద్దడం లేదా- ఒకడు యిచ్చేస్తానన్నాడు. అందుకే నీకు ప్రామిస్ చేసాను. వాడు యివ్వటం లేదు. నన్నేం చెయ్యమంటావురా?''

నాగయ్య మనసులో మాట బయట పడనీయడు.

రామ్మూర్తి విషయం తెల్చుకుందామని అడిగేసాడు- ''మూడు నెలలు వరుసగా అప్పు యిస్తే తర్వాత యివ్వవుట. నిజమేనా?''

నాగయ్య గట్టిగా నవ్వాడు- ''చచ్ఛ- ఎవడో తలమాసినాడికి యిలాంటి రూల్సు గాని- నీకేంటి గురూ-''

నాగయ్య మాటల్లో ఎంతకీ దొరకలేదు.

దానితో రామ్మూర్తి ''ఇస్తావో- ఇవ్వవో ఒక్క ముక్కలో చెప్పరా-'' అన్నాడు.

నాగయ్య తన నవ్వునీ విడవలేదు. మనసులో మాటనీ తేలలేదు. అతని ధోరణితో రామ్మూర్తికి ఒళ్ళుపట్టని కోపం వచ్చింది-

''జాగ్రత్త! నీ అబ్బగోడి సొమ్ము కాదిది. ఊరోళ్ళ సొమ్ము మీద నీ బోడి పెత్తనం ఏంటి? ఎముకలు విరిచెయ్యగలను-''

గొంతులు పెరగటంతో నలుగురూ కలగజేసుకున్నారు.

''ఏంటి సంగతి గురూ-'' అన్నారు.

''నువ్వు చెప్పరా'' అన్నాడు నాగయ్య.

''వాడినే చెప్పమనండి-'' అన్నాడు రామ్మూర్తి.

'నా దగ్గర డబ్బులు లేవు మొర్రో అంటే తంతానంటున్నాడు'- అన్నాడు నాగయ్య. అందరూ తలోరకంగా మాట్లాడసాగారు. కొందరు గొంతులు పెంచుతున్నారు. వాడికేం హక్కుంది వీడిని నిలదియ్యటానికి- అని కొందరంటున్నారు. వీడికేం హక్కు ఉంది. అందరి డబ్బు మీదా పెత్తనానికి- అని కొందరంటున్నారు. 'ఒళ్ళుంది గదా అని తంతానంటాడా' అని ఒకడు! ఇవ్వనని చెప్పక తిప్పటం ఎందుకూ అంటాడు మరొకడు!

'మెషిన్ షాపు వాళ్ళకున్న బుర్ర తిరుగుడు అంతా యింతా కాదు-' అన్నాడు ఒకడు.

'లంజకొడకా - షాపుని ఎత్తుతావా' అంట కలబడిపోయాడు మోహన్రావు.

కొట్టండి - తప్పుంది - అంటూ కేకలు!

''ఊరుకొండ్రా [illegible] నాయాళ్ళారా'' అంటూ కొందరు విడదీశారు. చివరికి బాంక్‌లో ఎంతమంది సభ్యులు ఒప్పుకుంటే వాళ్ళ డిపాజిట్ మేరకు డబ్బు అప్పుని యిచ్చేటట్లు

రామ్మూర్తికీ, నాగయ్యకీ నచ్చజెప్పారు.

ఇంత జరిగినా నాగయ్య డబ్బు లేదనీ, ఉన్నపుడు యిస్తాననీ చెప్పాడు.

మరొకరి దగ్గర కూడా డబ్బు కోసం ప్రయత్నం చేసి రామ్మూర్తి ఇంటికి బయలుదేరాడు.

ఇంటికి చేరేసరికి- ముందు గదిలో సీతతో బాటు చిన్నమ్మ కూర్చుని ఉంది. ఇద్దరూ ఏవో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు.

రామ్మూర్తి వాళ్ళని దాటుకుంటూ లోపలికి వెళ్ళిపోయాడు. గబగబా బట్టలు విడిచి, మొహం కాస్త తడుపుకుని మంచం మీద వాలాడు.

సీత యింకా లోపలికి రాలేదు.

బయటి నుంచి ఆమె గొంతు పెద్దగా వినిపిస్తోంది.

రామ్మూర్తికి హఠాత్తుగా ఆకలిగా అనిపించింది. అనిపించిన కొద్ది సెకన్లలోనే అది భరించరాని దనిపించేసింది. బయట నుంచి వినిపిస్తున్న సీత నవ్వులూ, చిన్నమ్మ సన్నపాటి గొంతూ అతనికి నచ్చలేదు. జరుగుతున్న ఆలస్యంతో ఆ నచ్చకపోవటం బలపడిపోయింది.

ఒక్కమారుగా అది పొంగి కట్టలు తెంచుకుని బయటపడింది.

''సీతా-''

''వస్తున్నా-'' ఆమె గొంతు వినిపించనే వినిపించింది.

''మరొస్తానమ్మా-'' అని చిన్నమ్మ అంటూనే ఉంది. ఆమె వెళ్ళిపోతున్న చప్పుడు వినిపిస్తూనే ఉంది. తలుపు వెయ్యటమూ, గడియ వెయ్యటమూ కూడా వినిపిస్తూనే ఉన్నాయి.

సీత నవ్వు గొంతుతో- ''ఈ సంగతి విన్నారా-'' అంటూ ఆ గదిలోకి ప్రవేశిస్తూనే ఉంది.

''ఏం జరిగిందండీ-'' అన్న మాట ఆమె గొంతు నించి బయటకు వస్తూనే ఉంది. అతని చేతిలో బెల్టు విసురుగా గాలిలోకి లేచి వేగంగా దూసుకుంటూ వచ్చి ఆమెను చుట్టుకుంది.

''అమ్మా- అమ్మా'' కేకలు, అరుపులతో ఆ చిన్ని గదిలో అటూయిటూ పరుగెడుతోంది సీత.

''కబడ్దార్- మొగాడు యింటికి వచ్చేసరికి- ఇంట్లో ఉండకపొయ్యావా- ఒళ్ళు చీరేస్తాను-''

అంటూ రొప్పుతూ చేతిలో బెల్టు దూరంగా విసిరేసాడు. మంచం మీద కూర్చున్నాడు. అతని శరీరం మీద బనీను లేదు. నిక్కరు మాత్రం ఉంది. ఆ ధృఢమయిన శరీరం నిండా చెమట పట్టి- వోల్టేజి తక్కువగా ఉన్న బల్బు వెలుతురులో చిత్రంగా మెరుస్తోంది. రెండు చేతులూ మంచం పట్టె మీద ఉన్నాయి.

కొండలు పిండే శక్తి గల ఆ లావుపాటి పొడవాటి వేళ్ళ కింద ఆ మంచపు పట్టె మాత్రం

నలిగిపోతోంది.

★★★

''మీరు నావేపు ఎప్పుడు తిరుగుతారు?'' అంది ప్రీతి.

ఈ ప్రశ్న అడిగే సమయానికి ప్రీతి అలసిపోయి వుంది. ఆమె పనిచేసి అలసి పోలేదు. నిరీక్షించి అలసిపోయింది. భర్త రాకకోసం నిరీక్షణ. వచ్చాక అతను తనను గుర్తించటం కోసం నిరీక్షణ. తన అలంకరణకు గుర్తింపు. తన అవసరాలకు గుర్తింపు. గుర్తించాక అతని మెచ్చుకోలు- అతని ప్రేమ- అతని లాలన- కోసం నిరీక్షణ.

రాత్రి పదవుతోంది.

గంగూలీ ఆమె వయిపు తిరగలేదు. చేతిలో పుస్తకాన్ని వదలలేదు. చటుక్కున లేచి, ఆ పుస్తకాన్ని లాక్కుంది ప్రీతి.

''ఏముందీ పుస్తకంలో?'' అంది.

''నీలో లేనిది-'' అన్నాడు నవ్వుతూ.

''ఏమిటో... అది-'' పేజీలు తిప్పింది.

''నువ్వు లొంగుతావు. అర్థమవుతావు. మనుషులను - సమూహాలను - అర్థం చేసుకోవాలి. లొంగదియ్యాలి. అంత సులువయిన పనికాదు-''

''నా పిచ్చి మనిషీ- నీ జీతం- నీ యీ అందాల భార్యామణీ- సరిపోవా?-''

''చాలవు ప్రీతీ- మనిషికి విజయం కావాలి. పనిలో తృప్తి కావాలి-''

''అందుకోసం-?''

''పడుకోవాలి- ప్రీతి-'' అన్నాడు. అంటూ పుస్తకం తీసుకున్నాడు గంగూలీ.

''ప్లీజ్'' అంది.

''ప్లీజ్'' అన్నాడు.

''నన్ను లేపకు-''

''ప్రామిస్-''

ప్రీతి పక్కకు తిరిగి పడుకుంది. నిద్రపట్టలేదు. గంగూలీ రెండు గంటల తర్వాత పడుకున్నాడు.

ప్రీతి పుస్తకం తీసి- కళ్ళజోడు తీసి- లైటు ఆర్పింది.

ఆ రాత్రి ఆమెకు చాలా సేపు నిద్ర పట్టలేదు.

★★★

మరుసటి రోజు లక్ష్మణరావు అడిగాడు.

''ఏరా- ఆ నాగయ్య గాడితో గొడవ పడ్డావట''

రామ్మూర్తి సైకిలు తొక్కుతున్నాడు.

''వాడొక లుచ్చా! పాము పగ వాడిది. మనకి వాడి అవసరం తప్పదు-''

''ఏడ్చాడు-'' రామ్మూర్తి నోటమ్మట బూతుమాట వచ్చింది.

గేటు దగ్గర సైకిలు దిగారు. అప్పుడు కూడా లక్ష్మణరావుతో మాట్లాడలేదు రామ్మూర్తి.

''నా మీద కూడ కోపం వచ్చింది నీకు-'' అన్నాడు.

రామ్మూర్తి అతనిని చూడలేదు. సైకిలు షెడ్‌లో పెట్టి నడుస్తూంటే లక్ష్మణరావు అతని భుజం మీద చెయ్యి వేసి నడిచాడు.

''మొన్న పాట ఎంతకు పాడానో తెలుసా...''

''_ _ _''

''ఆరు వందల చీటీ రొండొందల తొంభై నాలుగుకి పాడాను. ఆ ప్రసాదుగాడు చేసాడు. నా అవసరం పసిగట్టాడు. పాట పెంచేసాడు-''

''ఆ దొంగనాయాలతో ఎందుకు చెప్పావూ?''

''మన మోహన్‌గాడితో అంటుంటే విన్నాడు.''

''అంతవరకూ పాడగూడదు. వదిలెయ్యవలసింది. మొహం పచ్చడయిపోయుండేది వాడికి.''

''తప్పలేదు- సర్లే పది రోజులు ఓటీ దొరకలేదనుకుంటే సరిపోతుంది- ఇంతకీ- నువ్వు అడిగినప్పుడు అందుకే యివ్వలేక పోయాన్రా!''

రామ్మూర్తి అతని సంజాయిషీతో సమాధానపడలేదు. మనసులో అనుకున్నాడు- 'అవసరం లేనపుడు- అడగనపుడు- అందరూ మంచివాళ్ళే. అడిగితే ప్రతీ గాడిదకీ లోకువే!-'

డాంగ్రీ తొడుక్కుని మెషీన్ దగ్గరకు చేరుకున్నాడు రామ్మూర్తి.

అది నర్లింగ్ జాబ్. గబగబా లేత్‌లో జాబ్ బిగించాడు. టూల్‌ని గ్రైండింగ్ మెషిన్ దగ్గరకి తీసుకు వెళ్ళి సానబట్టాడు. టూల్‌ని సెట్ చేసాడు. డ్రాయింగ్‌ని మరోమారు పరిశీలించాడు. సప్లై ఆన్‌చేసాడు. మెషిన్ ఆన్ చేసాడు. రెండు మూడు నిమిషాలు మనసు పనిమీద నిలపాడు.

-లక్ష్మణరావు మాటలు బొత్తిగా నమ్మబుద్ధి కావటం లేదు. వాడు కట్టే బట్టలకూ, ఆడే మాటలకూ సంబంధం ఉండదు. ఓటీ పేమెంట్ వస్తే చాలు- మరుసటి రోజు కొత్త బట్టలు వేసుకొస్తాడు. ఈ షాప్‌లో ఒక చీటీ కడుతున్నాడు. మిగిలిన వర్క్‌షాప్‌లలో మరో రెండు చీట్లు కడుతున్నాడు. ఆరు నెలలు తిరగకుండానే పాడేస్తాడు- ఈ డబ్బంతా ఏం చేస్తాడో- పైన తిప్పుతున్నాడేమో- పూర్ణా మార్కెట్‌లో యిస్తే పది రూపాయలు దొరుకుతుందిట. వసూలు

చేసుకునే బలం ఉంది. వాళ్ళ అన్న పోలరావుకి డీ ఎల్ బీ లో పని- వాడికి చుట్టాలు ఎక్కువ. పాపం అడిగినపుడల్లా యిస్తూనే ఉండేవాడు. నా పరిస్థితి బావులేదని వాడికీ తెలిసిపోయినట్టుంది. మాటల్తో సరిపెట్టేస్తున్నాడు. పైసా బెసగటం లేదు. వాడి బాకీ ఎగ్గొడుతున్నాడా? నాల్గురోజులు ఆలశ్యమయినా యిచ్చేస్తూనే ఉన్నాడు గదా!

''అమ్మా-'' అంటూ భయావహంగా అరవటం, వేలాడుతున్న డాంగ్రీ చెయ్యి మెషిన్‌లో పడి అతన్ని లాగెయ్యటం, మెరుపులా లక్ష్మణరావు వెనకనున్న లేత్ నుంచి కదిలిరావటం, సప్లయ్ ఆఫ్ చేయడం... వరసగా జరిగిపోయాయి.

షాపంతా పోగయిపోయారు.

ఫోర్‌మాన్ కృష్ణమూర్తి వచ్చాడు. రామ్మూర్తికి ప్రమాదం జరగకపోవటంతో గుండె దడ తగ్గింది. గార్డ్ బిగించనందుకు నిందించాడు.

కళ్ళు తిరుగుతున్నాయంటే- వెళ్ళి కూర్చోమన్నాడు. రామ్మూర్తి వెళ్ళి నేలమీద చతికిలబడి గోడకి జారబడ్డాడు.

టీ టైంలో రాజులూ, లక్ష్మణరావూ అక్కడ చేరారు.

ఆ వర్క్ షాపు మొత్తం మీద రామ్మూర్తి చాలా మంచి పనివాడు. అతను చేసిన పనిలో శతాంశం కూడా తేడా లేని పనులున్నాయి. అలాంటి మనిషి అంత అజాగ్రత్తగా ఎలా ఉన్నాడూ?

అందరిలోనూ అదే ఆలోచన.

''రాత్రి పెళ్ళాం కూడెట్టలేదంట్రా కుర్ర తొత్తు కొడకా-'' అన్నాడు రాజులు వేళాకోళంగా.

అంతవరకూ అందరితోనూ అదీయిదీ చెపుతున్నాడు రామ్మూర్తి.

రాజులు మాటతో సీత కళ్ళముందు నిలబడింది. రాత్రి చావుదెబ్బలు తినేసింది. అప్పుడప్పుడు అలవాటేగాని ఎప్పుడూ బెల్టు తియ్యలేదు.

ఏం జరిగిందసలు?

చిన్నమ్మ అట్లుపోసి అమ్ముకుంటుంది. అణాకి ఒక అట్టు. రోజుకి ఎనిమిది పంపితే తను నాలుగు తింటాడు. మిగిలినవి సీతా, పిల్లలూ తింటారు. ఆమెకు డబ్బు కట్టి రెండు నెలలయింది. ఆ డబ్బు విషయం సీతే చూసుకుంటుంది. అలాంటి మనిషి ఒక రోజు వీధిలో నిలబెట్టి- 'ఎప్పుడిస్తావు?' అని అడిగింది. చాలాకోపం వచ్చింది. వెంటనే చేతి ఉంగరం తీసి, సీతకిచ్చి, యింటి యజమానురాలి దగ్గరకు పంపాడు. రెండు నెలల వడ్డీ ముందుగానే పట్టుకుని, నలభై రూపాయలు చేతిలో పెట్టింది. చిన్నమ్మ బాకీ తీర్చెయ్యమని యిచ్చేసాడు. వంతు రూపాయన్నరకు చవకగా దొరకుతూంటే మాంసం తెచ్చి ఆరాత్రికి వండించాడు. అప్పటి నించి చిన్నమ్మ దగ్గర ఖాతా పెట్టలేదు. డబ్బులుంటే తెప్పించుకొంటున్నారు... ఇప్పుడు ఉంగరం చెల్లగొట్టిస్తానని కూర్చుంది ఇంటి ఓనరు. వారం రోజులబట్టి దీనికోసం డబ్బు

ప్రయత్నం చేస్తున్నాడు. నాగయ్య గాడలా చేసాడు. లక్ష్మణరావూ మొండిచెయ్యి చూపించేశాడు. మోహన్ గాడి డబ్బంతా గంగమ్మ కంపెనీకీ సరిపోదు. 'చేతికాపుకి యివ్వంట్రా - ఉంగరం విడిపించి, అమ్మేసి బాకీ తీరుస్తానని బ్రతిమాలాడు. ఒక్కడూ యివ్వలేదు.

ఆ కోపం, యీ కోపం పట్టుకెళ్ళి సీత మీద చూపించాడు. పొద్దుట టీ యిచ్చినా తాగలేదు.

ఛా- ఏం పనిచేసాడూ-

రామ్మూర్తి ఆలోచనలు పరిపరి విధాలపోయాయి.

లక్ష్మణరావు రాజు వీపు మీద చరిచి- ''తొస్సి నాయాలా- నీకు ఎప్పుడూ వేళాకోళమేరా-'' అన్నాడు.

''సాయంత్రం యింటికొస్తా- ఉంగరం విడిపించుదాం-'' అన్నాడు రామ్మూర్తితో. రామ్మూర్తి 'వద్దు' అందామనుకున్నాడు. అనలేకపోయాడు.

ఆరోజు భోజనాలకు ముందు రామ్మూర్తిని కృష్ణమూర్తి తన గదిలోకి పిలిచాడు.

''వంట్లో ఎలా ఉంది?'' అన్నాడు.

''బానే వుంది-''

''కూర్చో-'' అన్నాడు. రామ్మూర్తి కూర్చోలేదు.

''ఈ డ్రాయింగ్ చూడు-'' అంటూ ఒక డ్రాయింగ్ యిచ్చాడు. రామ్మూర్తి పరిశీలించసాగాడు.

''ఇది చాలా ముఖ్యమయిన పని- ఎవరికి అప్పగిద్దామని అడిగారు దొరగారు. నీ పేరు చెప్పాను. పదిహేను రోజులపాటు కంటిన్యూగా ఓటీ ఉంటుంది. అయితే-''

రామ్మూర్తి మనసు ఆనందంతో రెపరెపలాడింది.

''చెప్పండి సార్-''

''నీ పని వాడితనం నాకు తెలుసు. దొరకి తెలియదు. ఆయన ప్రత్యేకంగా తీసుకున్న పని యిది. అయిదు నమూనాలు నువ్వు తయారు చేస్తే- దాని ఫిట్‌మెంట్‌ని బట్టి మనకు చాలా పెద్ద ఆర్డర్ దొరుకుతుంది. నీకూ - నాకూ - మాట రాకూడదు. చేస్తానంటే నీకు వప్పజెపుతాను - లేదంటే...''

''నో సర్... నోనో సర్... తప్పకుండా చేస్తాను. మీరే చూస్తారు...'' అన్నాడు.

''ఎస్టిమేటెడ్ టైం కన్న ముందు పూర్తి అయితే నీకు రెస్టు కూడా దొరుకుతుంది-''

రామ్మూర్తి మరోమారు కృతజ్ఞత చెప్పి అక్కడ నుంచి బయటపడ్డాడు. ఇర్వై రోజుల తర్వాత ఓటీ రామ్మూర్తికి మళ్ళీ దొరికింది.

కృష్ణమూర్తి తన కుర్చీలో జారబడి ఎదురుగా నున్న కాలండర్‌లోని రామ పట్టాభిషేక

దృశ్యంలో రాముడికి నమస్కరించాడు.

✯✯✯

ఆ రోజు రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో ఇల్లు చేరుకుని, సైకిలును ముందు గదిలో పెట్టి, తలుపులు మూసి, గడియవేసాడు రామ్మూర్తి.

నిద్రపటాపంచలయిన సీత బిక్కుబిక్కు మంటూ వడ్డించటానికి తయారయింది. రామ్మూర్తి ఆమెను రెండు చేతులతోనూ ఎత్తుకు వచ్చి మంచం మీద పడుకోబెట్టి కొబ్బర్నూనె తీసుకుని రాస్తూ కూర్చున్నాడు. భోజనం చెయ్యమన్న సీత బ్రతిమలాటలు ఫలించలేదు.

ఆరు గంటలకు పైగా ఏకదీక్షగా పనిచేసి, అయిదు మైళ్ళు సైకిలు తొక్కి అలసిన శరీరంతో... ఆ చీకట్లో... ఆమెను మెల్లగా ఆవరించుకున్నాడు రామ్మూర్తి.

గడచిన రాత్రి అతను కొట్టటానికి... ఆ రాత్రి అలా సుఖపెట్టటానికి... అసలు కారణాలు అతనితో బాటే ఆమెకూ అర్థం కాలేదు. చేతనైన విధంగా అభిమానాన్ని వ్యక్తీకరించటానికి... దాన్ని స్వీకరించటానికి... ఆమె మనసూ... శరీరమూ సిద్ధమవుతూండగా అతన్ని పెనవేసుకుంది సీత.

✯✯✯

తాత్కాలికంగా అవసరం గడిచినా రామ్మూర్తిది అప్పులు పుచ్చుకునే జాతి. నాగయ్యది అప్పులిచ్చే జాతి. నాగయ్య లాంటి వాడికి వడ్డీ, అసలుతో బాటు... వినయమూ, కృతజ్ఞతా... చెల్లించాలి రామ్మూర్తి లాంటి వాళ్ళు. వాస్తవానికి నాగయ్య అంచనా ప్రకారం... అవే అసలు సంకెళ్ళు. రామ్మూర్తి ఎక్కడ ఎంత పొగరు మోతుతనం చూపించినా... అప్పుపుట్టే దగ్గర కాస్తంత తగ్గి ఉండవలసిందే- అలా జరగలేదు.

జంతువులు మేతలో కలహించుకున్నా వేటలో కలిసే ఉంటాయి. నాగయ్య జాతి వాళ్ళకు... వృత్తిరీత్యా ఎంత పోటీ ఉన్నా... అప్పులు పుచ్చుకొనే పొగరుమోత్తనాన్ని వంచటానికి ఒక్కటవుతారు.

''నీ... కొద్దీ నువ్వు అప్పు పుచ్చుకున్నావు. అడిగిన వడ్డీకి ఒప్పుకున్నావు. వాడిదా తప్పు?'' అని ముక్తకంఠంతో అంటారు. అప్పులు పుచ్చుకునే జాతి వాళ్ళు కూడా... వాళ్ళకి కోపం తెప్పిస్తే ఏమవుతుందోనని... ఆ ముక్త కంఠం వెనకనే జయజయధ్వానాలు చేస్తారు.

రామ్మూర్తి పరపతి దెబ్బతింది. అప్పు పుట్టకపోవటంతో అతను ఉడికిపోసాగాడు. లక్ష్మణరావు మరీ పీకల మీదకి వచ్చినపుడు చిన్నచిన్న అవసరాలు గట్టెక్కిస్తూనే ఉన్నాడు.

చివరకి నాగయ్యకీ... రామ్మూర్తికీ మధ్య మంటలు బయటపడ్డాయి. రామ్మూర్తి చెయ్యి చేసుకున్నాడు- అదెలాగయిందంటే...

✯✯✯

యువజన సంఘం వారి క్లబ్ దగ్గర శ్రీరామ నవమి సంబరాల సందర్భంగా కారమ్స్

పందాలు అవుతున్నాయి. ఆరుబోర్డుల చుట్టూ జనం. ప్రతి బోర్డు చుట్టూ వెదురు వాసాలు కట్టారు. ఆడేవాళ్ళకు యిబ్బంది లేకుండా ఏర్పాటు చేసారు. నిశ్శబ్దంగా ఉండాలని బోర్డులు వేలాడదీసారు. ఆ ప్రదేశమంతా పట్టపగలులా ఉంది. ఆట జోరుగా సాగుతోంది.

''నువ్వు ఫౌల్ గేమ్ ఆడుతున్నావ్-'' అంటూ ఒక ఆటగాడు గొంతు పెంచాడు.

రిఫరీ అతనికి నచ్చజెప్పబోయాడు.

''దొంగ నాయాలా-'' అన్నాడు ఆటగాడు రిఫరీని.

రెండవవాడు జరిగినది వివరించే ధోరణిలో ఉన్నాడు.

ఆట చూస్తున్న జనంలో కొందరు తప్పులేదన్నారు. కొందరు తప్పేనన్నారు. ఆట రిఫరీ ఈ గొడవ సర్దేసేలోగా - నాగయ్య ఒకమాట అన్నాడు. అతనూ, లక్ష్మణరావు అన్న పోలరావూ ఆ క్లబ్బుకు సెక్రటరీ, ప్రెసిడెంటూనూ...! రామ్మూర్తి కూడా ఒక ఆటగాడు.

''ఈ అల్లిపురం వాళ్ళకి గర్రా ఎక్కువ- వాళ్ళను గేమ్‌లోకి రమ్మనటం నా తప్పు-'' అన్నాడు నాగయ్య.

''ఏంట్రా- కూస్తున్నావ్-'' అంటూ తాచుపాములా లేచాడు రామ్మూర్తి.

''అవునురా-'' అంటూ తడబడుతూ మేకపోతు గాంభీర్యంతో ఏదో చెప్పబోయాడు.

''పేటల్నెత్తుతావ్‌రా- బాడకావ్-'' అంటూ చొక్కా చేతులు మడిచాడు రామ్మూర్తి. నాగయ్య దవడ పేలింది అంతే!

నువ్వెంతంటే నువ్వెంత! జనం రెండు కింద చీలిపోయారు. గొల్లవీధిలో పందాలవుతున్నాయి. అల్లిపురం జనాభా నామమాత్రంగా ఉన్నారు. మీదకి వచ్చిన వాళ్ళను కొడుతూ అక్కడ నుంచి పరుగెత్తాడు రామ్మూర్తి. ఉన్నాళ్ళు కకావికలై పారిపోయారు. ఒక లోకువ వాడు దొరికిపోయాడు. వాడిని చావదన్ని, రిక్షాలో పడేసి అల్లిపురం గాంధీ బొమ్మ దగ్గర వదిలెయ్యమని పంపారు.

రాత్రికి రాత్రి మూలమూలల్నున్న సైకిలు చెయన్లూ, కర్రలూ, కత్తులూ బయటకి వచ్చాయి. జనం కదిలారు. మరుసటి రోజు సాయంత్రానికి అయిదారు వందల సోడా బుడ్లు పేలాయి. ఆరుబుర్రలు పగిలాయి. యిర్వై రెండు మందికి గాయాలయాయి. ఇళ్ళ తలుపులు మూసుకున్నాయి. దుకాణాలకు తాళాలు పడ్డాయి. బజారులు పలచబడ్డాయి. భాష్పవాయు ప్రయోగం, లాఠీఛార్జీ సాగాయి. మూడు వందల మందికి పైగా జనాన్ని గొడ్లని బందిలదొడ్డిలోకి మళ్ళించినట్టు ఒకచోట కూర్చోబెట్టడం జరిగింది.

అరెస్టు అయిన ముప్పై యిద్దరిలోనూ రామ్మూర్తి ఒకడు. చాలామందిని గూండా ప్రివెన్షన్ కింద అరెస్టు చేశారు.

✯✯✯

''మన క్లబ్బుకొచ్చాడు. మన సెక్రటరీ నంజికొడుకు గాడి కీళ్ళిరిసేసాడు. ఆ నంజికొడుకు బొక్కలో సవ్వాల్సిందే'' పోలరావు అరుస్తున్నాడు.

అతని గొంతు మామూలుగా పెళ్ళానికే వినిపించదు. తాగితే మాత్రం ఊరూ, వాడా ఏకం చేస్తాడు.

లక్ష్మణరావు రెండుగంటల బట్టి అన్నగారి కోసం కాచుక కూర్చున్నాడు. వచ్చే ముందే మందు వేసుకొని వచ్చాడు పోలరావు. ఆ స్థితిలో అన్నగారితో మాట్లాడటం లక్ష్మణరావుకి వ్యర్ధమని తెలుసు.

కాని- తప్పదు.

పోలరావు గనక కంప్లైంటు తిరిగి తీసుకుంటే రామ్మూర్తి మీద ప్రత్యేకించి కేసు ఉండద్దు దొమ్మీ కేసుగా పోతుంది. నాగయ్య పోయించిన సారా పోలరావు నరాలలో ఉంది.

''నాగయ్య నాకు అంతా చెప్పాడు-'' అన్నాడు పోలరావు.

''ఆడికీ- మా వోడికీ పడదు. టైం చూసి యీడు మా వోడిని యిందులో యిరికించాడు. నేను ఇన్స్పెక్టర్‌తో మాట్లాడాను. నువ్వు కంప్లైంటు తిరిగి తీసుకుంటే చాలుట-''

''నేను తీసుకోను- నా సెక్రట్రీ గాడెంత దొంగెదవో నాకు దెల్సు. ఆడు నన్ను నెట్టేద్దారని సూత్తన్నాడు. అయినా సరే- ఇది ప్రెస్టేజి సంగతి-''

''నువ్వు యిడిపించకపోయినా నాను యిడిపించగలను. డబ్బు కరుసవుద్ది. నా డబ్బూ- నీ డబ్బూ ఒకటేగా?''

అంత సముదాయింపుగా మాట్లాడినా పోలరావు రెచ్చిపోయాడు.

''యిడిపించరా- ఎలా యిడిపించుతావో సూస్తా-''

లక్ష్మణరావుకి నిదానం హెచ్చు. రామ్మూర్తిలా తెలివితక్కువగా తలదూర్చడు. దిగాడా- అవతల మనిషి కాలో, చెయ్యో విరిచెయ్యకుండా వదలడు.

మరిదిలో మార్పు గమనించే సరికి పోలరావు భార్య కలగజేసుకుంది. తాగుబోతుతో తగువు వద్దంది. నీకెందుకు నాదీ పూచీ అంది. ఆ మాటకే భర్తచేత దెబ్బలు కాసింది. లక్ష్మణరావు కలబడబోతే అతన్ని మంచి మాటల్తో పంపేసింది.

మరుసటి రోజు పోలరావు భార్య మాటలు విన్నాడు.

లక్ష్మణరావు భార్య తమ్ముడికి పోలరావు పెద్ద కూతురని యిచ్చారు. అప్పుడొక వెయ్యి రూపాయలు సర్దుబాటవలేదు. తర్వాత యిస్తానన్నాడు పోలరావు. లక్ష్మణరావు పూచీపడ్డాడు. అల్లుడి మాట కొట్టెయ్యలేక సరే కానియ్- అన్నాడు లక్ష్మణరావు మామ. పెళ్ళయిన తర్వాత పోలరావు అప్పుడో పదీ, యిప్పుడో పదీ అల్లుడి చేతిలో పెట్టి- బాకీలేం లేవు- అని తేలగొట్టేసాడు.

'వాడికి యిచ్చింది నాకిచ్చినట్టు కాదు - వాడిని నీలో కలిపేసుకుందా

మనుకుంతనావేమో- నాను వల్లకోను' అన్నాడు పిల్లడి తండ్రి.

అంతకన్నా గొంతుపెంచి- ''కట్నం వాణ్ణి జూసి యిచ్చాను గాని- నిన్ను జూసి కాదు- అంతకు ముందు యిచ్చింది కూడా కక్కు-'' అన్నాడు పిల్ల తండ్రి.

అటు మామగారు - యిటు అన్నగారు! లక్ష్మణరావు అడకత్తెరలో పోకచెక్కయ్యాడు.

బావమర్ది రాఘవ తెరమీద సినిమా జూసినట్టు చూస్తుంటే - మండిపోయింది.

''ఏంట్రా - మాటాడవ్!'' అన్నాడు.

''ఆళ్ళిద్దరిలో ఎవడోడినా- ఎవడు గెలిసినా మనకి వట్టంనేదు.'' మనం దిన్న రూపాయలు పోవు- కట్టుకున్న పెళ్ళాం పోదూ-'' అంటూ పాయింట్‌లాగాడు.

లక్ష్మణరావుకి లాగి ఒకటిద్దామనిపించింది. పస్తాయించాడు. ఒకపక్క బామ్మర్ది- పెళ్ళానికి కోపం వస్తుంది. యింకోపక్క అల్లుడు - రత్నాన్ని ఏమంటాడోనని బెంగ.

ఇలా మొగుడు కలగజేసుకోకుండా- తండ్రి గొడవను తెంచుకోకుండా- మామ దాన్ని చల్లారనీకుండా బలాబలాలు ప్రయోగిస్తుంటే మధ్యలో నలిగింది రత్నం. కూతురి గురించి బెంగెట్టుకుంది తల్లి.

లక్ష్మణరావుని ఆ విషయం తేల్చమని బతిమాలుతోంది వదిన...

మరుసటి రోజు భార్య చెప్పిన మాటలు బుద్ధిగా విన్నాడు పోలరావు.

''ఓసి ఎర్రిపీనుగా- ఆడి సేతిలో ఉంటే ఆడుసేస్తాడే- ఆడు నా తమ్ముడే! లచ్మనసోమే-'' అన్నాడు.

రామ్మూర్తి విడుదలయాడు. పోలరావు రాజీపడ్డాడని- నాగయ్య గునిసాడు.

''ఆడు మీ ఫ్యాక్టరీ వోడేనంట- నేను కంప్లైంటు ఎనక్కి తీసుకుంటే- ఓరి నాగ్గా- నువ్వు ఎల్లి కేసు ఎట్టేరా-'' అన్నాడు పోలరావు.

నాగయ్యకి ఆ పని చెయ్యటానికి ధైర్యం చాలలేదు.

★★★

''ఊళ్ళో గొడవల్లో మనవాళ్ళు ఉన్నారట-'' అన్నాడు గంగూలీ-

''అవును సార్-'' అన్నాడు తిరుమలరావు.

అంతకన్న అతను ఏమయినా చెపుతాడేమోనని చూసాడు గంగూలీ.

''ఎవరు?''

''మౌల్డింగ్ షాప్ వాళ్ళూ, మెషిన్ షాప్ వాళ్ళూ''

''వాళ్ళ మధ్య గొడవలు వస్తాయంటావు-''

నేనేం అనటం లేదు- అందామనుకున్నాడు.

తలపంకించి- ''తిరుమలరావ్! అంబళగన్‌ని కొట్టిన వాళ్ళ మధ్య గొడవలకి మనం సంతోష పడాలి గదా-'' అన్నాడు గంగూలీ.

''ఎందుకు సార్-'' అన్నాడు తిరుమలరావు.

ఏరకమైన భావ ప్రకటనా లేని అతని మొహాన్ని చూసి- కళ్ళు పెద్దవి చేసి- అడుగు పెదవిని పళ్ళతో నొక్కి

''యూ కెన్ గో-'' అన్నాడు.

తిరుమలరావు బయటకి వస్తూ- వర్కర్స్ మధ్య గొడవలుంటే ప్రొడక్షన్ దెబ్బతినదా? అనుకున్నాడు.

***

ఎవరికీ కుర్చీ యివ్వని దొర తనకు యిచ్చేసరికి సత్తిరాజు సగం మనిషై పోయాడు. పది నిమిషాల దాకా గంగూలీ మాట్లాడలేదు. ఫైలు చూస్తున్నాడు. ఆతర్వాత తల పైకెత్తి చిన్నగా నవ్వాడు.

''మిస్టర్ సత్తిరాజూ-''

''యస్సార్-''

''మీ అనుభవం మా కంపెనీకి వరప్రసాదం.'' అన్నాడు. రెండు చేతులూ చాచి, కొన్ని సెకన్లు అలాగే ఉంచి, పెదాలను పళ్ళ మధ్య యిరికించి నొక్కుతూ చేతులు కలిపాడు. ముఖమంతా తృప్తితో చూసాడు.

''యస్సార్- నో సార్- అయామ్ స్మాల్ సర్- యూ బిగ్ సర్--'' కంగారుగా అన్నాడు సత్తిరాజు.

''మీ వంటి పనివాడున్నందుకు గర్విస్తున్నాను-''

''థేంక్సు సర్- థాంక్స్ సర్.''

''మిమ్మల్ని మెషిన్ షాప్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాను-''

''--నేను ---నేను --మోల్డింగ్ సర్-''

''యా-- నాకు తెలుసు-- మౌల్డింగ్ సెక్షన్ నించి జాబ్స్‌ని మీరు మెషినింగ్‌కి మెషిన్ షాప్‌కి పంపుతున్నారు-''

''అవును సర్''

''అప్పుడప్పుడు వెళ్ళి జాబ్ ఏమయిందీ చూస్తున్నారు...'' అన్నాడు గంగూలీ.

నిజానికి సత్తిరాజు చూడటం లేదు. డ్రాయింగ్ నీ జాబ్‌నీ పంపితే మెషిన్‌షాపే మిగిలిన పని చూసుకుంటోంది. సత్తిరాజు తనకు లభించిన క్రెడిట్‌ని వదులుకొనే స్థితిలో లేడు. ఆ విషయం అతనికన్నా గంగూలీకి తెలుసు.

''...కావచ్చు సార్...'' ఇబ్బందిగా కదిలాడు.

''సో... మౌల్డింగ్ జాబ్స్‌ని మీరు మెషిన్ షాప్‌లో సూపర్వైజ్ చేయవచ్చు-''

సత్తిరాజుకి ఏమనాలో తెలియలేదు.

'అలవాటయిన పని నుంచి తప్పించి- ఇంకోచోట వేయటం వల్ల- ఒక పనివాడిని కోల్పోవటమే గదా- తప్పదు' అని ఆనంద్‌కుమార్ అనుకున్నాడు-

సత్తిరాజుకి కొంచెం అవకాశం యిచ్చాక- అన్నాడు గంగూలీ,

''...ఈ మార్పు మీకు యిష్టమే-''

''మరోమారు ఆలోచించండి సర్-'' హిందీలో అన్నాడు సత్తిరాజు.

''నాకు అర్థంగాలేదు- మీ అభిప్రాయం.''

''మరెవరినయినా వెయ్యండి సర్-'' తెగింపుగా అన్నాడు.

''ఎందుకని-''

''మా షాప్ వాళ్ళకీ- ఆ షాప్ వాళ్ళకీ పడటం లేదు సర్-''

''అంటే--?''

సత్తిరాజు చెప్పాడు- ఊళ్ళో గొడవల్లో వాళ్ళూ, వీళ్ళూ ఉన్నారట. తను ముసిలివాడుట. మెషిన్ షాప్ వాళ్ళతో పని చెయ్యటం కష్టమని ధ్వనించాడు.

ఆయువు పట్టు దొరకినట్టు నవ్వాడు గంగూలీ.

''...అలాంటి వాళ్ళ చేత పని చేయిటంచటమే అసలైన సూపర్వైజర్ లక్షణం. మిమ్మల్ని అక్కడ వెయ్యటంలో నా ఉద్దేశ్యం యిదే! మీ మాట వినని వాళ్ళకి ఓటీ యివ్వకండి- ఎవడైనా ఎదురుతిరిగితే నాకు చెప్పండి. నేను చూసుకుంటాను-''

సత్తిరాజు ఆలోచనలో పడ్డాడు- వాళ్ళేం రాక్షసులా? పైగా దొర ఓటీ గురించి చెపుతున్నాడు గదా! అసలు దొర నువ్వు అక్కడికి పోరా- అంటే పోవాలి. ఎంత దొడ్డబుద్ధి! తనని ఎంత గౌరవించాడు!

సత్తిరాజుని మెషిన్ షాప్‌కి వేసాడు గంగూలీ.

★★★

'చచ్చిందిరా గొర్రె!' అనుకున్నాడు నాగయ్య. కూతురు పెళ్ళంటే నాలుగు వేలు సత్తిరాజుకి అప్పుయిచ్చాడు. నాలుగు రూపాయలే వడ్డీ. ఇన్నాళ్ళు సత్తిరాజు కింద తన పని కడుపులో చల్ల కదలకుండా గడిచిపోయేది. ఇప్పుడీ ముసలి నక్కకి ట్రాన్స్‌ఫర్ అయితే-!! జీతాల రోజున అప్పులు వసూలు చెయ్యటానికి సత్తిరాజు ఎంత దన్నుగా ఉండేవాడు!

''బెదరూ- నన్ను ముంచేసి పోతున్నావ్-'' అన్నాడు నాగయ్య.

సత్తిరాజు స్కూటర్ నెమ్మదిగా నడుపుతున్నాడు. అతను నాగయ్య మాటని

పట్టించుకోలేదు.

''పొద్దుట్నించి ఏడుత్తున్నావ్- అక్కడ పని అంటే నాకు కచ్చల్లో కందులు యేపినట్టుంది-'' అన్నాడు.

''నీకెందుకు బెదరూ... భయం?''

తన భయాలు చెప్పుకునేటంత చనువు నాగయ్యకి యివ్వటం సత్తిరాజుకి యిష్టం లేదు.

స్కూటర్ పార్క్ చేసి- చావులమదుం అండర్‌బ్రిడ్జి దగ్గర వైన్ షాప్‌లోకి దూరారు. వెనకాతల చిన్నగది. గలీజుగా ఉన్న టేబిల్సూ... బల్లలూ...! సిగరెట్ పొగ. జనం యింకా చేరలేదు. కొందరు కూర్చుని బీరు తాగుతూ మిరపబజ్జీలు నవుల్తున్నారు. ఒకడు క్వార్టర్ బాటిల్ మూత తెరిచి నోట్లో ఒంపేసుకుని... గొంతుకలోంచి పెద్ద శబ్దాలు చేసి... వెళ్ళిపోయాడు.

''ఏం మగాడు బెదరూ- నీళ్ళు కూడా కలుపుకోలేదు-'' అన్నాడు నాగయ్య పకోడీలూ, మిక్చరూ, రమ్మూ పురమాయించాక.

సత్తిరాజు మాట్లాడలేదు.

''అంత భయపడిపోతే... చెప్పెయ్ లేకపోయావా?'' అన్నాడు నాగయ్య.

''దొరగారు మనకి అంత మరియాద యిచ్చారు'' అన్నాడు సత్తిరాజు.

''ఒక రహస్యం చెప్పనా?'' నాగయ్య ఎవరైనా వింటారేమో అన్నట్లు అన్నాడు.

కుతూహలంగా చూసాడు సత్తిరాజు.

''రామ్మూర్తి... మోహన్రావూ... ఆళ్ళిద్దరే బెదరూ అలీని... అంబళగన్ దొరని షూటింగ్ యేసింది-''

''నీకెలా తెలుసు...'' ఆశ్చర్యంగా అడిగాడు.

''ఆరోజు షాపులో రామ్మూర్తీ, ఆలీతో గొడవపడ్డాడు... లేబరర్ ఉన్నాడు గదా శాస్త్రిగాడు... వాడిచేత రోజూ కారేజీ తెప్పించుకుంటాట్ట అలీ...! తప్పుద్దా-? బాపనాడయినా - లేబరుద్యోగమన్నాక ఏం జెప్పినా చెయ్యాల- కారేజి తిన్నాక అది కడగాల... ఆరోజు సరిగా కడగనేదని కొట్టాట్ట అలీ... ఆ మధ్యాహ్నం షాపు మధ్యలో పెట్టి అడిగేసారు. 'జాగ్రత్త' అంటూ వార్నింగ్ యిచ్చారు. అలీగాడు... అంబళగన్ మనోడుగదా... అని మోసేసాడు ఏటయింది-? యిద్దరికీ షూటింగయిపోయింది. బెదరూ-''

నీకూ అలాగే అవుతుందన్న గొంతుతో మరింత బెదరగొట్టాడు నాగయ్య మిక్చరు నోట్లోకి ఒంపుకుంటూ

''ఇదంతా నాకూ దెల్సు-'' అన్నాడు.

''ఆ యవ్వారం నడిపింది వాళ్ళిద్దరే-''

''నీకెలా తెలుసురా... నాగ్గా?'' భయం వదుల్చుకోటానికి గ్లాసు ఖాళీ చేస్తూ అన్నాడు సత్తిరాజు.

''నమ్మకపోతే- మానెయ్ గురూ- నీకే తెలుస్తది''

కుర్రోడు వచ్చి- ''సాయంకాలం పోలీసులు రావచ్చు- తొందరగా ఖాళీ చెయ్యమన్నాడు షావుకారు-'' అన్నాడు మధ్యలో.

నాగయ్య బెదురుగా సత్తిరాజు వేపు చూసాడు. సత్తిరాజు పట్టించుకోలేదు.

''నా చేతిలో ఓటీ ఉంది. రామ్మూర్తి గాడవనీ, ఆడి అమ్మ మొగడవనీ- ఓ పట్టుపట్టేస్తా''

సత్తిరాజుకి పట్టు ఎక్కువయిందని నాగయ్యకి తెలిసిపోయింది. నాగయ్య కంపెనీ యిస్తాడు గాని పెద్దగా తాగడు.

'ముసలినక్కా- ఆడిపని నువ్వు పడతావో- నీ పని ఆడు పడతాడో నేను సూస్తాను గదరా-' అనుకున్నాడు నాగయ్య.

''నిజమే గురూ- ఆడు నీ యెనక కుక్క నాగ తిరుగుతాడు -'' అన్నాడు.

సత్తిరాజు కళ్ళు పెద్దవి చేసి, బల్లమీద గుద్దాడు.

''బెదరూ- నా అప్పుమాట-'' నసిగాడు నాగయ్య.

''ఓరినాగ్గా- యీడు సత్తిరాజురా- నీ డబ్బుకి ఢోకా నేదురా-! ఒరేయ్ నీకు రామ్మూర్తి గాడంటే దడదడ! నువ్వు గనక ఆడికి అప్పిత్తన్నావ్ పిరికినాయాలా-''

అరుస్తున్న సత్తిరాజుని అటూయిటూ ఊగిపోతూంటే బయటికి లాక్కుపోయాడు నాగయ్య. బయట వైన్ షాప్‌లో బల్ల ఖాళీ అవటం కోసం చూస్తున్నాళ్ళు గబగబా లోపలికి దూరిపోయారు.

★★★

సత్తిరాజుని చూసి మెషిన్ షాప్‌లో వర్కర్స్ ఎవరు ఏం అనుకున్నా- అనుకోకపోయినా- ఫోర్‌మాన్ కృష్ణమూర్తీ, మిగిలిన ఛార్జిమెన్లూ చాలా అనుకున్నారు.

''వీడు దొరని పట్టాడు. మనం నోరు విప్పితే మోసేస్తాడు-'' అనుకున్నారు.

సత్తిరాజు పోజు కృష్ణమూర్తికి భరించరానిదిగా అయిపోయింది.

చెయ్యటానికి తగిన పని లేకపోవటంతో సత్తిరాజు ప్రతివాళ్ళ మీదా 'నువ్వేం చేస్తున్నావ్?' అంటూ ఆరాలు తీయటం మొదలుపెట్టాడు.

''అయితే సత్తిరాజు కొందరి మీద ఎందుకు పెత్తనం చెయ్యటం లేదు?''

అని ప్రశ్నించుకున్నాడు కృష్ణమూర్తి.

''ధైర్యం లేక'' అని ఒక ఛార్జిమెన్ అన్నాడు.

'కాదు- వాళ్ళు వాడికి దగ్గర' అన్నాడు యింకొకడు.

కృష్ణమూర్తి యింకొకడి మాట నమ్మాడు.

★★★

మెషిన్ షాప్‌లో ఎవడికి ఏం జరిగినా అందరూ సమానంగానే పట్టించుకుంటారు. మోహన్రావు కాస్తంత ఎక్కువ మోతాదులో పట్టించుకుంటాడు. అతగాడి లావూ, ఎత్తూ అందుకు దోహదపడుతుంది.

'ఈ నంజికొడుక్కి కండేగాని, గుండె నేదురా-' అంటూ వేళాకోళం చేస్తాడు రాజులు.

'యేపారం జేసుకొనీ నంజికొడకా- నువ్వే జెప్పాలిరా-' అంటూ పెద్దగా నవ్వుతాడు మోహన్రావు.

రికామీగా తిరిగే మోహన్రావుకి కూడా ఓటీ దొరుకుతుంటే కాస్త బావుంది. 'నీ డబ్బంతా గంగమ్మ కంపెనీకే గదరా తొత్తుకొడుకా-' అంటాడు రాజులు. 'ఓపికుంటేనే గదరా- ఏదన్నా-' అంటాడు మోహన్రావు.

నెలరోజులుగా మోహన్రావుకి ఓటీ లేదు. అతని వెనకే తిరిగే లేబర్ నూకరాజుకీ ఓటీ లేదు. నూకరాజుకి దొరకకపోతే మోహన్రావుకి మరింత బాధగా ఉంది.

కొందరికి దొరుకుతోంది. కొందరికి దొరకటం లేదు. ఎవరయినా యీ విషయం ఎత్తినా- ''ఎవడికయినా డబ్బు యివ్వాలి గదా- కొందరంటే యిష్టం కొందరంటే కోపం ఎందుకుంటుంది?'' అంటున్నారు ఓటీ దొరికేవాళ్ళు.

ఒకరోజు సత్తిరాజు 'పని సరిగ్గా చెయ్యకపోయావా- ఓటి యివ్వను' అని బెదిరించాడట - ఒకడిని.

మెషిన్ షాప్‌ని ఆ బెదిరింపు బాగా కుదిపింది.

★★★

''నాకేం తెలీదురా మోహనూ'' అన్నాడు సత్తిరాజు వణుకుతూ.

జంక్షన్‌లో చుట్టుముట్టారు జనం.

ఇది ఆ కృష్ణమూర్తి గాడిపనే- ఆడే యీళ్ళకి ఎక్కించాడు- నా పనయిపోయింది- అనుకున్నాడు సత్తిరాజు.

''నువ్వు మాలాటాడివే- మానాగే కింద నుంచి వొచ్చావు- ఇలా బెదిరించటం నీకు తగదు-'' ఈ ధోరణిలో మోహన్రావు మాట్లాడుతున్నాడు.

'అవున్రా' 'నిజమేరా' అంటూ వెంటనే అంగీకరించేస్తున్నాడు సత్తిరాజు.

మోహన్రావుతో బాటు ఒకరూ, ఒకరూ పదిమందీ మాట్లాడటం ఆరంభించారు.

వాళ్ళ గొంతులో హక్కు కోసం పోరాటం లేదు, న్యాయం కోసం అర్థింపు

ఉందనిపించగానే సత్తిరాజుకి వణుకు తగ్గింది. క్రమంగా పుంజుకుంటున్నాడు.

''మీరు సెప్పేదంతా నాకు తెలదంటారా?''

''మరవుతే- యీ పార్షియాలిటీ ఏంది గురూ?''

''మీలోంచి వొచ్చాను... మీ అందరూ నాకు ఒకటే గదరా...'' అంటూ ఆగాడు సత్తిరాజు.

''చెప్పు గురూ-''

''నేనేం ఫోర్‌మెన్ నట్రా... ఓటీ యివ్వటానికీ, యివ్వకపోవటానికీ...'' అన్నాడు.

ఒకరి ముహాలలో ఒకరు చూసుకొన్నారు.

''ఇవ్వనని బెదిరించావుట'' అన్నాడు మోహన్రావు.

''ఎవడితో అన్నానో- ఆణ్ణి తీసుకురా-''

-ఎవడాడు ఎవడాడు అంటూ ప్రశ్నలు మొదలయ్యాయి. మోహన్రావు విసుగ్గా వాళ్ళని తిట్టాడు- ఆ నంజికొడుకు ఎవరో గూడా తెల్దంట్రా అన్నాడు.

''సరే...! రేపు ఆడిని తీసుకొచ్చి మొహం మీదే తేలుస్తాం- నువ్వెళ్ళు-''

సత్తిరాజు స్కూటర్‌కి దారి యిచ్చాడు.

★★★

సత్తిరాజు స్కూటర్‌ని గోపాలం యింటి ముందు ఆపాడు. 'రండి రండి'- అన్నాడు గోపాలం. అతను కూడా కృష్ణమూర్తి లాగే డిప్లమా చదువుకున్నాడు. అతను చదువుకున్నాడనీ, కృష్ణమూర్తి మీద పోటీ ఉంటుందనీ, అందువల్ల తనకు తగిన సలహా యిస్తాడనీ సత్తిరాజు అనుకున్నాడు.

''-ఏటి మీ మెషిన్ షాపోళ్ళ యవ్వారం గోపాలంగారూ- నన్ను రోడ్డు మీద నిలబెడతారా? దొరతో సెప్పమంటారా?'' అని అడిగాడు- అంతా జెప్పి.

బలే దొరికాడు- అనుకున్నాడు గోపాలం. 'ఈ ముసలాడు ఎక్కడ నుంచో వచ్చి మా మీద ఎక్కుతాడా' అని మంటగా ఉంది అతనికి.

''తప్పకుండా... తప్పకుండా... చెప్పాల్సిందే...'' అన్నాడు గోపాలం.

అనుమానంగా చూసాడు సత్తిరాజు.

''మీరు చెప్పడం వేరు. మేం చెప్పడం వేరు. గంగూలీ గారికి మీ మీద, మీ ఎక్స్‌పీరియన్స్ మీద చాలా గౌరవమూ... నమ్మకమూ ఉన్నాయి.'' అన్నాడు.

కాఫీ తాగి, అంతదాకా అదే విషయం మీద మాట్లాడి బయటపడ్డాడు సత్తిరాజు.

ఇంటికి వచ్చేసరికి మౌల్డింగ్ షాప్‌లో ఉండే ఒక ఛార్జిమెన్ వచ్చాడు. అతను అప్పుకోసం

సత్తిరాజు చుట్టూ తిరుగుతున్నాడు.

''ఎక్కడ నుంచి గురువుగారూ- గంట సేపటి నుంచి చూస్తున్నాను-'' అన్నాడు.

చెప్పాడు సత్తిరాజు. ఎందుకు వెళ్ళావని అడిగితే అదీ చెప్పాడు.

''మీకు మతి బోయిందేంటండి గురూగారూ-''

''ఏం?''

''అంబళగన్ దొరకే షూటింగ్ యేసారు వాళ్ళు. ఆళ్ళ గురించి తెలిసుండీ మీరు... ఏటి గురూగారూ!''

''ఆ గొడవ యేరు- ఇది యేరు. అప్పుడు అందరూ ఓ మాట మీదున్నారు. యిప్పుడు కనీసం రామ్మూర్తి గూడా లేడు. పది మంది కన్నా ఉండరు'' అన్నాడు సత్తిరాజు.

''మీ యిష్టం- పిల్లలు గలవాళ్ళు మీరు- మీరు బెదిరించిన వాడిని బయటపడకుండా చూసుకోండి-''

''ఆడు యిాళ్ళకి చెప్పడు- ఇదంతా ఆ కిష్టిగాడి పని. నేనంటే ఏడుపు. వీళ్ళని ఉసిగొల్పాడు-'' అన్నాడు సత్తిరాజు.

సత్తిరాజు మళ్లీ వణకడం మొదలుపెట్టాడు.

బెదిరించినవాడిని మానేజ్ చేసుకున్నాడు సత్తిరాజు. మోహన్రావూ తతిమ్మా వాళ్ళూ ఇదంతా రూమరే అనుకున్నారు.

అయితే కొందరికి ఓటీ దొరుకుతోంది. కొందరికి దొరకటం లేదు. ఎందువల్ల?

ఫోర్‌మేన్‌ని అడిగితే చార్జిమెన్‌లని అడగమంటాడు. వాళ్ళు ఫోర్‌మాన్‌ని అడగమంటారు.

''ఈ దొంగనాయాళ్ళు మనతో ఆడుకుంటున్నారు-'' అనుకున్నారు పనివాళ్లు.

★★★

''దసరా దగ్గరపడుతోందిరా'' అన్నాడు లక్ష్మణరావు.

రాజులు కిళ్ళీ బడ్డీ అది. పల్లెటూళ్ళో పదవ క్లాసు గట్టెక్కకుండా జులాయిగా తిరుగుతున్న మేనల్లుడిని పిలకపట్టుకొచ్చి ఆ కొట్టుకి కట్టేసాడు. నువ్వు సరిగ్గా ఉంటే నా కూతుర్ని కూడా కట్టేస్తానన్నాడు.

లక్ష్మణరావు కారాకిళ్ళీ కట్టించుకుంటున్నాడు. రాజులు బడ్డీ మీదకి ఎక్కి మేనల్లుడు కిళ్ళీ ఎలా కడుతున్నదీ చూస్తున్నాడు.

దసరా విషయం లక్ష్మణరావు ఎత్తగానే అక్కడ ఉన్న ఆరుగురు పనివాళ్ళకీ గతం గుర్తు వచ్చింది.

వాళ్ళ కంపెనీలో దసరా బాగా చేసుకునేవారు. షాపుల మధ్య పోటీ ఉండేది. దుర్గ

బొమ్మ చేసి షాపుమధ్యలో పెట్టేవారు. స్టేజి కట్టేవారు. రంగు కాగితాల తోరణాలు కట్టేవారు. మైకు పాటలు, డాన్సులు, ఈలలు చప్పట్లు అన్నిషాపుల వాళ్ళూ అక్కడే ఉండేవారు. ఎప్పుడూ వాళ్ళకే ప్రైజ్ వచ్చేది.

ఏమయిందా ఉత్సాహం? ఏమైందా ఐక్యత? ఏమయింది - ఏమయింది?

రాజులు కొట్టు మీదనుంచే అన్నాడు-

''యెయ్యంగ్రా తలో అయిదూనూ- యేటుంది పెద్ద!'' అన్నాడు. అంతటితో ఆగలేదు. తన సహజ ధోరణిలో- 'ఇప్పుడు వోటీలు గూడా తింటన్నార్రా-' అన్నాడు నవ్వుతూ.

వెంటనే రామ్మూర్తి అన్నాడు-

''నీకులా మేం తెగబలిసిలేం-''

ఆ మాటలో వెటకారం లేదు. అది రాజులకి గుచ్చుకుంది. కొట్లోంచి కిందకి ఉరికాడు.

''ఏట్రా- ఏట్రా నేం తెగబలిసున్నదీ-'' అన్నాడు రాజులు.

ఎవరూ మాట్లాడలేదు. కొంతసేపు.

''పోన్లే మావా! ఆడేదో బాధలో ఉన్నాడు-'' అన్నాడు లక్ష్మణరావు.

''అవున్రా- నువ్వు ఓటీ సెయ్యమన్నా సెయ్యవు- అందుకని అన్నాను-'' అన్నాడు రామ్మూర్తి తగ్గు గొంతుతో.

అతని మొహంలోకి చూసి, భుజం మీద చరిచి అన్నాడు రాజులు.

''నేనక్కడ ఒళ్ళిరిసుకునే దానికన్న- యీ కొట్టు మీన కూకుంటే ఎక్కువ మిగుల్తుంది-''

రామ్మూర్తి అదోలా నవ్వాడు- ''అందరికీ కొట్టెట్టుకొనే ఓపిక ఉండొద్దా మావా! ఏదో తంటాలుపడి ఎట్టినా- అందరూ పెడితే కొనేవోడెవడూ?''

రాజులు ఒప్పుకోలేనట్టుగా తలూపాడు. ''నేదురా- యీ మద్దిన మనకేదో శనిపట్టిందిరా'' అన్నాడు.

పదండ్రా- అంటూ వాళ్ళని తీసుకొని సారా కొట్టులోకి నడిచాడు రాజులు. రామ్మూర్తి రానన్నాడు. తాగనన్నాడు.

''తెగబలిసున్నాను గదరా అల్లుడూ- ఇయ్యేల ఎవుడెంత దాగినా కరుసునాది-'' అన్నాడు రాజులు.

''ఆడు బాధపడ్డాడు- నువ్వు మాట్లాడక'' అన్నాడు లక్ష్మణరావు.

రాజులు ఒక గుక్క నోట్లో ఒంపేసుకున్నాడు.

''ఏరా అల్లుడూ- నీదీ నాదీ ఒకటే కులం. నీ యింట్లో ఆడాళ్ళు నా పెళ్ళాంలాగ గేదలు కొని, ఆటిని మేపి, పాలుదీసి యింటింటి కెల్లి పొయ్యగల్దురా?'' అన్నాడు.

రామ్మూర్తి మాట్లాడలేదు.

''గేదెల్దోలుకుని రోడ్డుమీద కెల్లగలరా? పేడతీసి పిడకలు సెయ్యగలరా? మా కుటుంబంలో ఆడా, మగా ఒళ్ళిరిసుకుంటారు- మెళ్ళో బంగారాలు యేసుకుంటారు- నోరు కట్టుకుంటారు- ఇళ్ళు కట్టుకుంటారు-''

అతను చెప్పినది సాధ్యమని వాళ్ళకి అనిపించలేదు. కాని, అతని గొంతులో బాధ అందరినీ కదుపుతోంది.

''ఏట్రా మావా- అంత సీరియస్సయిపోతన్నావు-'' అన్నాడు లక్ష్మణరావు.

''నేదురా- నన్నేదో- అన్నాడని గాదురా నా బాధ! ఆడేటి పయోడా? అందరం ఆ మెషిన్ల దగ్గర సవ్వాల్సినాళ్ళవే గదా! మనలో యింతకు మునుపు లేని ఏడుపులు యిప్పుడు ఎందుకొచ్చాయి? అదర్రా నా బాధ!'' అన్నాడు రాజులు.

''ఏటనుకోకు మావా-'' అన్నాడు రామ్మూర్తి.

అక్కడున్న అందరి మనసుల్లోనూ- తమ మధ్య ఏవో తేడాలు కొత్తగా వచ్చాయన్న రాజులు మాట మీద- ఒకటే అభిప్రాయం కలిగింది.

''ఏదో చెయ్యాల్రా మనం-'' అన్నాడు లక్ష్మణరావు.

అవునంటే అవునన్నారు వాళ్ళు.

★★★

దసరా అలంకరణ మొదలయింది.

పనివాళ్ళంతా నడుం కట్టేరు. ఉన్న వైమనస్యాలన్నీ పనిచేస్తున్న కొద్దీ తొలగిపోసాగాయి. అలంకరణ ఒకదశకు చేరుకుంది. ఎడమొగం పెడమొగాల్లో నవ్వులు పూసాయి. మూతపడిన పెదాలు విడి, కదిలి, పలకరించుకుని ఆప్యాయతలను అందించుకున్నాయి. బిగుసుకున్న హృదయాలు తేలికయ్యాయి. విడిన చేతులు కలిసి పువ్వులు చేసి తోరణాలు చేసాయి. నిచ్చెన్లు మోసాయి. తోరణాలు కట్టాయి. పువ్వులు విరజిమ్మే ఏర్పాట్లు చేసాయి. సింధూరం మనుషుల మొఖాల మీదా, యంత్రాల మీదా వెలిసింది.

ప్రతి మనిషీ, అందరితో కలిసి... ప్రతి ఒక మనిషి, కోసం అందరూ కలిసి... జీవించి, పోట్లాడి, సాధించుకునే మానవుని ప్రాథమిక సామూహిక సహజాతం వారిలో పొంగి పారలింది.

ఆయుధపూజ జోరుగా సాగింది.

ఆ ఫ్యాక్టరీ ఎవరిది... ఆ యంత్రాలు ఎవరివి... ఆ పనిముట్లు ఎవరివి... అనే ప్రశ్నలు లేవు. అవి తమవి కావన్న భావాలు లేవు. మనిషి అసలు ఆనందమంతా గుంపు బ్రతుకులో... గుంపు ఆట పాటల్లో గుంపు అయిపోటంలోనే ఉందని స్ఫురింపజేస్తోంది వాతావరణం.

ఫోర్‌మేన్ కృష్ణమూర్తి... అన్‌స్కిల్డ్ లేబరర్ శాస్త్రీ... పద్యాలు పాడారు- మంత్రాలు

చదివారు. పప్పు బెల్లాలు పంచారు. హారతి చూపించారు.

ఆ సమయంలో కృష్ణమూర్తి చుట్టూ అందరూ చేరారు.

''గురూ గురూ-'' అంటూమోహన్రావు మొదలెట్టేడు. విషయం ఓవర్టైం. అందులో హెచ్చుతగ్గులు. పదిమందీ మాట్లాడుతున్నారు. అందరికీ సమానంగా ఓటీ దొరకాలిట. దాదాపు చాలామంది మనస్ఫూర్తిగానే ఆ మాట అన్నారు.

అదెలా కుదురుతుందన్నాడు కృష్ణమూర్తి.

అన్నాడే గాని- అతనిమీద ఆ క్షణంలో రెండు భావోద్వేగాలున్నాయి. ఒకటి అందరూ అతని ఔద్యోగిక ఆధిక్యతను అంగీకరించిన తృప్తి. రెండవది ఆ పర్వదినమూ, భగవత్సన్నిధానమూ, మనుషుల్లో కలవటం వల్ల కలిగిన మంచితనము.

''గురూ గురూ మన మెషిన్ షాప్లో అందరం ఓ మాట మీద ఉండాలి. యీ యిషయం మన మధ్యనే ఉంటుంది. మనకు వచ్చే ఓటీ అందరికీ సమానంగా పంచే పనిమీది. మేం ఎప్పుడూ గొడవ చెయ్యం- ఏరా?'' అన్నాడు పక్కవాళ్ళని. అందరూ అవునంటే అవునన్నారు.

చివరికి సమానంగా కాకపోయినా... యించు మించు సమానంగా ఉండేటట్టు చూస్తానన్నాడు ఫోర్మేన్.

అందరూ దుర్గకు నమస్కరించారు.

***

''వెంటనే బయల్దేరిరా- జోగినాధం''

వణుకుతున్న చేతుల్తో ఆ టెలిగ్రాం అందుకుంది సీత.

అప్పటికి సాయంకాలం నాలుగు అయింది.

ఆమెకు ఏం జరిగిందో ఏంటో అర్ధంగాక మతిపోయినట్లయితంది. చిన్నమ్మను పిలిచి చెప్పుకుంది. మీ మామగారికి వంట్లో బాగోలేదేమో- అంది చిన్నమ్మ. టెలిగ్రాం అంటే అంతేనన్నారు యిరుగమ్మలూ, పొరుగమ్మలూ! వెంటనే బయలుదేరాలన్నారు.

భర్తకి తండ్రంటే పంచప్రాణాలు. ఆ టెలిగ్రాం చూస్తే రాత్రికి రాత్రే బయలుదేరతాడు. అప్పటికప్పుడు డబ్బులు ఎక్కడ నుంచి పుట్టించగలడు?

సీత ఆరు గంటల దాకా రామ్మూర్తి కోసం చూసింది. ఓటీ ఉంది కాబోలు- అనుకుంది. చివరికి ఆలోచన తెమల్చుకుని యింటి యజమానురాలి దగ్గరకు వెళ్ళింది. చేతి గాజులు తీసి ఎదురుగా పెట్టింది.

''యియ్యాల శుక్కరోరం- అవదు రేపిత్తా-'' అంది.

తల్లోల్లీ అంటూ బ్రతిమాలింది సీత.

ఆవిడ వినకపోయేసరికి-

''ఆడదాన్ని- వంటిమీద బంగారం దీసి నీకిస్తన్నాను- నాకు మాత్రం శుక్కరోరం కాదా?'' అంది సీత. ''నువ్వు గాకపోతే మరొకరవుతారు-'' అంటూ బయల్దేరింది.

సీతని ఆపి గాజులు తీసుకొని డబ్బులు చేతిలో పెట్టింది.

పది గంటల రాత్రివేళ యింటికి చేరాడు రామ్మూర్తి. అప్పటికి బట్టలు కూడా సర్దేసింది సీత. భర్త అలికిడవగానే తలుపు తీసింది. సైకిలు లోపల పెట్టి వచ్చాడు.

ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి. గబగబా బట్టలు విడిచి, మొహం మీద నీళ్ళు పోసుకుని కడుక్కున్నాడు. అన్నం పెట్టింది. గబగబా తింటున్నాడు రామ్మూర్తి. కడుపులో అన్నం పడుతుంటే చలి తెలుస్తోంది.

చేతులు కడుక్కుని చొక్కా తగిలించుకున్నాడు. అప్పుడు చెప్పింది సీత.

''మామయ్యకి బావుండలేదంట-''

''ఎవరు చెప్పారు-'' ఆశ్చర్యంగా అడిగాడు.

''టెలిగ్రాం వచ్చింది-'' చేతికి అందించింది.

చదువుకుని మంచం మీద కూలబడ్డాడు. సీత అతని పక్కనే కూర్చోని-'కంగారు పడకండి-' అంది.

''ఛా- నాన్నకి బాగోకపోడమేటి?'' అన్నాడు.

''అందరూ ఆమాటే అంటన్నారు-''

''కమల పురిటికొచ్చింది గదా- దానికి ఏమన్నా అయిందా?''

''యింకా- ఏడో నెలే గదా-'' అంది సీత. ఆమె లేచి కంచం తీసి కడిగి బోర్లించింది. అంతవరకూ రామ్మూర్తి మంచం మీద పడుకున్న పిల్లల తలమీద రాస్తూ ఆలోచనలో ఉన్నాడు.

''బయల్దేరదామా-'' అంది.

''ఎక్కడికి?''

సీత కాస్త ఆశ్చర్యపోయింది. మాట్లాడేలోగా రామ్మూర్తే అన్నాడు.

''ఓటీ ఉంది సీతా- రేపు సెలవు పెడితే మా వాళ్ళు యీ వారంలో చేసిన ఓటీలో ఎనిమిది గంటలు విరగగొస్తారు- రేపు కూడా ఓటీ ఉంది- అది పోతుంది.''

సీతకి ఏమనాలో తోచలేదు. మెల్లగా భయపడుతూ భయపడుతూ తను చేసిన పని చెప్పింది.

''ఎంత మంచిదానివి- సీతా'' అన్నాడు.

ఆరాత్రి అంతా రామ్మూర్తి దాదాపు నిద్రపోలేదు. అమ్మకి ఎలా ఉందో- అని ఒకమారూ, ఏమైనా అయితే రాసేవారు గదా- అని మరోమారూ తనే అడగటం, తనే జవాబు ఇవ్వటం. ఊళ్లో ఉన్న ప్రతివాళ్ళ గురించీ ఆలోచనే- భయమే-

చివరకి ఓ రాత్రి వేళ పడుకున్నాడు.

భర్త పడుకునే వరకూ నిద్రపోతూ, లేస్తూ ఏదేదో మాట్లాడిన సీతకు ఆ తర్వాత నిద్రపట్టలేదు. నిద్రపోతున్న భర్త మీద ఆమెకు ఒక విధమైన మాతృవాత్సల్యంతో ఆదుర్దా కలిగింది.

★★★

ఆదివారం సెలవు. ఆరోజు కూడా రామ్మూర్తి మిగిలిన పని పూర్తిచేసి బయటపడేసరికి నాలుగయింది. బస్సు పట్టుకుని, రిక్షా కట్టించుకుని యింటికి చేరేసరికి రాత్రి పన్నెండవుతోంది. సాధారణంగా ఏడూ, ఏనిమిది గంటలకు నిద్రపోయే ఆ ఊరు ఆ సమయానికి చాలా హడావుడిగా ఉంది. రామ్మూర్తి యింటి ముందు జనం ఉన్నారు. లోపల నుంచి ఏడుపులు వినిపిస్తున్నాయి.

వాకిట్లో తండ్రి శవం చూడగానే రామ్మూర్తి చేతిలో పెట్టెని జారవిడిచి అలా నిలబడిపోయాడు. తమ్ముళ్ళిద్దరూ అతనిని చుట్టుముట్టారు. దిగ్గుమంటున్న గుండెలతో లోపలికి పరుగెత్తింది సీత.

అక్కమ్మ, కమల ఎవరు ఎవరిని ఓదార్చుతున్నారో- ఎవరు ఎవరిని పట్టుకున్నారో- సీతని చూడగానే యిద్దరూ ఒక్కసారే గొల్లుమన్నారు.

ఇరుగు పొరుగులు రామ్మూర్తికి ఏవో వేదాంతాలు చెపుతున్నారు. 'పుట్టిన ప్రాణికి మరణం తప్పదు తల్లి ఉంది. తమ్ముళ్ళున్నారు. వాళ్ళకి నువ్వు ధైర్యం చెప్పాలి-' అంటున్నారు.

రామ్మూర్తి లోపలకు వెళ్ళబోతుంటే ఆ వూరి పెద్దకాపు రాధాకృష్ణరావు ఆపాడు. అతన్ని తిన్నగా చెరువుగట్టు అవతల ఉన్న తమ పొలంలోని పంపు షెడ్ దగ్గరకి తీసుకువెళ్ళాడు.

'అబ్బాయ్- యీ సమయంలోనే మనిషి గట్టితనం తెలుస్తుంది- మీ నాన్నది మామూలు చావు కాదు. ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు-' అంటూ మొదలుపెట్టాడు.

రామ్మూర్తికి తలంతా దిమ్మెరపోయినట్లయింది.

''-కారణం ఏమిటో ఖచ్చితంగా తెలియదు.

అందరూ తలోరకంగా అనుకుంటున్నారు. శిస్తు వసూళ్ల నుంచి ఆయన కొంత డబ్బు వాడినట్లు తెలుస్తోంది. ఆ విషయం ముందుగా మా చెవిన వేస్తే మా రైతులందరం మీ నాన్న పక్క నిలబడే వాళ్ళం. మన కరణం సంగతి నీకు తెలుసు. మీ నాన్న రైతుల వేపు నిలబడతాడని ఆయనకి మంట. మీ నాన్నే భయపడిపోయాడో, పరువు పోతుందని బెంగపడ్డాడో కరణమే ఏమన్నా అన్నాడో తెలవదు. వారం రోజుల నుంచి ఆయన డబ్బు కోసం చాలామంది చుట్టూ తిరగాడుట. ఇల్లు సెటిల్ చేసేద్దామని కూడా ప్రయత్నించాడు. ఏమీ కుదరలేదుట. డబ్బు కట్టకపోతే ఏమవుతుందోనని- యిలాంటి పని చేసుకున్నాడు-''

రాధాకృష్ణారావు చుట్ట వెలిగించుకుని రెండు పీల్పులు పీల్చాడు. రామ్మూర్తి

తలవంచుకుని వింటున్నాడు.

''ఏం జరిగిందో ఏమిటో తరువాత సంగతి. ముందుగా జరగాల్సినదేమిటో చూడాలి. శవాన్ని తెల్లారీ వరకూ వుంచితే కరణం తిన్నగా ఉండడు. కేసు, పోస్టుమార్టం... నానా రభసా తప్పదు. పోయిన మనిషి ఎలాగూ రాడు. బ్రతికున్న వాళ్ళం బాధలు పడాలి. కనక- కరణం సంగతి నేను చూసుకుంటాను. రాత్రికి రాత్రే మనం శవదహనం చేయించేద్దాం. గట్టిగా ఏడవటానికి కూడా భగవంతుడు మనకు సమయం యివ్వలేదు. ఆలోచించుకో-''

రాధాకృష్ణారావు చెప్పిన మాటలు రామ్మూర్తి విన్నాడు. ఇద్దరూ తిరిగి యింటికి వెళ్ళారు. కరణం అక్కడే ఉన్నాడు.

''ఏం చేద్దామండి కరణం గారూ'' అంటూ సలహా అడిగినట్లు అడిగి రాధాకృష్ణారావు అతని కాళ్ళకు బంధం వేసాడు.

రాత్రికి రాత్రి కరణాన్ని ఎదురుగా పెట్టి దహన కార్యక్రమం జరిపించేసారు. కరణం అటూ యిటూ జరగకుండా తతిమ్మా రైతులు మాటల్లో పెట్టేసారు. వాళ్ళ చేతుల్లో బడితలకు లొంగాడో - ఇన్నేళ్ళూ కలిసి పనిచేసిన మునసబు అని జాలిపడ్డాడో- రైతుల మాటలలో పడ్డాడో- కరణం కదలలేదు.

నావల్లే పోయాడు నాన్న - అనుకున్నాడు రామ్మూర్తి.

పదకొండవ రోజున జంగపాయన వచ్చాడు. మంత్రించిన ఏటినీళ్ళు యిచ్చాడు. ఇల్లంతా జల్లింపించాడు. కోడిని కోయించాడు.

బంధువులందరూ వచ్చారు. పళ్ళూ పిండివంటలు తెచ్చారు. గొర్రెను కోయించాడు. ఇంటికి ఒకరు చొప్పున భోజనాలకు పిలిచాడు.

ఎక్కడ వాళ్ళు అక్కడకు వెళ్ళిపోయారు.

కరణం ఒకపక్క, రైతులు మరోపక్కా చేరి ఇంటిని తాకట్టుపెట్టిన లింగరాజుకే సెటిల్ చేసారు. తండ్రిపోయిన కష్టాల్లో ఉన్నాడని సానుభూతి చూపిస్తారనుకున్నాడు.

తమ్ముళ్ళు చదువు మధ్యలో ఆపినందుకని బాధపడ్డాడు రామ్మూర్తి.

అందరినీ వెంటబెట్టుకుని విశాఖపట్నం చేరాడు. కమలను కొన్నాళ్ళు ఉంచుకుని అత్తారి యింటిలో దించివచ్చాడు.

***

సత్తిరాజు వినయంగా నిలబడ్డాడు.

ఎప్పుడూ కూర్చోమనే ఆనంద్‌కుమార్ అతన్ని కూర్చోమనలేదు. తీక్షణంగా అతనివయిపు చూసాడు.

''నిన్ను ఎందుకు మెషిన్ షాప్‌కి ట్రాన్స్‌ఫర్ చేసాను గౌరవనీయుమయిన

సత్తిరాజూ-??''

ఆ యింగ్లీషు మాటల్లో వ్యంగ్యం అతనికి అందకపోయినప్పటికీ- ఆ కంఠంలో అది బాగానే సత్తిరాజుకి అందింది.

అయోమయంగా చూసాడు.

''చూడి- ఇది చూడి'' కొత్తగా నేర్చిన తెలుగులో అంటూ ఒక కాగితాన్ని అతని ముందుకి తోసాడు.

నాలుగు నెలల్నుగా జరుగుతున్న ఓటీ వివరాలవి. ఆ వివరాలు గంగూలీ వారం రోజుల క్రితమే తయారు చేయించాడు. ఆ ఫ్యాక్టరీలో ఓటీ ఎక్కువ అయిపోయిందని ఆనంద్‌కుమార్‌ని మందలించడానికి పిలిచారు బొంబేలోని యాజమాన్యం. ముందుగానే తయారయి వెళ్ళాడు గంగూలీ.

''కార్మికులు ఎక్కువ పని చేయటానికి ప్రోత్సాహకంగా బోనస్‌ను సృష్టించింది నీలాంటి వాడే-''

''సర్-'' గంగూలీ మాట్లాడబోయాడు.

''యిపుడు ఆ బోనస్ ఎంత యివ్వాలో చట్టం అయ్యింది. దాన్ని కార్మికులు సంఘటితమై హక్కుగా మార్చుకున్నారు-''

''....''

''మందు వెయ్యకపోతే - పశువు రోగంతో చస్తుంది కనుక వేస్తారు. మన దగ్గర పనిచేసే కార్మికుడికి కూడా రోగం వస్తే మందు యిప్పించాలి- అన్నాడొకడు. ఏమయింది? పశువులకు సంసారాలుండవు. మనుషులకు ఉంటాయి. కనక కార్మికుడికే గాదు- వాడి సంసారాన్ని కూడా ఆరోగ్యం ఉంచవలసిన బాధ్యత మన నెత్తిమీద పడింది. అది వాళ్ళకి హక్కు అయిపోయింది-''

''...''

''ఈ దిక్కుమాలిన దేశంలో సోషలిజం ఒక ఫ్యాషన్. అందుకని ప్రభుత్వమే పెట్టుబడిదారుడై కొన్ని పరిశ్రమలు నడుపుతోంది. స్వంతంగా కొందరు ఉద్యోగులను పెట్టుకుంది. వాళ్ళకిచ్చే సౌకర్యాలు అన్నీ మన పనివాళ్ళకి కావాలిట, వాళ్ళకి ప్రభుత్వం వత్తాసు. వాళ్ళ సంఘాలు ఎన్నిరకాల సౌకర్యాలు సంపాదించుతున్నాయి!-''

ఇలా మాట్లాడుతున్న వాళ్ళను గంగూలీ శ్రద్ధగా విన్నాడు.

''నువ్విప్పుడు యింక నీ ఓటీని కట్టిపెట్టకపోతే- మనం కంపెనీని మూసేసుకోవాలి-'' అన్నాడు.

ముందుగా తను యిచ్చిన ఓటీ డబ్బు, పెరిగిన ఉత్పత్తికీ సంబంధించిన లెక్కలు

అన్నీ చూపించాడు. షిఫ్ట్ పద్ధతి పెట్టి, ఉత్పత్తి పెంచినపుడు అయే ఖర్చు పెంచిన కార్మికుల జీతభత్యాలు, మందుమాకులు, బోనస్‌లు... అన్నీ లెక్కలు వేసి చూపించాడు. అందులో యంత్రాల అరుగుదల శాతాన్ని కూడా చేర్చాడు.

వాళ్ళు కొంత కన్విన్స్ అయినట్లనిపించాక అన్నాడు గంగూలి.

''ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికులు పోరాడిన రోజులు వేరు. యీ రోజులు వేరు. ఇంకపై రోజులు వేరు. మార్క్సు లాంటాయనవచ్చి కలిసి నిలబడితే కార్మికులు దేన్నయినా సాధించుకోవచ్చన్నాక యింక వాళ్ళు కలవకపోరు. సాధించుకోకపోరు. ఈ విషయం ఈరోజు అభివృద్ధి చెందిన దేశాలలో పెట్టుబడిదారులందరికీ తెలుసు. కార్మికుడి కివ్వాల్సిన జీతభత్యాలలో మిగుల్చుకున్నదే తమ లాభం అని వందేళ్ళ క్రితం పెట్టుబడిదారుడు అనుకునేవాడు. ఉత్పత్తి అయిన వస్తువుకి మార్కెట్ సృష్టించటంతో సహా అనేక ట్రిక్కులు అభివృద్ధి చెందిన దేశాల పెట్టుబడిదారుడికి యీనాడు తెలుసు.

ఈనాటి కార్మికులకున్న సౌకర్యాలకు కారణం వాళ్ల పోరాటంవల్లా – పెట్టుబడిదారుల ఉదార హృదయమా నా లాంటి వాళ్ళ దూరదృష్టీ, శాస్త్రీయ అవగాహనా అన్నది చిక్కు ప్రశ్న.'

గంగూలీ ఏం చెప్పదలుచుకున్నాడో అర్థంకాక అయోమయంగా చూసారు. అలా తన తెలివితో వాళ్ళను గాభరాపరచినందుకు గంగూలి కాస్త పొంగాడు.

''– ఒక్క నెల బోనస్ ఎక్కువ యిచ్చామంటే ఏమిటి నష్టం? నెలకి యివ్వాల్సిన దానిలో మనం సగమే యిస్తున్నాం అనుకోండి– మనం యిస్తున్నది ఏడాదికి ఎంత? ఆరు నెలల జీతం ఆరు నెలల బోనస్–''

వాళ్ళకి జవాబిచ్చే అవకాశం యివ్వకుండా గంగూలీయే అన్నాడు– ''సంసారాలు ఉంటాయి ఏం చేస్తాయవి? పొద్దుటే నిద్దర్లేపి, స్నానం చేయించి, అన్నం కారేజి కట్టించి, మన ఫ్యాక్టరీలకు పెళ్ళాలు తరుముతారు. పిల్లల పెంపకం కోసం వాళ్ళు మన ముందు వంగుతారు. ఆ పెళ్ళాలకి, పిల్లలకి రోగాలు వస్తే, మనం మందూ మాకూ చూడకపోతేబెంగ పెట్టుకున్న కార్మికులు సరిగా పనిచేస్తారా? అయినా మనం యిచ్చేదెంత, ప్రభుత్వం యిచ్చేదెంత, వాళ్ళ రోగాలకి?

ఇంక మన రాజకీయ నాయకులు ప్రభుత్వం– వాళ్ళ మిక్సెడెకానమీ– సోషలిజం స్లోగన్– పరిశ్రమల మీద ప్రభుత్వం కంట్రోళ్ళు ఇవ్వన్నీ మనం ఎదిగేటందుకు పనికొచ్చినన్నాళ్ళు ఉంటాయి. మనం ఎదగటానికి అడ్డం వచ్చిన రోజున గాలికీ ధూళికీ పోతాయి–''

అలా గంగూలీ చెపుతూంటే అందులో అతనికి గతం మీద ఎంత అవగాహన ఉన్నదో భవిష్యత్తుని అంచనా వెయ్యటంలో ఎంత ప్రతిభ ఉన్నదో వాళ్ళకి అర్థం కాలేదు. అయినా గంగూలీ ఆలోచనలు ప్రస్తుతానికి నష్టం కలిగించవని వాళ్ళకి అనిపించింది.

''ఓటీ పద్ధతి మనకి నష్టం తెస్తే నేను కూడా దాన్ని పట్టుకు వేలాడను. కొన్ని లాభాలు

కంటికి కనపడవు. వాటి ఆర్థిక విలువ అంత సులువుగా అందదు. ఓటీ ఆశతో మామూలు సమయంలో రికార్డ్ పని చేయంచగలిగితే మనకి లాభం కాదా? ప్రపంచంలో ఏం జరుగుతున్నదీ తెలుసుకునే సమయంలో కూడా రోజుకి 12 గంటలకు పైగా ఫ్యాక్టరీల్లో ఉంచితే మనకి లాభం కాదా? వాళ్ళని జీతభత్యాల కోసం మాత్రం పోరాడే వాళ్ళుగా మార్చటంలో ఆధునిక పెట్టుబడిదారుడు ఎంత విజయం సాధించాడో-- వాళ్ళని యిన్ని గంటలు కష్టపడేసి మరమనుషులుగా మార్చటంలోనూ అంత విజయం ఉండదా? మీరు నాకు కొన్నాళ్ళు అవకాశం యివ్వండి-''

గంగూలీకి ఆ అవకాశం యిచ్చారు వాళ్ళు. ఆ విజయం కోసం అతను తయారు చేయించిన లెక్కలు పరిశీలిస్తుంటే ఒక విషయం బయటపడింది.

అందుకోసమే సత్తిరాజుని పిలిపించాడు.

ఆ ఓటీ వివరాలను అతని ముందుకు తోసాడు. సత్తిరాజు వాటిని చూస్తున్నాడు.

''ఈ విషయం నాకెందుకు రిపోర్ట్ చెయ్యలేదు?''

ఏ విషయం అని అడగటానికి బదులుగా సత్తిరాజు అన్నాడు- ''చెయ్యాలనే అనుకుంటున్నాను సార్-''

తన మనసులో విషయం అతనికి అర్థం అయిందన్న యింప్రెషన్‌లో ఆనందకుమార్ అన్నాడు-

''...మీ సూపర్వైజర్లు పనివాళ్ళతో కలిసి పోతారన్న మాట.''

''లేదు సార్'' సత్తిరాజు ఏదో అనబోయాడు.

గంగూలీ ఆ అవకాశం యివ్వలేదు-

''మీ వర్క్‌షాప్‌లో జరుగుతున్న ప్రతి విషయం నాకు తెలియాలి సత్తిరాజూ-''

ఎందుకు తెలియాలి? దానివల్ల మీ లాభాలు పెరుగుతాయా? మీ వ్యక్తిగతమైన యిగో తృప్తిపడుతుందా?- అని సత్తిరాజు అడగాలి-

అతనికి ఆ తెలివీ లేదు. ధైర్యమూ లేదు. అవసరమూ లేదు.

అందుకని యస్సార్ అనేసి బయటపడ్డాడు.

గంగూలీకి సత్తిరాజుని అనటంతో మనసు కుదుటపడలేదు. అంబళగన్ విసిరిన సవాలు... వర్క్ షాప్‌లో తొలిరోజున జరిగిన అవమానం... అతని నరాల్ని భగ్గుమనిపిస్తున్నాయి. చల్లని ఆ గది వెచ్చగా అనిపిస్తోంది.

అతను విసిరిన మాంసపు తుంపులు నొల్లుకోవటం కోసం- కాట్లాడుకునే కుక్కల దృశ్యం అతని కళ్ళ ముందు లేదు. దానికి బదులుగా అతిజాగ్రత్తగా ఆ మాంసం ముక్కలని అవి పంచుకుంటున్నాయి. ఆ ముక్కల పరిమాణం, సంఖ్యా తగ్గించినా అవి అలాగే

పంచుకుంటున్నాయి. ఆ కుక్కల జబ్బు- పంచుకొని అనుభవించే రోగం- ప్రపంచమంతా వ్యాపిస్తోంది. ఆ కుక్కల సంతోషపు అరుపులు దూరంలో మొదలై చెవులు బద్దలు గొడుతున్నట్టు గంగూలీకి అనిపిస్తోంది.

మరో గంట తర్వాత కృష్ణమూర్తికి కబురువెళ్ళింది.

''ఇది మీకు తెలియకుండా జరుగుతోందా?''

కృష్ణమూర్తి వెంటనే జవాబివ్వలేదు. సాలోచనగా గంగూలీ యిచ్చిన పేపరుని చూస్తున్నాడు. ఇంత చిన్న విషయానికి అతను ఎందుకు ప్రాధాన్యత యిస్తున్నాడో కృష్ణమూర్తికి అర్థం కాలేదు.

''మీకిచ్చిన పని చేయిస్తున్నారు. దానితో మీ బాధ్యత అయిపోయిందనుకుంటున్నారు-''

''సర్...''

''యస్-! చెప్పండి''

''మీరు అనుమతించిన దానికన్న తక్కువ మందినే ఓటీలో ఉంచుతున్నాను-''

''అఫ్‌కోర్స్-''

''అంచనాకన్న ఎక్కువ పనే అవుతున్నదనుకుంటున్నాను-''

తన కుర్చీలో అసహనంగా కదిలాడు గంగూలీ.

''మీ ఎఫిషియన్సీకి అది మీ కొలబద్ద-'' అన్నాడు.

కృష్ణమూర్తి మాట్లాడేలోగానే అన్నాడు గంగూలీ.

-''మీ కొలబద్ధను నేను ఎందుకు అంగీకరించాలి? నాకు నా స్వంత కొలబద్దలు ఉన్నాయి-''

''చెప్పండి-''

''మీ మెషిన్‌షాప్‌లో వర్కర్స్ అందరికీ సమానంగా ఓటీ దొరుకుతోంది. అంటే పనిచేసేవాడికీ, చెయ్యని వాడికీ ఒకటే ప్రతిఫలం దొరుకుతోంది. అంటే- చేసేవాడితో చేయిస్తున్నారు. చెయ్యని వాడిని కూర్చోబెడుతున్నారు. అంటే- మీరు ఎక్కువ మందిని ఓటీలో ఉంచుతున్నారు. తక్కువ పని జరిపిస్తున్నారు. ఇది మీ... ఎఫిషియన్సీ.''

కృష్ణమూర్తి మాటకోసం తడుముకుంటుండగా గంగూలీ కొనసాగించాడు.

''నేను అర్థం చేసుకోగలను. మీ మెషిన్‌షాప్‌లో ప్రమాదకరమైన మనుషులున్నారు. వాళ్ళు మిమ్మల్ని భయపెట్టారు. మీరు భయపడ్డారు-''

''నో సార్... నో...'' అన్నాడు కృష్ణమూర్తి.

''అయితే పని చేసే వాడినీ... చెయ్యని వాడినీ ఒకేలా ఎందుకు చూస్తున్నారు?''

''అందరిదీ ఒకటే కట్టు. అంతా ఒకేలా చేస్తారు-''

''ఇంపాజిబుల్! ఇది సృష్టి సూత్రాలకే విరుద్ధం. ఏ ఒకటీ మరోలా ఉండదు. ఏ ఒక మనిషీ మరో మనిషిలా ఉండడు. పని చెయ్యడు. తేడా... మీరు పసిగట్టలేకపోతే... అది మీ అసమర్ధత. దాన్ని... మీరు పట్టించుకోకపోతే... దానికి బలమైన కారణం ఉండాలి. అది మీ భయం - లేదా - మీరు వర్కర్స్ సైడ్ తీసుకుంటున్నారు-''

వర్కర్స్ సైడ్ తీసుకోడమనేది ఆ ఫోర్‌మేన్‌కి చాలా పెద్ద తిట్టుగా అవమానంగా అనిపించింది. కృష్ణమూర్తిని ఎక్కడ కొట్టాలనుకున్నాడో అక్కడ తగిలినట్టు ఆనంద్‌కుమార్ గ్రహించాడు. ఆనంద్‌కుమార్ తన భుజాన్ని తనే చరుచుకున్నాడు.

''మీరు నాకు సంజాయిషీ యివ్వనవసరం లేదు. మీ పొరపాటు మీరు గ్రహించారు. అదే సంతోషం. ఒక వస్తువును తయారుచేసిన వాడికన్నా అమ్మేవాడికి ఎక్కువ ముడుతుంది. ఎందుకని? చేసే వాడికన్నా- చేయించే వాడికి ఎక్కువ గౌరవమూ, జీతమూ ఉంటాయి. ఎందుకని? నా స్నేహితుడా- నువ్వుల్లో నూనె పిండుతాం- నూనె ఇంకా మిగిలిందనీ, లేదనీ ఎలా చెప్పగలం? నువ్వు పిండిని చూసి. మీ వర్కర్‌ని మీరు ఎలా చూడాలి? పిండి- చూడాలి. వెళ్ళండి-'' అన్నాడు.

తనెంతో బాగా, అర్ధవంతంగా మాట్లాడి, ఎదుటివాడిని కన్‌ఫ్యూజ్ చేసి భయపెట్టి అవమానించి నచ్చజెప్పి పంపాననుకుని సంతోషించాడు గంగూలీ.

''గాడిదగుడ్డు-'' అనుకున్నాడు కృష్ణమూర్తి.

ఇదంతా ఆ సత్తిరాజు గాడు ఎక్కించిందే- అని నిర్ణయానికి వచ్చాడు.

***

''సత్తిరాజు గాడికి ఫోజు ఎక్కువవుతోంది గురూ-'' అన్నాడు మోహన్రావు పాకలో బల్లమీద కూర్చుంటూ.

అది ఓటీ సమయంలో టీ కోసం ఏర్పర్చిన విరామ సమయం. రాజులు, రామ్మూర్తి, లక్ష్మణరావు సుదర్శనంతో సహా మెషిన్ షాప్ వాళ్ళలో కొందరు అక్కడ ఉన్నారు.

రాజులు దృష్టంతా పాకలో ఆ సమయంలో జరిగే బేరం మీదే ఉంది. మిగిలిన దుకాణాలు కాస్త దూరంగా రోడ్డుమీదకు ఉన్నాయి.

''ఏంటయిందిరా?'' అన్నాడు లక్ష్మణరావు.

''గురువులు గాడికి కిష్టిగాడు ఓటీ వేస్తే- యీడు కొట్టించేసాడు-'' అన్నాడు మోహన్రావు.

''ఏమో ఎందుకు యివ్వనేదో-'' అన్నాడు రామ్మూర్తి.

''గురువులు యీ ఒటేల్లో ఖాతా పెట్టాడు. అది చెల్లించనేదేమో-'' అన్నాడు రాజులు.

''అయితే-''?

''ఈళ్ళు ఆడిని తంతావన్నారు - గురువులు గాడు కొట్టే లేపించేత్తానన్నాడు-'' అన్నాడు రాజులు.

''నిజమే గురువులు గాడి గురించే మనం రోడ్డుమీద దుకాణం తీయించేసాం- ఆ మళయాళపోడు గోలగోల పెట్టేసాడు-'' అన్నాడు రామ్మూర్తి.

''ఆడికి దన్నులేదు- యీడికి ఉంది-'' అన్నాడు రాజులు.

''కొట్టెట్టుకుందుకు దన్నేందిరా మావా!'' అన్నాడు రామ్మూర్తి.

''ఓరి పిచ్చినాయాలా ఆ కొట్లన్నీ రోడ్డుమీన ఉన్నాయి ఇది ఫ్యాక్టరీ కాడుంది. అంటేటి? మన కంపెనీలో ఎపుడో యీడికి దన్నున్నాడు-'' అన్నాడు రాజులు.

''ఆ డొంక తిరుగుడెందుకురా మావా ఆడు సత్తిరాజు అంటావు-'' అన్నాడు లక్ష్మణరావు.

''కాఫీ ఊరికే తాపిస్తే ఆ సత్తిగాడు ఎవడికైనా దన్నే-'' అన్నాడొకడు.

ఒక్క సెకను ఎవరూ మాట్లాడలేదు.

''సత్తిరాజు గాడు ఫ్యాక్టరీ బయట గొడవ కోసం- గురువులు గాడికి ఓటీ లేకుండా చేస్తాడా?'' అన్నాడు మోహన్రావు. ఆ గొంతు అందరికీ పరిచయమే- అందులో తోటివాడికి అన్యాయం జరుగుతోందన్న బాధ ఉంది.

'ఆడి కతేంతో తేలుద్దాం-' అనేది వెంటనే ఏదో ఒక గొంతు. అంతే - అంతే - అనేవి మిగిలిన గొంతులు. ఆ సమయంలో ఏ గొంతూ ఆమాట అనలేదు.

''కుక్క తోక పట్టుకుని దిగితే మునుగుతాం-'' అన్నారొకరు.

''ఒకప్పుడీ కుక్క తోకే పట్టుకున్నాం-'' అన్నాడు మోహన్రావు.

''నిజవేననుకో- ఒక సుట్టంటే ఫర్నేదు- ఎల్లకాలవూ- ఎన్నిసుట్లు ఆడెనక నిలబడాల?'' ఒకరు నెమ్మదిగా అన్నారు.

నెమ్మదిగా ఒకరూ, ఒకరూ మాట్లాడసాగారు.

ఆ మాటల అర్థం యించుమించు ఒకటే- ఎవడి బాధ వాడిది- మనమేం చేస్తాం?

'ఆడు మనలో వోడురా-' ఒక గొంతు బలహీనంగా అంది.

'అవునవును- ఆ మాట మాకెవరికీ తెలీదు'- ఒకరు కోపంగా అన్నారు.

ఫ్యాక్టరీ వేపు నడుస్తున్నారు. మాటలు సాగుతున్నాయి. మోహన్రావు అందరికన్న ముందున్న వాడు వెనకబడిపోయాడు.

రామ్మూర్తి వెనక్కి వచ్చి అతని భుజం మీద చెయ్యేవేసి ''ఏంట్రా-'' అన్నాడు.

''ఏం నేదు-'' అన్నాడు మోహన్రావు.

★★★

అది ఆగస్టు పదిహేను. ఫ్యాక్టరీకి సెలవు. రాజులు పనిగట్టుకుని రామ్మూర్తి యింటికి వచ్చాడు. ఇద్దరూ ఒక సీసా తెచ్చుకుని ముందు గదిలో కూర్చున్నారు. వెనుక గదిలో అక్కమ్మ, సీత కూర్చుని ఏదో పని చేసుకుంటున్నారు.

''మీ వోడిసేత కిల్లీ బడ్డీ యెట్టిద్దాం-'' అన్నాడు రాజులు.

రామ్మూర్తి జవాబివ్వలేదు.

''మదుపు నాకొదిలేయ్- నువ్వూ, మీ తమ్ముడు ఒప్పుకుంతే సాలు-'' అన్నాడు.

రామ్మూర్తికి అభ్యంతరమేం లేదు. కాని రాజులు ఎందుకీ మాట అంటున్నాడు?

''ఏటిరా అల్లుడూ- బిగుసుకుపోతన్నావ్?''

తమ్ముళ్ళిద్దరిలో రెండవ వాడిని ఒక సైకిల్ షాపులో పెట్టాడు. పెద్దాడు రికామీగా తిరుగుతున్నాడు. కమలను పురిటికి తీసుకొచ్చి ఘోషా ఆసుపత్రిలో చేర్చి నానా యాతనా పడ్డపుడు వాడే తెగ తిరిగాడు. ఏదో క్లాసు మధ్యలో ఆగిపోయింది. చదువుకోరా- అని రామ్మూర్తి అన్నా, గట్టిగా అనలేదు. పెద్దాడు వీరభద్రంకి చదువుకోవాలని ఉంది. ఆ మాట ఎవరూ గట్టిగా అనటం లేదని అతను గ్రహించాడు.

అక్కమ్మకు వాడి గురించే బెంగ- దుడుకు మనిషి. ప్రతి గలాటాలోకీ దూరిపోతాడు. ఏదైనా పనిలో పెడితే సర్దుకుంటాడు- అనుకుంది. కొడుకు వెంటనే రాజులు అన్నదానికి ఒప్పుకోవాలని ఆమెకు ఉంది.

''సూద్దాం-''

''ఓరి - ఓరి - ఏట్రోయ్ అల్లుడా-''

''మరేటి లేదు గాని మావా నీకింత ఉపకార బుద్ధి పుట్టిందేట్రా?''

పడీపడీ నవ్వాడు రాజులు.

''పయిసా యెడితే పయిసా రావాలనీ మడిసిని నేను. నీ తమ్ముడేం నాకు సుట్టమా పక్కమా- ఏదో ఉన్నాది. యిప్పుడే సెప్పాలా?'' అన్నాడు.

రాజులు మాట్లాడుతుంటే నాలిక ఆ తొస్సిలోకి దూరుతోంది. దాన్నీ, నల్లటి ఆ మనిషిని చూస్తున్నాడు రామ్మూర్తి.

''మా సంటెమ్మని మీ వోడికి యిద్దామని ఉందిరా-''

''ఆడికాడేటుందిరా మావా?'' ఆశ్చర్యంగా అన్నాడు రామ్మూర్తి.

''అలా బుద్దుట్టిందంటే-'' అన్నాడు.

సంటెమ్మకి పదహారో యేడు. వాళ్ళ అక్క బూరెమ్మ నల్లటి నలుపు. సంటెమ్మ తెల్లగా

ఉంటుంది. బూరెమ్మకి ముద్దు అంతగా జరగలేదు. ఇంటిముద్దూ, వాడముద్దూ సంటెమ్మకి దక్కాయి. తల్లితో బాటే పాలు అమ్ముతూనో, పిడకలు చేస్తూనో బూరెమ్మ ఉండేది. తల్లికీ, తండ్రికీ లేని రంగు సంటెమ్మకు వచ్చింది. అది ఒక పెద్ద వరంగా భావించారు వాళ్ళు. స్కూల్లో చేర్చారు. డబ్బులు మాత్రం ఇచ్చేవారు కాదు. పొంగడాలూ, జంతికలూ కొనిపెట్టేవారు. రిబ్బన్లూ, పిన్నులూ, పూసల దండలూ, పవుడర్లూ- అన్నీ కొనేవారు. అక్కడి జనంలో పిల్లల్లో ఆమె గొప్పదనే భావం ఆ పిల్ల మనసు మీద గాఢంగా ఆవరించింది. గొప్పది గొప్పగా ఉండాలి- గొప్పవాళ్ళు తినేవి తినాలి- చేసేవి చెయ్యాలి- చూసేవి చూడాలి- ఎలా ఎలా ఎలా?

ఇంట్లో వాళ్ళిచ్చేవి చాలవు. చిల్లర దొంగతనాలు మొదలయ్యాయి. తిండి వయసు గడిచింది. ఇతర అవసరాలు మొదలయ్యాయి. సినిమాలు సినిమా బొమ్మలు మరిగింది. ఫోర్త్ ఫారం లోనే ఆ పిల్లగురించి స్కూల్లో కుర్రాళ్ళు రెండు ముఠాలుగా చేరి కొట్టుకున్నారు. ఒక్కసారిగా సంటెమ్మ చిన్నెలన్నీ బయటపడిపోయాయి.

స్కూలూ, చదువూ ఆపేసాడు రాజులు, పెళ్ళి చేసేద్దామనుకున్నాడు. అయితే పెద్దది బూరెమ్మ అడ్డమయిపోయింది. ఆ పిల్లకి గొడ్డులా పనిచెయ్యటం తప్ప ఒక సోకూ, పాడూ నేదు అనుకున్నాడు. వచ్చినోళ్ళంతా ఎంతిస్తావని అడుగుతున్నారు. 'ఏదో కాడికి సెటిల్ జేద్దామనుకుంటే- ఆ యెట్టింది కాస్తా మింగేసి దాన్ని తన్ని తవిరేస్తే?' అనుకున్నాడు. మళ్ళా మారుమనువు ఎక్కడ నుంచి తెస్తాడు? మదుపు ఎన్నిసార్లు పెడతాడు?

చివరికి మేనల్లుడిని చేరదీసాడు. వాడి చేత కిళ్ళీ బడ్డీ పెట్టించాడు. ఇద్దరూ గొడ్డుల్లా పనిచేసి పడుంటారు అనుకుని ముడిపెట్టించేసాడు. అలా దాని గొడవ సెల్లినట్టే అనుకున్నాడు.

సంటెమ్మ ఏ కలక్టరుకో యివ్వాల్సిన పిల్ల- అనుకుంటాడు రాజులు. చూస్తూ చూస్తూ 'ఆ పిల్లని పేడలో యెట్ట నేను' అనుకున్నాడు. కాస్త కూడదీసుకుని, మాంచి హోషుగ్గా చేద్దామనుకున్నాడు.

అంతదాకా సంటెమ్మ ఆగలేదు. వారం పదిరోజుల క్రితం లాడ్జిలో దొరికిపోయింది. 'కాస్త ఎర్రగా బుర్రగా ఉన్నాడని చూసి గంగవెర్రులు ఎత్తిపోయే' ఆ కూతురిని ఎలాగో విడిపించి తీసుకొచ్చాడు. చావగొట్టి చెవులు మూసాడు. రాజులు మనసు ఉసూరుమంది. తల్లి ప్రాణం కొట్టుకుపోయింది. యింట్లో కుమిలికుమిలి ఏడ్చారు.

ఆ సమయంలో రామ్మూర్తి తమ్ముడి మీద పడింది రాజులు దృష్టి. 'మాంచి రంగరి' అనుకున్నాడు. ఆడో దెబ్బ కొట్టాడంటే ఆడది 'కుయిక్కు' మనాల్సిందే- అనుకున్నాడు. సూటూ బూటూ యేస్తే దొరనాగ ఉంటాడు- అనుకున్నాడు.

రాజులు తన ఆలోచనలూ, సమస్యలూ రామ్మూర్తికి చెప్పలేదు.

''గుంటడు మంచాడు- పైకొత్తాడు అనుకున్నావ్రా అల్లుడూ- అదేదో మచ్చు సూడకుండా సెప్పడవెందుకనుకుంతే సెప్పేదాకా వల్లకోనేదురా అల్లుడూ-'' అన్నాడు రాజులు.

తలమీద బరువు దింపినట్లు 'అమ్మయ్య' అనుకున్నాడు రామ్మూర్తి.

⁂

చెప్పినదానికల్లా సత్తిరాజు ఊకొడుతున్నాడు.

రామ్మూర్తే ఎక్కువ మాట్లాడుతున్నాడు. రాజులు మధ్య మధ్యలో ఒకటీ అరా తగిలిస్తున్నాడు. అప్పటికే సత్తిరాజుకి మూడు రౌండ్లయ్యాయి.

''మీ టీ కొట్టు మీదే- పక్కనే మా బడ్డీ కొట్టుంటాది. ఒకరికొకరు మాట సాయం చేతి సాయం అవుతారు-'' అంటున్నాడు రామ్మూర్తి.

''నన్నేం జెయ్యమంటావు బెదరూ-''

''నీకు దెల్సు-''

''ఏంటి?''

''దొర.'' అన్నాడు రామ్మూర్తి.

రామ్మూర్తి తన దగ్గరకి రావటమే సత్తిరాజుకి బాగుంది. అతను తన పలుకుబడిని గుర్తించటం అంతకన్న బాగుంది. జనం తనకి అందువల్ల జడిస్తే బావుంటుంది గానీ అలా పలుకుబడి ఉందనుకోటం వల్ల తనేమైనా మెరుగయితే బాగుంటుంది గానీ యిలా వచ్చి ఆ పలుకుబడికి పరీక్ష పెట్టడం సత్తిరాజుకి రుచించలేదు.

''నా మొహం దొర నా మాటెందుకు యింటాడు?'' అన్నాడు.

''అదేటి గురూ- ఓటీ యెయ్యాలన్నా, తీసెయ్యాలన్నా- నీ సేతిలో పనే గదా-'' అంటూ చిన్నతెరు కొట్టాడు రామ్మూర్తి.

అది అతని స్వభావానికి విరుద్ధం. అలాంటి విరుద్ధమైన పని చేస్తున్నానన్న బాధ వెంటనే అతనికి కలిగింది. 'జరగవలసిన పని తన స్వంత పని కాదు- ఏదో కొంత తమ్ముడి పనే అయినా, అది రాజులు పనే గదా-' అని తనకి తను నమ్మించుకోబోయాడు.

సత్తిరాజు ఎంత తాగినా 'చూద్దాం' అన్నాడు గాని ప్రామిస్ చెయ్యలేదు.

''కబాబు పుల్లలు బాగున్నాయి బెదరూ' అన్నాడు. మరికొన్ని తెప్పించాడు రాజులు.

⁂

'లాభం నేదు గురూ' అనేసాడు రామ్మూర్తి విసుగ్గా.

'అలా మద్దిన యిడిసిపెడితే ఎలారా?' అన్నాడు రాజులు. చెప్పరా - అన్నాడు లక్ష్మణరావుని.

రామ్మూర్తి అలాంటి అవకాశం వదులుకోటం అతనికి నచ్చలేదు. రాజులు పిల్లనిస్తే రామ్మూర్తి సమస్యలు తగ్గుతాయని అతనికి అనిపించింది. ముందుగా వాళ్ళిద్దరూ తనతో అనకపోయినందుకు కష్టం అనిపించింది. రాజులు వచ్చి చెప్పాక - అతను కొంత

సమాధానపడ్డాడు.

రామ్మూర్తి అడగవలసిన విధంగా అడిగితే పని 'సిటికె'లో అవుతుంది- అంటాడు రాజులు.

లక్ష్మణరావుకి కూడా ఆ 'విధం' ఏమిటో రాజులు చెప్పలేకపోయాడు. మూడొంతులు బ్రతిమలాడటం - పనవకపోతే బెదిరించటం బలప్రదర్శన చెయ్యటమే రాజులు అనుకుంటున్న విధానం.

రాజులు తన బలాన్ని సత్తిరాజుకి చూపించటానికే రామ్మూర్తిని ముందుకి తోసాడు. అయితే రామ్మూర్తి తన బలాన్ని చూపించటం లేదు. ఆ బలం అతని వెనకనున్న జనం.

రాజులూ సత్తిరాజూ ఒక్క మారే అన్‌స్కిల్డ్ లేబరర్లుగా చేరారు. 'దొరల యింట్లో గుడ్డలుతికి, బూట్లు పాలిష్ చేసి ఆడు సార్జెమను అయిపోనాడు' అంటాడు రాజులు. వాళ్ళిద్దరూ ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుకోరు. తిట్టుకుంటూ మాట్లాడుకుంటారు. అదంతా పై వాళ్ళకి స్నేహంలా కనిపించేలా ఉంటుంది.

రామ్మూర్తిని తన పనికోసం ఎంచుకోటంలోనే రాజులు పప్పులో కాలేసాడు.

★★★

-ససేమిరా - వల్లకాదు - పొమ్మన్నాడు నాగయ్య.

-రామ్మూర్తి గాడి లాంటి పొగరుమోతు నాయాలే దొరికాడా నీకు - అన్నాడు.

రామ్మూర్తితో గొడవ జరిగాక, నాగయ్య కాస్త యిరకాటంలో పడ్డాడు. అప్పులు అతను యిష్టం వచ్చినట్లు, యిష్టం వచ్చిన వారికి యిచ్చే అవకాశం తగ్గింది. సొమ్ము అతని స్వంతమో, జనాలదో తేల్చి చెప్పాల్సి వచ్చింది.

బొక్కలోకి పోతాడనుకుంటే ఆ పోలిగాడికి కలేజా లేకపోయింది. అని నాగయ్య గింజుకున్నాడు.

''ఏటి బెదరూ- అంత కోపం?'' అన్నాడు సత్తిరాజు.

''వాడు అంబళగన్ దొరనీ అలీనీ తన్నినోడు. నన్ను తన్నాడు. నీ సంగతి సరేసరి- రోడ్డుమీద నిన్ను నిలబెట్టేసాడు-''

''రామ్మూర్తి అందులో నేడు-''

''నాటకాలు! వెనక నుండి ఆడించాడు-''

''అదేం మాటలే- అందరూ ఉన్నారు-'' అన్నాడు సత్తిరాజు.

రామ్మూర్తి అంటే సత్తిరాజుకి లోలోపల భయం ఉంది. రామ్మూర్తి ఆరోజు లేకపోయినా, వెనకాల ఉన్నాడన్న నాగయ్య ఆలోచనను అంగీకరించడానికి అతనికి అభ్యంతరం లేదు.

సత్తిరాజులు ముఖంలో మారుతున్న రంగులు గమనించి ప్లేటు మార్చాడు నాగయ్య.

''-నువ్వు పిచ్చోడిలాగున్నావ్ బెదరూ- నీ కొట్టుమీదకి మరోకొట్టా-? అదయినా చూసుకోవద్దా?''

''మనది టీకొట్టు-?''

''అవును గురూ - ఆడు కిళ్ళీ కొట్టే పెడతాడు. ఏటమ్ముతాడు? జంతికలు- చేగోడీలు- పప్పుండలు - బిస్కత్తులు-! అంటేటి? తినేవి. - టీ కొట్లో అమ్మకాలు- నీ పాసెంజర్లూ తగ్గరా?''

సత్తిరాజు ఆ విషయం ముందే ఆలోచించాడు.

ఆ కొట్టు తన సొంతమేం కాదు. తమవాడే వచ్చి పట్టుకుంటే ఆ కొట్టు పెట్టించాడు, పోతే, మెషిన్‌షాప్‌లో అటు సూపర్వైజర్లకీ ఏడుపే - యిటు పనివాళ్ళకీ మంటే - ఒంటిపిల్లి రాకాశిలా బ్రతకటం ఎంతకష్టం! ఎవడో ఒకడి దన్నుంటే బాగుంటుంది. అందులోనూ అందరికన్నా బలవంతుడయితే మరీ మంచిది. కృతజ్ఞతగా చెప్పినట్లు పడుంటాడు.

ఇలా అనుకున్నపుడు రామ్మూర్తికి జరిగే లాభం కన్న- తనకే లాభం అనిపించింది. నాగయ్య మాటలతో మళ్ళీ ఆలోచన మారింది.

ఈ సందిగ్ధంలో సత్తిరాజు ఒక నిశ్చయానికి వచ్చాడు.

★★★

''దొరని కలవడమా- నేనా?!'' ఆశ్చర్యంగా అన్నాడు రామ్మూర్తి. సత్తిరాజుని ఆశ్చర్యంగా చూసాడు.

''పనయిందాకా తప్పదు బెదరూ- ఎవడో ఒకడి కాళ్ళట్టుకోవాలి- దొర మంచాడు-'' అన్నాడు సత్తిరాజు.

వాళ్ళిద్దరి గుసగుసలూ మెషిన్‌షాప్ చూస్తూనే ఉంది. రాజులుకీ, లక్ష్మణరావుకీ తప్ప మిగిలిన వారికి విషయం తెలియదు. నాగయ్య నెమ్మదిగా ఊదేసాడు.

దొర దగ్గరకి తీసుకెళ్తానన్నాడన్న సంగతి రాజులుకి రామ్మూర్తి చెప్పలేదు. అతను- 'వెళ్లు'- అనేస్తాడన్న భయం.

లక్ష్మణరావుతో చెప్పాడు.

''వద్దు-'' వెంటనే అన్నాడు లక్ష్మణరావు.

''ఏం?''

''మీ వాళ్ళు రకరకాలుగా అనుకుంటారు-''

''.......''

''సత్తిరాజుకి వొచ్చిన పేరే నీకు వస్తుంది-''

''ఏడిసారు-''

''మాట తూలుతున్నావ్-''

రామ్మూర్తి మాట్లాడలేదు.

- అతనికి తప్పుమాట అన్నానని తెలుసు. అయితే తను కష్టాల్లో ఉన్నపుడు ఎవడేం చెయ్యగలిగాడు - అన్న ప్రశ్న అతనిని దొలుస్తోంది.

''అయితే నువ్వు వెళ్ళొద్దంటావ్-'' అన్నాడు.

లక్ష్మణరావుకి బాధ కలిగింది. రామ్మూర్తి వ్యవహారాన్ని తన స్వంతంలా భావించి అంత చొరవగా 'వద్దు' అని చెప్పేశాడు. రామ్మూర్తి గొంతులో తేడా అతను ఊహించలేదు.

''నీ యిష్టం'' అన్నాడు ముక్తసరిగా.

రామ్మూర్తి భీమరాజుని కూడా అడిగాడు- ఏం చెయ్యమంటావు అని.

''మోహన్రావ్ ఏమన్నాడో తెలుసా?''

రామ్మూర్తికి మోహన్రావు ఏమంటాడో తెలుసు- వాడికి భయపడి అడగలేదు తను.

''ఏమన్నాడూ?'' అన్నాడు.

''వాడికి మన మీద నమ్మకం పోయింది. దొరలు కావల్సొచ్చారు- అన్నాడు''

''అదేం లేదురా భీమరాజూ-''

''అవున్రా- నీ తమ్ముడికి కొట్టు కావాలంటే మేం లేమా? సత్తిరాజు గాడి కొట్టు పక్కన రాత్రికి రాత్రి కొట్టు లేపెయ్యమా? ఆ సత్తిరాజుగాడు దొరకు ఫిర్యాదు చేస్తే రెండు కొట్టులూ పోతాయి- ఉంటే రెండూ ఉంటాయి-''

రామ్మూర్తి నివ్వెరపోయాడు-

ఏమయింది తనకు? యీ ఆలోచన తనకు ఎందుకు రాలేదు? షాపు మొత్తం మీద మరెవరైనా తన దగ్గరకు వస్తే- తనూ, యిదే సలహా చెప్పేవాడు. అందరూ కలిసి యిదే పనిచేసేవారు.

రామ్మూర్తిని అలాగే వదిలేసి భీమరాజు వెళ్ళిపోయాడు.

★★★

రామ్మూర్తి జనంలో కలవటానికి ప్రయత్నం చేసాడు.

ఎవరూ అతని మొహం మీద ఏమీ అనలేదు.

మైలకాకిని యితర కాకులు రానియ్యనట్టు అతన్ని రానియ్యలేదు.

ఒకరోజు మోహన్రావుతో కిళ్లీకొట్టు విషయం కదిపాడు. చూద్దాంలే అని నాన్చేసాడు.

''-ఆడికి దొరదగ్గర పనవలేదు. అందుకే మనచుట్టూ తిరుగుతున్నాడు-'' అని మోహన్రావు ఎవరి దగ్గరో అన్నట్టు రామ్మూర్తికి తెలిసింది.

రామ్మూర్తికి మండిపోయింది.

మెషిన్ షాప్‌లో పనివాళ్ళు వేర్వేరుగా కలుస్తున్నారు. కొందరు రామ్మూర్తిని పూసుకు తిరుగుతున్నారు. కొందరు మోహన్రావు వెనక తిరుగుతున్నారు.

కొందరికి డి.యమ్. అనడం మొదలయింది.

అలా తనకు పేరు పెట్టారనీ, దాని అర్థం దొర మనిషి అనీ రామ్మూర్తి దగ్గరకు ఒకడు మోసేసాడు.

రామ్మూర్తికి గుండెల్లో పొడిచినట్లయింది.

''సత్తిరాజుకి గాదురా ఫోజు- నీకు ఎక్కువయిందిరా- మోహనూ-'' అనుకున్నాడు.

★★★

కీచుమంటూ బ్రేకులు పడ్డాయి.

ప్రయోజనం లేకపోయింది.

స్కూటర్ రోడ్డు పక్కకూ, మనిషి బస్సు కిందకీ వెళ్ళిపోయాడు.

ముందు చక్రాలు రెండూ ఎక్కేసాయి. మనిషి నుజ్జు నుజ్జు అయిపోయాడు.

ఆగిన సిటీ బస్‌లోంచి ఉరికిన డ్రైవరూ, కండక్టరూ క్లీనరూ అజా పజా లేకుండా పారిపోయారు.

కిక్కిరిసిన బస్సులోంచి జనం ప్రవాహంలా బయటకు వచ్చారు. రోడ్డు మీద జనం కలిసారు.

''పట్టుకోండి తన్నండి బస్సులో పడేసి కాల్చేయండి- ఈ ప్రైవేటు బస్సులాళ్ళు సర్వీసు కోసం మనుషులను చంపేస్తున్నారు-'' కేకలు అరుపులు.

అద్దాలు పగిలిపోయాయి.

సీట్లు ఊడిపోయాయి.

చనిపోయిన మనిషి, మీనాంబికా యిండస్ట్రీస్ వాడన్న వార్త ఆ కంపెనీలోకి పాకింది. వర్క్‌షాప్ నుంచి పనివాళ్ళు బయటకు వచ్చారు. అంతా చేరేసరికి బస్సు తగలబడుతోంది.

పోలీసులు వచ్చేసారు. లోకల్ రాజకీయ పెద్దలు వచ్చేసారు. బస్సు యజమాని వచ్చేసాడు.

శవం ఆస్పత్రికి తరలింది.

ఒక మనిషి చనిపోయినట్లు ధృవీకరించబడింది.

మీనాంబికా యిండస్ట్రీస్‌లో ఎలక్ట్రికల్ షాపులో ఒక సూపర్‌వైజర్ ఉద్యోగం ఖాళీ అయింది.

⁂

''యివ్వీ- పేర్లు'' అన్నాడు తిరుమలరావు.

''షణ్ముగం'' అని చదివి గంగూలీ తలెత్తి ''తమిళియనా?'' అని అడిగాడు.

''కాదు సార్-''

ఆనంద్‌కుమార్ ఫైల్ తిరగేసాడు. ఆరుగురు అర్హులున్నారు.

''మీ అభిప్రాయం ఏమిటి?''

''ప్రతివాడూ అర్హుడే- పనివాడే-''

''నిజమే- మనం సెలెక్ట్ చెయ్యాల్సింది ఒక్కడినే''

''ఆ విషయంలో నిర్ణయం తీసుకోవలసినది మీరే-''

''ఆ విషయం నాకు తెలుసు- మీరైతే ఏం చేస్తారు-''

''తప్పదు- ఇప్పటివరకూ కంపెనీ పాలసీ ప్రకారం సీనియార్టీకే ప్రాధాన్యత యివ్వాలి-''

ఆనంద్‌కుమార్ వెంటనే జవాబు యివ్వలేదు-

''నేనలా అనుకోలేకపోతున్నాను. రెండేళ్ళు ముందు చేరినంత మాత్రాన మానేజీరియల్ స్కిల్స్ వస్తాయా- పనివాడితనం పెరుగుతుందా?''

''...నిజమనుకోండి- పాలసీ ఉంది గదా''

''చదివినవాడూ... చదవని వాడూ ఒక్కటే ఎలా అవుతాడు-- చదువుకున్న వాడిని ప్రోత్సహించాలి-''

''-ఆ మాట అందరూ అంటారు సార్- మనం అప్రంటీసుగా తీసుకున్న వాళ్ళకి, డిప్లమా చదవిన వాళ్లకి యిచ్చే ప్రోత్సాహం ఏమీ లేదు గద సార్-''

గంగూలీ నవ్వాడు- ''మీ అల్లుడి సంగతేనా మీరు చెప్పేది-''

''నో... నో... సర్... జనరల్ విషయమే మాట్లాడుతున్నాను-''

''మీరీ విషయం నాకు ముందే చెప్పవలసింది-'' చెప్పాను సార్- అని చెప్పలేదు తిరుమలరావు-

''ఈసారి వీలయినపుడు చూద్దాం-'' అన్నాడు.

''సీనియారిటీని పాటించాలన్నది యూనియన్ వాళ్ళ డిమాండ్ సార్. దాన్ని మానేజ్‌మెంట్ ఒప్పుకుంది-''

''యూనియన్లు మారతాయి- మానేజ్‌మెంట్లు మారతాయి- పాలసీలు మారకుండా ఉండిపోతాయా- తిరుమలరావ్-''

⁂

సూపర్వైజర్ పోస్టుకి యింటర్వ్యూలు పెడతారన్న వార్త కంపెనీలో వ్యాపించింది.

''యింటర్వ్యూనా?'' ఆశ్చర్యం. కొందరిలో కోపం, కొందరిలో ఆశ ''యూనియన్ వాళ్ళేం చేస్తున్నారు?''

''వాళ్ళేం చేస్తారు- మనం ఏం చెపితే అది చేస్తారు- ఇష్యూ తీసుకెళ్ళి మాట్లాడదాం!''

''ఎవడికి శక్తి ఉంటే వాడు సూపర్వైజర్ అవుతాడు. పనికిరాని వాళ్ళను అనుభవముంది గదా అని మానేజ్మెంట్ ప్రమోట్ చెయ్యాలా?''

''-నువ్వు పెద్ద పనిమంతుడివి- నా శలవంత లేదు నీ సర్వీసు- నీకింద నేను పనిచెయ్యాలా?''

''లైనో, న్యూట్రలో తెలుసుకోటానికి- నాలాంటి వాడిని వైర్ పట్టుకు చూడమనే మొనగాడివి నువ్వు. నువ్వు నిజంగా సూపర్వైజర్ అయితే... సగం పోస్టులు ఖాళీ-'

యూనియన్లలో ఒకటి అనుభవం ముఖ్యమంది. మరొకటి విద్యార్హత ముఖ్యమంది.

విద్యార్హతకు కొన్ని మార్కులూ, అనుభవానికి కొన్ని మార్కులూ వెయ్యాలన్నారు. ఇంటర్వ్యూలు అంగీకరించకూడదన్నారు. అంగీకరించాలని కొందరు అన్నారు.

అనుభవమూ, విద్యార్హతా ఖచ్చితంగా లెక్కతేలేవి గనక- లోగడ యూనియన్ అనుభవమే ప్రాతిపదిక అని మానేజ్మెంట్తో ఒప్పందం చేస్కుంది కనక- అది వదులుకోవటం మన పిలక మానేజ్మెంట్ చేతుల్లో పెట్టడమే అన్నారు.

చర్చలు సాగుతున్నాయి.

సూపర్వైజర్ పోస్టుకి కావల్సిన కనీస అనుభవం గల ఆరుగురూ దొరని ఎలా పట్టుకోవటం అన్న ఆలోచనలో పడ్డారు. ప్రయత్నాలు ఆరంభించారు.

అందులో ఒకడు సత్తిరాజుని ఆశ్రయించాడు.

★★★

''ఏలాకోలం ఆడతన్నావేంటి బెదరూ-'' ఉషారుగా సత్తిరాజు అన్నాడు.

ఈ మధ్య అతనికి అన్నీ విజయాలే ఎదురవుతున్నాయి. ముప్పై రూపాయల బ్రాకెట్ తగిలింది. నాగయ్య బాకీ లేదనిపించేసాడు. రామ్మూర్తిగాడు కిళ్ళీ బడ్డీ ఊళ్ళోనే పెట్టుకున్నాడు గానీ, ఆ పేరుతో తన వెనకాల కుక్కలా తిరుగుతున్నాడు. మోహన్ గాడు రామ్మూర్తిని చూసి కాబోలు- తన మీదకి రావటం లేదు.

ఈరోజు ఎలక్ట్రికల్ షాప్ వాళ్ళు సూపర్వైజర్ ప్రమోషన్ కోసం తన యింటి ముందు క్యూ గడుతున్నారు.

అరగంట నుంచి సత్తిరాజుకి మందు పట్టిస్తున్నాడు నరసింహారావు.

''మీరలా అనకండి గురూగారూ- దొరకీ మీకూ మధ్యనున్న దోస్తీ నాకు తెలుసు-''

''అవుననుకో... దొరమనం జెప్పినట్టు ఆడతాడు. యింటాడు... యినకుండా పోడు... యిందులో యింటాడా అని...''

''ఎందుకినడండీ- మీ రుణం నేను ఉంచుకోను-'' అన్నాడు.

గుసగుస మొదలయింది.

అంకె కుదిరింది.

'పనయాక' అన్నాడు నరసింహారావు. 'పనిముందే' అన్నాడు సత్తిరాజు.

మరో అరగంటకి పని ముందో సగమూ, పని అయాక సగమూ అనుకున్నారు.

★★★

నరసింహారావుని పూర్తిగా దగా చెయ్యలేదు. సత్తిరాజు భయపడుతూనే ఆనంద్ కుమార్ వద్ద విన్నవించుకున్నాడు. ఆ ధైర్యానికి మరో కారణం ఉంది. తను జయించాడా- తన వెనక ఉద్యోగాల కోసం, ప్రమోషన్ల కోసం పడనివాడు ఉండడు.

''మీరంటూన్నది నాకు అర్థం కాలేదు-'' విసుగ్గా అన్నాడు గంగూలీ.

''రాఘవరావు వేకెన్సీ గురించి అందరూ కొట్టుకు చస్తున్నారు సార్...? నరసింహారావని మావాడొకడు కూడా ఉన్నాడు-''

మొదటి మాటని విన్నాడు గంగూలీ. రెండవ మాటను పట్టించుకోలేదు.

కుర్చీలో ముందుకు వంగి- అన్నాడు.

''మళ్ళీ చెప్పు-'' అన్నాడు.

సత్తిరాజుకి గంగూలీలో మార్పు బోధపడలేదు. భయంతో తడుముకుంటూ అన్నాడు.

''రాఘవరావు వేకెన్సీ సార్. షాప్‌లో వాళ్ళు ప్రమోషన్ దెబ్బలాట సార్...''

''వెరీ గుడ్...'' అంటూ నవ్వాడు.

సత్తిరాజుకి ధైర్యం చిక్కింది. నరసింహారావు గురించి చెప్పసాగాడు. మంచి పనివాడు పేదవాడు... పెద్ద కుటుంబం...

ఆనంద్‌కుమార్ ఆలోచనలో పడ్డారు-

ఒక్క పోస్టు కోసం ఇంతమంది కాట్లాడుకుంటున్నారా? ఇప్పటికే తన దగ్గరకి మూడు రికమండేషన్లు వచ్చాయి. ప్రమోషన్ ప్రతీ వాడికీ కావాలి. అందులో ఉన్నది డబ్బే కాదు... అధికారం కూడా ఉంది. మనిషికి డబ్బే కాదు అధికారమూ కావాలి.

అయితే ప్రమోషన్‌కి ఒక రిజిడ్ రూల్ ఉంటే యింత పోట్లాట ఉండదు. లోపల్లోపల నిరాశ... ఏడుపూ మాత్రం ఉంటాయి. కేపటలిజం విజయం అంతా ప్రమోషన్ చూపెట్టగలగటం మీదా, దాని కోసం పోటీ పెట్టగలగటం మీదా ఆధారపడి ఉంది. వారెవా... ప్రమోషన్ సిస్టమ్

★

ఎంత గొప్పది...! ప్రపంచ గమనానికి ఆధారచక్రాలు ప్రమోషనూ, దానికోసం పోటీనూ...!

సత్తిరాజు చెప్పటం అయాక అన్నాడు ఆనంద్‌కుమార్...

''సర్లే... చూద్దాం... ప్రమోషన్ ఈసారి రాకపోతే మీ కాండిడేట్‌కి తర్వాత వస్తుంది...''

సత్తిరాజు మొహం చిన్నపోయింది- సరేసరే అంటూనే తుస్సుమనిపించేసాడు- అనుకున్నాడు.

చివర ప్రయత్నంగా...

''ఉన్నదొక్క పోస్టు సార్... యీ ఛాన్స్ పోతే యింక రిటైరయే వాళ్ళు యిప్పట్లో లేరు- మీరు దయచూడాలి సార్?''

పకపకా నవ్వాడు- గంగూలీ.

ఆ నవ్వు బాంబ్ వత్తిని అంటించగా మొదలైన పొగలా, మంటలా ఉంది.

బాంబ్ పేల్చాడు ఆనంద్‌కుమార్- ''ఎవరితోనూ చెప్పకండి- ఎక్స్‌పాన్షన్ స్కీమ్ ఫైనలైజ్ అయింది- అర్హులందరికీ ప్రమోషన్లే- త్వరలోనే పరీక్షలు పెడుతున్నాం-''

సత్తిరాజు బుర్రకి మాట చురుకుగా అంటింది-

''కంపెనీ సాట్యురేట్ అయిపోయిందనుకుంటున్నారు సార్...''

''అందుకే... గదా... త్వరలో ఎన్ని ప్రమోషన్లున్నదీ తేలిపోతుంది. షిఫ్ట్ సిస్టమ్ పెట్టి రిక్రూట్ చేసుకుని మెషిన్ షాప్‌లో ప్రమోషన్లు యివ్వాలని ఓ ప్లాన్ ఉంది- సత్తిరాజూ.''

★★★

ఆనంద్‌కుమార్ ఊహించిన దానికన్న ఎక్కువ సంచలనమే కలిగింది.

ప్రతివాడి నోటా ఎక్స్‌పాన్షన్!

ప్రతివాడి మనసులోనూ ఎక్స్‌పాన్షన్!

★★★

''-ట్రేడ్ టెస్ట్‌లు పెడతారట- వాటిని బట్టే ప్రమోషనిస్తారుట-'' అన్నాడు రామ్మూర్తి.

అతని గొంతులో సంతోషం ఉంది. ఆశ ఉంది.

ఆ మాటకి లక్ష్మణరావు, మోహన్రావూ ఏమీ మాట్లాడలేదు.

ఆ వార్త అప్పటికే బాగా వ్యాపించింది.

''యూనియనోళ్ళు వల్లకుంతారేటి?'' అన్నాడు రాజులు.

''ఇది ప్రమోషన్ కాదు. కొత్త ఉద్యోగంట. అలాగే తీసుకుంటారుట-'' అన్నాడు సుదర్శనం.

''నాగ్గోడి ఏడుపు సూడాల-'' అన్నాడు మోహన్రావు.

''ఎవులయినా ఏడుత్తారు- యిన్నేళ్ళు సర్వీసు సేసి యిప్పుడు టెస్ట్‌లంటే-'' అన్నాడు కోపంగా రాజులు.

''మన బాగు కోసమే దొర యీ టెస్ట్‌లు పెడతన్నాడు మావా!'' నచ్చజెపుతున్న గొంతుతో అన్నాడు రామ్మూర్తి.

మోహన్రావు నవ్వటం మొదలుపెట్టాడు. రాని నవ్వుని- తెచ్చి పెట్టుకుని మరీ నవ్వుతున్నాడు.

రామ్మూర్తి మొహం నల్లబడింది.

ఉద్రేకంగా లేచాడు.

మోహన్రావు నవ్వు ఆపలేదు.

లక్ష్మణరావు రామ్మూర్తి చెయ్యి పట్టుకుని అక్కడ నుంచి లాక్కుని దూరంగా తీసుకుపోయాడు.

''ఏటనుకుంటన్నాడాడు? నరికేత్తాను-'' అన్నాడు రామ్మూర్తి గట్టిగా.

లక్ష్మణరావు అతని చెయ్యి వదలలేదు.

★★★

''ఈరోజు ఆరుగురికి జాబ్స్ యిమ్మన్నాడు దొర. లంచ్‌లోగా ఎవరు ఎంత చేస్తే అంత. దొర చూస్తాడు. టీకి వెళతారో మానతారో మీ యిష్టం-'' అన్నాడు కృష్ణమూర్తి.

''ఇది ట్రేడ్ టెస్టా-?'' అడిగాడు మోహన్రావు.

''తెలియదు-''

''మీకేం తెలుసు?''

''ఆయన ఏవో లిస్టులు చేసుకుంటాడుట. తనతో పెట్టుకుంటాడట. ఆమాట మాత్రం అన్నాడు-''

''ఏమీ తెలియకుండా మేం టెస్ట్ తీసుకోం'' అన్నాడు మోహన్రావు.

''యిష్టం లేకపోతే మానెయ్యొచ్చని కూడా చెప్పాడు దొర...''

అంతా ఒకరి మొహాల్లోకి ఒకరు చూసుకున్నారు.

''-యీ షాప్‌లో అందరికీ యీ నెలలో యిలాగే ఎప్పుడో ఒకప్పుడు పరీక్ష పెడతారుట.''

రామ్మూర్తి తన జాబ్‌ని, డ్రాయింగ్‌నీ తీసుకున్నాడు.

ఒకరి తర్వాత ఒకరు వాటిని తీసుకున్నారు.

చివరగా మోహన్రావూ తీసుకున్నాడు.

ఆరుగురూ జాబ్స్‌ని మిషిన్స్‌కి బిగించారు. టూల్స్ అమర్చారు. పని మొదలయింది.

రామ్మూర్తి ఏకాగ్రతతో పని చేయటాన్కి ప్రయత్నిస్తున్నాడు. ఆ లోహపు ముక్కను డ్రాయింగ్‌లో చూపిన ఆకారంలోకి మార్చటం మీదనే తన జీవితం అంతా ఆధారపడినట్లు పనిచేస్తున్నాడు. అందరితోనూ వేరువడి ఒక్కడూ అయిపోవటాన్కి యిచ్ఛగించని అతని లోపలి మనిషిని ఎవరో చిత్రిక పట్టి ఒక కృత్రిమ ఆకారంలోకి కుదింపచేస్తున్నట్టు మనసు విలవిలలాడుతోంది. అతనే స్పష్టం చేసుకోలేని ఆ అనుభూతి అతనిని పనిలో లగ్నం కానీటం లేదు.

సుదర్శనం టీ కోసం బయలుదేరుతూ రామ్మూర్తిని పిలిచాడు.

''నువ్వెళ్ళు బెదరూ- నైట్ కాలేజీలో డిప్లమో చదువుతున్నావు - నీకు యిక్కడ రాకపోయినా ఫర్లేదు యింతకన్న మంచి ఉద్యోగం దొరుకుతుంది-'' అన్నాడు రామ్మూర్తి.

''పద బెదరూ- నేనొత్తాను-'' అన్నాడు మోహన్రావు.

ఇద్దరూ టీ తాగుతున్నారు.

''రామ్మూర్తి ఎందుకిలా మారిపోయాడు?'' అన్నాడు సుదర్శనం.

''ఆడు బయటపడిపోతున్నాడు-'' అన్నాడు మోహన్రావు. అతని గొంతులో బాధ ఉంది.

సుదర్శనం అతని భుజం మీద చెయ్యి వేసి 'బాధపడక!' అన్నట్టు నొక్కాడు.

ఇద్దరూ తిరిగివచ్చారు.

మెషిన్‌ని ఆన్‌చేసిన మోహన్రావు ఆశ్చర్యంతో, కోపంతో, బాధతో గట్టిగా అరిచాడు-

''ఏది నా జాబ్?''

ఆ అరుపుతో మెషిన్ షాప్ ప్రతి ధ్వనించింది. నలుగురూ చేరేసరికి మోహన్రావు పరుగెత్తుకుంటూ వెళ్ళి రామ్మూర్తిని సమీపించాడు.

అతని భుజం మీద చెయ్యి వేసి- ''ఏదిరా నా జాబ్?'' అంటూ చెయ్యి ఎత్తాడు.

★★★

''ఎంత రమ్యంగా ఉందీ రోజు-'' అంది ప్రీతి.

గది బయట వేడిని లోపలకి రాకుండా కాపలా కాస్తోంది - రూమ్ ఏర్ కండిషనర్. లోపల వేడిని బయటకు పోకుండా కాపలా కాస్తున్నాడు గంగూలి.

''ఏంటి సంగతి మైలవ్!'' అంది ప్రీతి.

''విజయం-'' అన్నాడు గంగూలి.

''ఏం విజయం?''

''రాబర్ట్ క్లైవ్?''

''ఏ రాబర్ట్ క్లైవ్''

''భారతదేశాన్ని గుప్పిటను పట్టిన క్లైవ్-''

''పట్టి, ఏం చేసాడు?''

అమాయకమైన ఆ ప్రశ్నకే అసహనంగా, ఇబ్బందిగా కదిలాడు గంగూలి.

''చెప్పు బాసూ-'' తన పరవశం నుంచి బయటపడకుండా ప్రశ్నించింది ప్రీతి.

''ఏం చేస్తాడు-'' అని ''అప్పగించాడు''- అనుకున్నాడు మనసులో.

***

''తెల్లగా బలంగా సినిమా హీరోలా ఉన్నాడు-'' అనుకుంటోంది సంటెమ్మ.

వీరభద్రం ఆమెనే చూస్తున్నాడు.

అతని మనసు పెళ్ళి మీద లేదు. లోకంలో జరుగుతున్న 'అన్నేయం' మీద ఉంది. అందుకోసం అతనెన్నో సార్లు ఎందరినో తన్నాడు. కొన్నిసార్లు తన్నులు తిన్నాడు. తంతే తప్ప బాగుపడదు- అనుకున్నాడు. అలా అనుకునే వాళ్ళతో కలిసి- ఏటికేతామెత్తి ఎయిపుట్లు పండించి గంజిలో మెతుకెరుగనన్నా- అంటూ రెల్లి వీధిలో పాడాడు. సుత్తీకొడవలి గుర్తుగ ఉన్నా ఎర్రని జండా ఎగురుతున్నదీ- అంటూ మున్సిపాల్టీ స్టేడియంలో పాడాడు.

కిళ్ళీ బడ్డీ మీద తమ్ముడు సరిగ్గా కూర్చోకపోవటం రామ్మూర్తికి నచ్చలేదు.

రాజులుకీ నచ్చలేదు.

''పెళ్లయితే సెట్టవుతాడు-'' అనుకున్నాడు రామ్మూర్తి.

''సంటెమ్మ దోవలో యెడతాది-'' అనుకున్నాడు రాజులు.

మాటల కోసం రాజులు యింట్లో చేరారు.

వాకిట్లో మంచాలూ, కుర్చీలూ వేయించారు మోహన్రావు, రాజులు పెద్దల్లుడూ!

ఆరోజు ట్రేడ్ టెస్ట్ జరుగుతూన్నపుడు రామ్మూర్తికీ, మోహన్రావుకీ జరిగిన తగువు దూరం పోకుండా ఫోర్మాన్ అడ్డేసాడు. ఇద్దరినీ విడదీసాడు. పోయిన జాబ్ కోసం వెదికించాడు. అది దొరకలేదు. మోహన్రావు మెషిన్ దగ్గర ఎవరూలేరు. రామ్మూర్తి దూరంగా తన పనిలో ఉన్నాడు. అంతా విచారించి మరో జాబ్ యిచ్చాడు. టైం యిచ్చాడు. టెస్ట్ పూర్తి చేయించాడు. సంగతి గంగూలీకి చెప్పాడు.

అంతటితో రామ్మూర్తికీ, మోహన్రావుకీ సయోధ్య ఏర్పడలేదు.

''ఆ డీ. యమ్. గాడే జాబ్ దాచేసాడు-'' అన్నారు మోహన్రావుతో కొందరు.

మోహన్రావు ఖండించలేదు.

''ఆ తాగుబోతునాయాల- నిన్ను అనుమానిస్తాడా? అంతకన్న అవమానం లేదు-'' అన్నారు రామ్మూర్తితో కొందరు.

రామ్మూర్తి ఖండించలేదు.

''-ఆళ్ళిద్దరూ దొంగలే- ఎవడి జాబ్ పాడయినా రెండోవాడు తీసి దాచెయ్యాలని గొడవ పెట్టుకోవాలనీ ఎత్తేస్తారు. ఫోర్‌మాన్ మెత్తదనం వాళ్ళకి తెలుసు-'' అన్నారు సుదర్శనంతో కొందరు.

దానికి సుదర్శనం అన్నాడు.

''ఎంతో కాలంగా ప్రాణానికి ప్రాణంలా ఉన్నాళ్ళిద్దరూ మొహమొహాలు చూసుకోటం లేదు. మనలోనే ఎవడో ఒకడు ఆ జాబ్ దొంగిలించేటంతగా దిగజారాం. ఈ టెస్ట్‌లు పెట్టి, మనకు నిజంగా ప్రమోషన్ యిస్తారో లేదో తెలీదు. మనం మాత్రం కొట్టుకుఛస్తున్నాం-'' అన్నాడు.

ఆ గొడవ తర్వాత ఈ పెళ్ళి మాటలలోనే యిద్దరూ ఒకరికొకరు ఎదుటపడ్డారు.

రంగుబుడ్లూ, ఫలహారాలూ వచ్చాయి.

రామ్మూర్తికి దూరపు బంధువు రంగారావు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో పని. 'పెళ్ళిమాటల కోసం' పెద్దవాడు గదా అని పిలిచాడు రామ్మూర్తి.

రాజులు యింటినీ, ఆ యింటి వాళ్ళ సంపదనీ అంచనా వెయ్యటం మొదలుపెట్టాడు. వీరభద్రం కన్నా చదువుకున్నాడు నా కొడుకు. ఆస్తి పాస్తులున్నాయి నాకు- అయినా యింత సంబంధం రాలేదు- అనుకున్నాడు.

రాజులు మాటలు అతనికి బీద అరుపులులా వినిపించాయి-

''మీరే అలాగంటే ఎలాగండీ- మీ టెక్నికల్ లైన్లో నాలుగేళ్ళకో ప్రమోషనూ, ఏడాదికో బోనస్సూ, పైగా యీ పాల వ్యాపారం- ఊ! యింకా మీరూ అలాగే మాట్లాడుతున్నారు... వెయ్యి రూపాయలు యిస్తారా మా వాడికి!'' అన్నాడు.

రామ్మూర్తి ఏం మాట్లాడలేదు.

'ఊరికే మాట మిగిలింది గానీ- అంతా సెటిలయి పోయిందే గదా- రామ్మూర్తి మళ్ళీ మొదటికి తెస్తాడా?' అనుకున్న రాజులుకి చాలా కోపం వచ్చింది.

''-మీ గుమత్తాలకి అన్నీ అట్టా అవుపిత్తాయండి- మీకూ, మా కూలి ముండావోళ్ళకీ ఎక్కడండి బావగారు! మీకు ఫానుకింద కూకుని కూకుని గుద్ద నొస్తాది! మాకు మెషిన్ కాడ నించుని నించుని ఒళ్ళు నొస్తాది!'' అన్నాడు.

రంగారావుకి ఆ భాష నచ్చలేదు. ఆ మాట నచ్చలేదు.

''అవునండి- మా ఆఫీసర్లు మమ్మల్ని కూర్చోబెట్టి జీతాలు యిస్తారు-''

''పై రాబడంతా మీకూ ఆరికే వాటాలే గదండీ-'' అన్నాడు.

''మీకు మాత్రం ఓ.టీ. రాదా? మీవీ జీతం అక్కర్లేని ఉద్యోగాలే-'' అన్నాడు రంగారావు మొహం చిన్నబుచ్చుకుని.

''అసలు గొడవ వొదిలేసి ఎందుకండీ యీ గొడవలు-'' అన్నాడు మోహన్రావు గొడవ ముదురుతుందన్న ఆందోళనతో.

''అతనన్న దాంట్లో తప్పేటుందిరా మోహనూ- మగ కుర్రోడి తరపున వచ్చారూ-'' అన్నాడు లక్ష్మణరావు.

-లక్ష్మణరావూ, తనూ మధ్యవర్తులు. ఎటూ ఉండగూడదు. కలపటానికి చూడాలి. వీడు ఆ రామ్మూర్తి గాడి పక్కన చేరిపోతాడా? వాడు ఎవడినో పట్టుకొచ్చి బేరాలకు దిగుతాడా? ఎప్పటికయినా వాడికే గదా లాభం! ఈ తొస్సోడు కూడబెట్టిందంతా కూతుళ్ళకే గదా! - అనుకున్నాడు మోహన్రావు.

''వెయ్యి రూపాయలన్నా ఆడివ్వకపోతే యీ సంబంధం కుదర్దా?'' అన్నాడు ఉద్రేకంగా- మోహన్రావు-

''యివ్వగలిగీ... యివ్వకపోతే... ఎవడేం జేత్తాడు-?'' అన్నాడు లక్ష్మణరావు.

''ఏరా - అల్లుడా - నువ్వేటంటావు?'' అన్నాడు రాజులు రామ్మూర్తితో నేరుగా.

పైసాకి టికాణాలేని నీ తమ్ముడిని పిలిచి బడ్డీ మీద కూర్చోబెట్టాను. ఇంత ఉపకారం చేసాను. నా మాట కాదంటావట్రా? - అన్నట్లు వినిపించింది రాజులు గొంతు.

ఆడపిల్లని యిచ్చుకునీ వాడికి యింత పొగరు తగదు. అసలు వీడికి ఎక్కించింది ఆ మోహన్గాడే- అనుకున్నాడు రామ్మూర్తి.

''నేనేటంటాను- మా వాళ్ళు రైటుగానే మాట్లాడారు-'' అన్నాడు.

మాటలు పెరిగాయి.

పెళ్ళి మాటలు ఆగిపోయాయి.

లోపలి గొడవలు, లోపల్లోపలి గొడవలు... బయటి గొడవలు... పైపై గొడవలు... వెనకటి బాధలు... ముందు ఆశలు... అన్నీ కలగాపులగమయ్యాయి.

సంటెమ్మ గదిలోకి పోయింది.

వీరభద్రం వీధిలోకి పోయాడు.

రంగారావు ఆఫీసుకు పోయాడు.

రామ్మూర్తీ, లక్ష్మణరావూ బార్కి పోయారు.

రాజులూ, మోహన్రావు యింటి దగ్గరే సీసా తెరుచుకున్నారు.

''అన్ని విధాలా అయిన సంబంధాన్ని కాకుండా చేసాడు. రేపట్నుంచి ఆ మోహన్

గాడికి ఉంటుంది- మజా!'' అన్నాడు రామ్మూర్తి కసిగా.

రాజులు రంగారావుని తిడితే మోహన్రావు రామ్మూర్తినీ లక్ష్మణరావునీ తిట్టాడు.

***

ఆ రాత్రి రామ్మూర్తి గంగూలీకి ఒక ఉత్తరం రాసి పోస్టు చేసాడు.

''అంబళగన్ దొరకి షూటింగ్ యేసింది మోహన్రావు. వాడి మాటల్లో పడి నేనూ పక్కనున్నాను. అందుకని వాడు నన్ను బెదిరిస్తున్నాడు. మీరే నన్ను కాపాడాలి-''

***

## ఉప సంహారం

ఇరవై మూడు సంవత్సరాలు గడిచాయి.

ఉదయం టీవీలో బిజినెస్ కార్యక్రమంలో రామోస్ మోటర్స్ జనరల్ మేనేజరు ఆనంద్‌కుమార్ గంగూలీతో సంభాషణ ప్రసారం అవుతోంది.

''మారుతీ కంపెనీ ఉద్యోగస్తులు ప్రైవేటైజేషన్ ప్లాన్స్‌ని వ్యతిరేకిస్తూ సమ్మె చేస్తున్నారు. మీ అభిప్రాయం ఏమిటి?''

''ఇంకపైన యిలాంటి సమ్మెలు జరుగుతూనే ఉంటాయి. ఎంప్లాయీస్‌కి ఉద్యోగ భద్రత మీద ఆందోళన సహజం- అయితే ప్రైవేట్ పరిశ్రమల క్రింద మాత్రమే బ్రతకక తప్పదని వారు గ్రహిస్తారు. అలవాటు పడతారు''

''ఈ రకమైన సమ్మెలు విదేశీ పెట్టుబడిదార్ల స్పిరిట్స్‌ని తగ్గిస్తాయేమో!''

''నేనలా అనుకోటం లేదు. పెట్టుబడిదారుడికి సమ్మెలతో, ట్రేడ్ యూనియన్స్‌తో సహజీవనం తప్పదన్న జ్ఞానమూ ఉంది. వాటితో వ్యవహరించే అనుభవమూ ఉంది.''

''అయితే వాళ్ళు కొంత వెనకా ముందూ అవుతున్నారు గదా!''

''అఫ్‌కోర్సు! దేశీయ, ప్రాంతీయ భేదాలు ఉంటాయి. ఆ ట్రేడ్ యూనియన్స్‌తో, మనుషులతో వ్యవహరించటానికి కొంత స్థానిక అనుభవం కావాలి. సహకారం కావాలి. అది వాళ్ళు సులువుగానే మొబలైజ్ చేయగలుగుతారు. అనుభవం నాలాంటి వాళ్ళు యిస్తారు. సహకారం యివ్వవలసిన రాజకీయ నాయకులు కమిటెడ్‌గా ఉండరేమో నన్న బెంగ ప్రపంచ పెట్టుబడిదారుడిని ఆలోచింపజేస్తోంది గాని- కార్మికుల కమిట్‌మెంట్ గురించి బెంగపడి ఆలోచించవలసిన పనిలేదు-''

''మీకు ప్రస్తుత పరిస్థితులు సవ్యంగా కనిపిస్తున్నాయా?''

''భవిష్యత్ కూడ ఆశావహంగా ఉంది-''

''కార్మికుల నుంచి ప్రమాదమేం కనిపించటం లేదా? వారి కండిషన్స్-?''

''ప్రపంచవ్యాప్తంగా కార్మికుల కండిషన్స్ ఒకటి కావు. కలిగిన దేశాలలో కార్మికులు పేద దేశాల కార్మికులతో కలిసే అవకాశమే లేదు. అంతెందుకు? పెద్ద కంపెనీల వాళ్ళు చిన్న కంపెనీల వాళ్ళతో కలవలేరు. మేధోశ్రమ చేసేవాళ్ళకి యిచ్చే జీతాలు వాళ్ళ కార్మికులేనన్న అభిప్రాయమే కలగనీయవు. సంఘటిత రంగంలో కార్మికులు ఎప్పటికీ అసంఘటిత రంగంలో కార్మికుల గురించి పట్టించుకోరు. ఆ కార్మికులను సంఘటితపరచి బ్రతికే వాళ్ళు- వీళ్ళను సంఘటిత పరచటంలో చనిపోయే వాళ్ళమీద కనీస సానుభూతి కూడా చూపించరు. అంతో యింతో ఉద్యోగమున్న వాళ్ళు అసలు లేని వాళ్ళ గురించి ఆలోచించే అవకాశమే లేదు. ఇన్నింటికి తోడు- మనకి వంద పార్టీలున్నాయి. కంపెనీల ఆర్థిక సహకారం లేకుండా అవి నడిచే అవకాశమే లేదు. అందుకోసం అవి కార్మికులలో తమ పట్టుని చూపెట్టటానికయినా స్వంత కార్మిక యూనియన్లు పెట్టుకోక తప్పదు గదా! అందుకోసం అవసరమైతే వాడుకోడానికి అనేక భాషలు, మతాలు ఉన్నాయి-''

''అయితే- కార్మికుల రివల్యూషనరీని కారెక్టర్- ప్రోగ్రెసివ్ కారెక్టర్-?''

''అదంతా- యింకా కొందరు- నమ్ముతున్న ఫూలిష్ సెంటిమెంట్-''

''భారతదేశ భవిష్యత్తుని మీరు చాలా భద్రంగా భావిస్తున్నారు-''

''నేను ప్రపంచ భవిష్యత్తునే భద్రంగా భావిస్తున్నాను.''

''మీ భావనకు పునాది ఏమిటి?''

''నా అనుభవంతో నేను నేర్చుకున్న విషయమది-''

''మీ అమూల్యమైన సమయం వెచ్చించి మా స్టూడియోకి వచ్చినందుకు కృతజ్ఞులం.''

★★★

టీవీలో వస్తున్న ఆ సంభాషణ పూర్తి అయాక పటాన్ చెరువు దగ్గర కొడుకు శేషు కట్టుకున్న యింటిలో ఉంటున్న రామ్మూర్తి టీవీ కట్టేసాడు.

పడక కుర్చీలో నడుం వాల్చాడు.

పదిహేడేళ్ళ క్రితం మోహనరావు తాగుడు వల్ల వచ్చిన అల్సర్‌తో చనిపోయాడు.

లక్ష్మణరావు కొన్నాళ్ళు ఉద్యోగం చేసి, తర్వాత బనీన్ల వ్యాపారంలో స్థిరపడ్డాడు.

రాజులు వ్యాపారం అల్లుళ్ళకి అప్పగించి అదే యింట్లో ఒక్కడూ ఉంటున్నాడు. బయటకు కూడా రావటం లేదు.

రామ్మూర్తి రెండవ తమ్ముడు పటాన్ చెరువులో ఒక బీహార్ వాళ్ళ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఉద్యోగం కోసం అక్కడకు చేరిన శేషు చివరికి రౌడీ వ్యాపారంలో చేరి, ఒళ్ళు పెట్టుబడి పెట్టి, యిల్లు కట్టుకున్నాడు.

సుదర్శనం డిప్లమా అయాక, మంచి ఉద్యోగంలో చేరి, స్థిరపడ్డాక, ఖాళీగా ఉన్నపుడు, మనశ్శాంతి కోసం కథలు రాసుకుంటున్నాడు.

సంటెమ్మ సంబంధం తప్పిపోయిన వీరభద్రం వారం పది రోజులు తర్వాత ఎక్కడికో వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళు తర్వాత, కొంతకాలం రామ్మూర్తిని 'నీ తమ్ముడెక్కడ?' అంటూ ప్రశ్నించారు పోలీసులు.

పడక కుర్చీలో పడుకున్న రామ్మూర్తికి కళ్ళు మూసుకుంటే ముళ్ళమీద పడుకున్నట్లనిపించి యిబ్బందిగా అటూ యిటూ కదిలాడు.

వీధి గదిలో అతని తమ్ముడి పదిహేడేళ్ళ కూతురు కూర్చుని పిల్లలకి పాట నేర్పిస్తోంది.

అది అతని చెవిలో పడసాగింది.

''నిజంగానే, నిజంగానే
నిఖిలలోకం హసిస్తుందా?
దారుణ ద్వేషాగ్ని పెంచే
దానవత్వం నశిస్తుందా?
బానిసల సంకెళ్ళు బిగిసే
పాడుకాలం లయిస్తుందా?
సాధుతత్వపు సోదరత్వపు
స్వాదుతత్వం జయిస్తుందా?''

*(ఆహ్వానం - అక్టోబరు'95)*